



ఊళ్లపాలెం జడ్పీ హైస్కూల్‌లో అసంపూర్తిగా ఉన్న నాడు-నేడు పనులు

సింగరాయకొండ మండలంలోని 10 గ్రామాల్లో 15 సచివాలయాల నిర్మాణాలను చేపట్టగా అందులో ఇప్పటివరకూ ఒక్కటి మాత్రమే ప్రారంభించారు. వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్లు, డిజిటల్ లైబ్రరీలు ఒక్కటి కూడా వినియోగంలోకి రాలేదు. ఊళ్లపాలెంలో జడ్పీహైస్కూల్, బేసిన్ పల్లెపాలెం పాఠశాలల్లో చేపట్టిన నాడు-నేడు పనులు కూడా ఇప్పటివరకూ పూర్తి కాలేదు. గ్రామానికి సుదూరంగా ఉన్న ఉప్పుపొరలో జగనన్న లేఅవుట్ వేశారు. దీంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలకు ముందుకు రాలేదు. ఈ ఐదేళ్ల పాలనలో రోడ్డుపై గుంతలు పూడ్చిన పాపాన పోలేదని గ్రామస్థులు వాపోతున్నారు.


పెద్దన్నపాలెంలో అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనం

దొనకొండ మండలంలో మొత్తం 14 సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్‌క్లినిక్ భవనాలకు గాను కేవలం నాలుగు ప్రాంతాల్లో మాత్రమే ప్రారంభానికి నోచుకున్నాయి. ఆంధ్రజ్యోతి విజిట్ చేసిన పెద్దన్నపాలెంలో సచివాలయం, ఆర్బీకే, హెల్త్‌క్లినిక్ భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి భవనం లేదు. అలాగే ప్రభుత్వ పాఠశాల శిథిలావస్థకు చేరింది. నాడు-నేడు రెండో విడతలో రూ.72.25లక్షలతో మూడు గదులతో పాఠశాల భవనం మంజూరు కాగా దశలవారీగా రూ.19.65లక్షలు విడుదల కావడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి.


లక్ష్మక్కపల్లిలో పూర్తికాని హెల్త్‌సెంటర్ భవనం

పీసీపల్లి మండలం లక్ష్మక్కపల్లిలో రూ.21.8లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించలేదు. అలాగే నాలుగున్నరేళ్ల గడిచినా రూ.40లక్షలతో చేపట్టిన సచివాలయ నిర్మాణం పూర్తి కాలేదు. సచివాలయంలో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పంచాయతీలో డిజిటల్ లైబ్రరీ నిర్మాణమే జరగలేదు. హెల్త్‌క్లినిక్ ఇంకా నిర్మాణదశలోనే ఉంది. గ్రామంలో ఉన్న పాఠశాల భవనం పాతది కావడంతో వర్షం పడితే ఉరుస్తోంది. దీంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఇక అంగన్‌వాడీ కేంద్ర భవనం పరిస్థితి కూడా ఇంచుమించు ఇలాగే ఉంది. వైసీపీ హయాంలో గ్రామంలో చెప్పుకోదగ్గ ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదని మాజీ సర్పంచ్ కోటపాటి మాల్యాద్రి చెప్పారు.


స్కూల్‌లో నిర్వహిస్తున్న కొండపి సచివాలయం-2

కొండపి మండలంలోని కొండపి గ్రామ సచివాలయం-2 కింద కట్టావారిపాలెంను ఎంపిక చేశారు. అక్కడ సచివాలయాన్ని ఏడాదిపాటు తాత్కాలిక భవనంలో ఏర్పాటు చేశారు. దాని యజమానికి అద్దె చెల్లించకపోడంతో ఖాళీ చేయించారు. ప్రస్తుతం పాడుబడిన ప్రైవేటు స్కూల్‌లో నిర్వహిస్తున్నారు. ఇక్కడ సచివాలయం, ఆరోగ్యకేంద్రం భవనాల నిర్మాణం మూడేళ్లుగా కొనసాగుతూనే ఉంది. కట్టావారిపాలెంలో గడచిన నాలుగేళ్లుగా ఒక్క అభివృద్ధిపనీ జరగలేదు. గ్రామంలో 80 మహిళా గ్రూపులు ఉండగా, ఒక్కో గ్రూపునకు రుణం మంజూరు చేయడానికి వీవోఏ రూ.10వేలు వసూలు చేసిందని ఓ మహిళ ఆరోపించారు. చినకండ్లగుంటలో వైసీపీ వచ్చిన తర్వాత ఒక్క రోడ్డు కానీ, కాలువకానీ నిర్మించలేదు.

- పడకేసిన పల్లె ప్రగతి
- రోడ్లు, డ్రైన్‌ల ఊసేలేని ప్రభుత్వం
- అధిక ప్రాంతాల్లో పారిశుధ్యం అధ్వానం
- నాలుగేళ్లయినా కొలిక్కిరాని భవన నిర్మాణాలు
- రూ.100 కోట్ల బిల్లులు పెండింగ్
- మిల్క్ సెంటర్, డిజిటల్ లైబ్రరీల నిర్మాణాలకు బ్రేక్
- సగం ఇళ్లకు కూడా ఇవ్వని కొళాయిలు
- పాఠశాలల్లో నాడు-నేడు పనులు ఎక్కడివక్కడే
- ప్రభుత్వం మాత్రం ఆర్భాటపు ప్రచారం
- పంచాయతీలకు సమాంతరంగా సచివాలయాలు
- వైసీపీ పాలనలో కునారిల్లుతున్న గ్రామాలు


ఊళ్లపాలెంలో రద్దుచేసిన జగనన్న లేఅవుట్

పల్లెసీమలు ప్రగతికి నోచుకున్నాయని అధికార వైసీపీ చేసిన ప్రకటనలను చూసి జనం ముక్కున వేలేసుకుంటున్నారు. 2019 నుంచి ఇప్పటివరకూ గ్రామాల్లో ఒక్క సిమెంటు రోడ్డుకానీ, సైడు కాలువ కానీ నిర్మించలేదు. ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన ప్రధాన భవనాల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. కొన్నిచోట్ల అసలు ప్రారంభించనే లేదు. ఇక నాడు-నేడు పనులు నిధులు లేక నీరసంగా సాగుతున్నాయి. అలాగే ధరలు ఆకాశాన్ని అంటి గ్రామీణ ఆర్థిక వ్యవస్థలు చిన్నాభిన్నమయ్యాయి. మునుపెన్నడూ లేని విధంగా గ్రామాలు వెనుకబడ్డాయని పలువురు మండిపడుతున్నారు. మొత్తంగా గడచిన నాలుగున్నరేళ్లలో పల్లెలు అభివృద్ధికి నోచుకోకపోవడంతో ప్రజలు మార్పువైపు అడుగులు వేస్తున్నారు.

ఊరు మారలే!

ఒంగోలు,జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ పాలనలో పల్లెల ప్రగతి పడకేసింది. గ్రామీణ ప్రజలకు అవసరమైన అంతర్గత రోడ్లు, డ్రైన్లు వంటి కీలకమైన వాటి నిర్మాణాలు, అభివృద్ధి ఊసే ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అంతా అధ్వానంగా ఉంది. ఈ ప్రభుత్వం వచ్చాక ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ గ్రామ పంచాయతీలకు సమాంతరంగా పనిచేస్తోంది. ఇక గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, వివిధ సేవలు సత్వరం అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన ప్రాధాన్యతా భవన నిర్మాణాలు నాలుగేళ్లు గడిచినా కొలిక్కి రాలేదు. ఇక మిల్క్ సెంటర్లు, డిజిటల్ లైబ్రరీలు భవన నిర్మాణాలు అయితే ఆగిపోయాయి. మరోవైపు కేంద్ర సహకారంతో జలజీవన్ పథకం కింద చేపట్టిన ఇంటింటికీ కొళాయి పథకం సగం ఇళ్లకు కూడా చేరిన దాఖలాలు లేవు. పాఠశాలల్లో చేపట్టిన నాడు-నేడు పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. అయినప్పటికీ రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పల్లె ప్రగతి పేరుతో ప్రభుత్వం ఆర్భాటపు ప్రచారం చేస్తుండటంతో ఏమాత్రం మార్పులేని గ్రామాల దుస్థితిపై ప్రజల్లో విస్తృత చర్చ సాగుతోంది.

ఆగిపోయిన అభివృద్ధి

గత ప్రభుత్వ కాలంలో జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద ఎత్తున కృషి జరిగింది. రాష్ట్రప్రభుత్వం నేరుగా కొన్ని గ్రాంట్లు, ఎంపీలాడ్స్, ఎస్‌డీఎఫ్, ఎమ్మెల్యే కోటా నిధులను ఉపాధి పథకం నిధులతో అనుసంధానం చేసి భారీగా సిమెంట్ రోడ్లు, డ్రైన్లు, పాఠశాలల అభివృద్ధి పనులు, అంగన్‌వాడీలు, పంచాయతీ భవన నిర్మాణాలు, మినీగోకులం షెడ్లు, ఫిషింగ్ డ్రయ్యర్లు వంటి అనేకం చేపట్టారు. దాదాపు రూ.2వేల కోట్లతో గ్రామాల్లో ఈ తరహా పనులు చేశారు. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి అంతా ఆగిపోయింది. పంచాయతీలకు సమాంతరంగా సచివాలయ వ్యవస్థను తెచ్చిన ప్రభుత్వం.. సిబ్బంది నియామకం అయితే చేసింది కాని వారిలో అత్యధికులు చేసేందుకు పనులు మాత్రం కనిపించలేదు. ఈ వ్యవస్థ ఏర్పాటుతో పంచాయతీ పాలకవర్గాల ప్రాధాన్యత తగ్గిందన్న ఆవేదన, ఆగ్రహం సర్పంచ్‌లు, క్షేత్రస్థాయి ప్రజాప్రతినిధుల్లో అధికంగా కనిపిస్తోంది. గ్రామస్థాయిలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల మెరుగు ఊసే కరువైంది. గత ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ఉపాధి పథకం మెటీరియల్ నిధులను వినియోగించగా వైసీపీ ప్రభుత్వం వచ్చాక జగనన్న కాలనీలలో లెవలింగ్, ఇతర సదుపాయాల కల్పన పేరుతో అధికశాతం నిధులు వైసీపీ నేతల జేబుల్లోకి వెళ్లాయి. రోడ్లు, డ్రైన్ల అభివృద్ధితోపాటు పంచాయతీల్లో నిధులు లేక.. ప్రభుత్వం నుంచి గ్రాంట్లు రాక వీధిలైట్లు, తాగునీటి నిర్వహణ అంతంతమాత్రంగా సాగుతోంది. పల్లెల్లో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది.

భవన నిర్మాణాలు ఎక్కడివక్కడే..

సచివాలయ వ్యవస్థ వచ్చాక జిల్లాలో ప్రాధాన్యత భవనాల పేరుతో సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలను ప్రభుత్వం చేపట్టింది. ఒక్కో సచివాలయ భవన నిర్మాణానికి రూ.43.20 లక్షలు, ఆర్‌బీకేకు రూ.23.94 లక్షలు, హెల్త్ క్లినిక్‌కు రూ.20.80 లక్షలు కేటాయించారు. అలా రూ.231.52 కోట్లతో 531 సచివాలయాలు, రూ.115.81 కోట్లతో 484 ఆర్బీకేలు, రూ.75.92 కోట్లతో 365 హెల్త్ క్లినిక్‌లు వెరసి మొత్తం రూ.423.31 కోట్లతో 1,380 భవన నిర్మాణాలు చేపట్టారు. అయితే నాలుగేళ్లు అయినా ఇంతవరకూ అవి కొలిక్కి రాలేదు. తాజా అధికారిక లెక్కల ప్రకారం మొత్తం 1,380 భవనాల్లో 1,079 పూర్తిచేసి ఆయా శాఖలకు లేదా పంచాయతీలకు అప్పజెప్పారు. ఇంకా 309 భవనాలు అప్పగించాల్సి ఉంది. అదేసమయంలో ఆయా భవన నిర్మాణాలకు రూ.380 కోట్ల వరకు వ్యయం కాగా ఇంకా రూ.103 కోట్ల మేర వాటిని నిర్మించిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. నాల్గో వంతు భవనాలు ఇంకా పెండింగ్‌లోనే ఉండగా ఆయా శాఖలకు అప్పగించిన వాటిలోనూ వాడుకలో ఉన్నవి సగమే. కొన్నిచోట్ల అసంపూర్తిగా భవనాలు దర్శనమిస్తున్నాయి. ఇక మిల్క్ సెంటర్లు, డిజిటల్ లైబ్రరీల నిర్మాణం అసలు ఆగిపోయింది.

రాష్ట్ర వాటా ఇవ్వక ఆగిన జలజీవన్

కీలకమైన జలజీవన్ మిషన్ పనులు అడుగు ముందుకు పడటం లేదు. కేంద్ర ప్రభుత్వం ఇంటింటికీ కొళాయితో రక్షిత నీటి సరఫరాకు ఈ పథకాన్ని ప్రవేశపెట్టగా రాష్ట్రప్రభుత్వం సకాలంలో వాటా నిధులు జమచేయక పనులు ముందుకు సాగడం లేదు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 4.98లక్షల కుటుంబాలు ఉండగా 2020 ఏప్రిల్ 1నాటికి కేవలం 1.37లక్షల కుటుంబాలకు మాత్రమే కొళాయిలు ఉన్నాయి. తదనంతరం పంచాయతీ, ఇతర గ్రాంట్లతో 65వేల కుటుంబాలకు ఏర్పాటుచేయగా.. జలజీవన్ మిషన్ కింద 2.97లక్షల కుటుంబాలకు కొళాయిలు ఏర్పాటుకు సంకల్పించారు. అయితే నాలుగేళ్లు గడిచినా ఇంతవరకు కేవలం లక్షా 19వేల కుటుంబాలకు మాత్రమే కొళాయి సౌకర్యం కల్పించగా.. ఇంకా 1.77లక్షల కుటుంబాలకు జాడలేదు. ఇందుకు సంబంధించి గుర్తించిన 2,649 పనులలో 668 మంజూరే కాకపోగా మిగిలిన వాటిలో సగం కూడా పూర్తికాలేదు. ఇక పాఠశాలల్లో నాడు-నేడు పనుల పరిస్థితి కూడా అలాగే ఉంది. మూడేళ్లలో అన్ని పాఠశాలల రూపురేఖలు మార్చుతామని ప్రభుత్వం ప్రకటించినా తొలిదశలో 1,069 స్కూళ్లలో చేపట్టిన పనుల్లో ఇంకా కొన్ని మిగిలి ఉన్నాయి. రెండోదశలో రూ.417 కోట్లతో 977 స్కూళ్లు, కాలేజీల్లో పనులు చేపట్టగా రెండేళ్లు గడిచినా కేవలం రూ.188 కోట్ల మేర పనులు మాత్రమే పూర్తయ్యాయి. అయితే వైసీపీ ప్రభుత్వం మాత్రం పల్లెలు వెలిగిపోతున్నట్లు ప్రచారం చేసుకోవడాన్ని చూసి జనం విస్తుపోతున్నారు.




వీరభద్రాపురంలో వినియోగంలో లేని చెత్తసంపద కేంద్రం

పామూరు మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను గత టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసింది. జనాభా ప్రాతిపదికన కేంద్రాల నిర్మాణాలకు నిధులు కేటాయించింది. పామూరు, బొట్లగూడూరు మినహా మిగిలిన చెత్తసంపద కేంద్రాలు వినియోగంలోకి తీసుకురావడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైంది. లక్షలు ఖర్చుచేసి నిర్మించిన కేంద్రాలు ఎందుకూ పనికి రాకుండా పోయాయి. కొన్నిచోట్ల కేంద్రానికి సంబంధించిన రేకులను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు.


చిల్లచెట్లు మొలిచిన చినకండ్లగుంటలోని జగనన్న కాలనీ

కొండపి మండలంలో కొండపి, చినకండ్లగుంట, వెన్నూరు, ముప్పవరం, కె.ఉప్పలపాడు, ఇలవర, పెట్లూరు, చోడవరం గ్రామాల్లో జగనన్న లేఅవుట్లు ఆగిపోయాయి. నాయకులు అనువుగా లేనిచోట స్థలాలను ఎంపిక చేయడంతో ప్రజలు గృహ నిర్మాణాలకు ముందుకు రాలేదు. దీంతో జగనన్న లేఅవుట్లన్నింటినీ ప్రభుత్వం రద్దు చేసింది. ప్రస్తుతం అవి చిల్లచెట్లతో దర్శనమిస్తున్నాయి. మొత్తంగా గ్రామాలు బాగుపడకపోగా, గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధికి నోచుకోలేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

రెండో రోజూ అదే పరిస్థితి

పనిచేయని సర్వర్.. కులగణనకు అవరోధం

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 20 : జిల్లావ్యాప్తంగా శుక్రవారం నుంచి మొదలైన కులగణన సర్వేకు సర్వర్ సమస్య అడ్డంకిగా మారింది. రెండోరోజైన శనివారం కూడా అనేక ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ ఆదేశాలతో సచివాలయ సిబ్బంది, వలంటీర్ల నేతృత్వంలో ఇంటింటికీ తిరుగుతూ సర్వే చేస్తున్నారు. జిల్లాలోని 719 గ్రామ, వార్డు సచివాలయాల్లో ఈ సర్వే జరుగుతుండగా సర్వర్ సక్రమంగా పనిచేయకపోవడంతో వివరాల నమోదుకు ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఈ సర్వే పూర్తిస్థాయిలో సెల్‌ఫోన్ ద్వారా నమోదు చేయాల్సి ఉండటం, కొంత సమాచారం అందులోనే ఉండటంతో సర్వర్ పనిచేయక వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఎక్కువసేపు ఒక ఇంటి వద్దనే ఉండాల్సి వస్తోంది. ఆ కుటుంబంలోని అన్ని వివరాలు నమోదు చేసేందుకు అధిక సమయం పడుతోంది. ఈ పరిస్థితి జిల్లాలోని అన్ని చోట్లా ఉన్నట్లు తెలుస్తోంది. ఒంగోలులోని శివారు కాలనీల్లో కూడా సర్వర్ పనిచేయక సిబ్బంది పడిగాపులు కాయాల్సి వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో సర్వే జరుగుతుండటంతో సర్వర్‌పై ఒత్తిడి పెరిగి డౌన్ అవుతుందని ఉన్నతాధికారులు చెప్తున్నట్లు సమాచారం.

డీకే భూములకు ఎసరు!

- నిబంధనలకు విరుద్ధంగా పట్టాల్లో పేర్లు మార్పు
- వివాదాస్పదమవుతున్న అధికారుల తీరు
- ఉన్నతాధికారులకు ఫిర్యాదులు


ప్లాట్లు వేసేందుకు సిద్ధం చేస్తున్న చేతులుమారిన డీకే భూమి

దర్శి, జనవరి 20 : దర్శి ప్రాంతంలో డీకే పట్టా భూములు యథేచ్ఛగా చేతులు మారుతున్నాయి. పట్టాల్లో పేర్లు మార్చి ఇతరులకు కట్టబెట్టే వ్యవహారం జోరుగా సాగుతోంది. ఇలా నిబంధనలకు విరుద్ధంగా క్రయవిక్రయాలు జరపటమే కాకుండా, కొంతమంది ప్లాట్లు వేసి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. తమకు అన్యాయం జరిగిందని పలువురు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతోపాటు కార్యాలయానికి వచ్చి గొడవకు దిగుతున్నారు. ఇందుకు రెండు రోజుల క్రితం జరిగిన ఘటన నిదర్శనంగా నిలుస్తోంది. దర్శి-పొదిలి రోడ్డులోని 908/3 సర్వే నెంబర్‌లో ఎకరం భూమిని 1991లో ఎ.అచ్చయ్య అనే వ్యక్తికి డీకే పట్టా ఇచ్చారు. రెవెన్యూ అధికారులు ఆ పట్టాను రద్దు చేసి అదేభూమిని కె.సామ్యేల్ అనే వ్యక్తికి ఇచ్చారు. 2010లో ఆ భూమిని ఓర్సు తిరుపతమ్మ అనే మహిళ కొనుగోలు చేసి రిజిస్టర్ చేయించుకుంది. ఇటీవల కొంతమంది వ్యక్తులు ఆ భూమిని కొనుగోలు చేసి ప్లాట్లు వేస్తున్నారు.

పట్టా మార్పు వివాదాస్పదం

కడపకు చెందిన వ్యాపారవేత్త శశికుమార్ అనే వ్యక్తి రెండు రోజుల క్రితం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి పట్టా మార్పుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 1991లో రిటైర్డ్ మిలటరీ ఉద్యోగి అయిన అచ్చయ్యకు ప్రభుత్వం ఆభూమి కేటాయించి డీకే పట్టా ఇచ్చిందన్నారు. 2007లో అచ్చయ్య కుటుంబసభ్యుల నుంచి తాను కొనుగోలు చేసి స్వాధీనం రాయించుకున్నానని చెప్పారు. అచ్చయ్య కుటుంబసభ్యులకు తెలియకుండా రెవెన్యూ అధికారులు ఆ పట్టాను రద్దుచేసి ఇతరులకు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. అందుకు సంబంధించిన రికార్డులు తమకు ఇవ్వాలని సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసి నెలలు గడుస్తున్నప్పటికీ అధికారులు సమాచారం ఇవ్వకుండా ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయటమే కాక న్యాయపోరాటం చేస్తామని శశికుమార్ హెచ్చరించారు. కాగా ఈ వ్యవహారంలో రెవెన్యూ అధికారులు చేతివాటం చూపినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

వాగుపోరంబోకుకు రికార్డులు


ఆక్రమణకు గురైన వాగు పోరంబోకు భూమి

దర్శి-పొదిలి రోడ్డులోని 911 సర్వేనెంబర్‌లోని వాగు పోరంబోకు భూమి యథేచ్ఛగా ఆక్రమణలకు గురవుతోంది. దశలవారీగా కొంతమంది వాగు భూమిని కబ్జా చేయడంతో ప్రస్తుతం అక్కడ వాగు మాయమ య్యే పరిస్థితి నెలకొంది. ఆ భూమిలో విచ్చలవిడిగా నిర్మాణాలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవటం లేదు. వాగుపోరంబోకు భూమిపై తమ పూర్వీకులకు హక్కు ఉందని, వారసత్వంగా తమకే వస్తుందని ఒక వ్యక్తి కొద్దిరోజుల క్రితం రికార్డులను బయటపెట్టారు. ఆ భూమి రికార్డుల్లో ప్రైవేటు వ్యక్తుల పేర్లు ఎలా నమోదయ్యాయో అర్థం కాని పరిస్థితి. కానీ తనకు హక్కు కల్గిన భూమిని కేటాయించాలని ఆ వ్యక్తి కోరడంతో అధికారులు తలలుపట్టుకుంటున్నారు. రికార్డుల్లోకి అతని పేరు ఎలా ఎక్కిందనే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం.

నకిలీ పత్రాలతో మాయ

ఇటీవల కాలంలో దర్శిలో నకిలీపత్రాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. కొంతకాలం క్రితం 80ఎకరాల ప్రభుత్వ భూమికి నకిలీ పట్టాలు సృష్టించి కొందరు వ్యక్తులు ఇతరులకు విక్రయించే ప్రయత్నాలు చేశారు. ఆ విషయాన్ని గుర్తించిన గ్రామస్థులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో పాస్ పుస్తకాలు తెప్పించి పరిశీలించగా నకిలీవని తేలింది. అదేవిధంగా కురిచేడు రోడ్డులో ఒక భూమి విషయంలో కూడా నకిలీ పట్టాలు సృష్టించి విక్రయించే ప్రయత్నాలు చేశారు. భూములకు, స్థలాలకు ధరలు విపరీతంగా పెరగటంతో కొంతమంది అక్రమార్కులు స్థలాలను, భూములను ఆక్రమించుకునేందుకు అక్రమ మార్గాలను ఎంచుకొంటున్నారు. కొంతమంది వివాదాలు సృష్టించి పంచాయితీలు చేసి లబ్ధి పొందుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే భూ వివాదాలు మరింత పెరిగే అవకాశం ఉంది.

చట్టపరంగా చర్యలు తీసుకుంటాం

ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా పటిష్ట చర్యలు తీసుకుంటాం. డీకే పట్టా మార్పు విషయాన్ని పరిశీలిస్తున్నాం. పాత రికార్డులు బయటకు తీసి వాస్తవాలు నిగ్గుతేల్చుతాం. వాగు పోరంబోకు భూమి రికార్డుల్లో ప్రైవేటు వ్యక్తుల పేర్లు ఎలా ఎక్కాయో పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

- ఎ.రవిశంకర్, డిప్యూటీ తహసీల్దార్



ఘనంగా జనార్దన్ పుట్టినరోజు వేడుకలు


ఒంగోలులో టీడీపీ శ్రేణుల బైక్ ర్యాలీ (ఇన్‌సెట్‌లో) కేక్ కట్ చేస్తున్న జనార్దన్

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఒంగోలు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పుట్టినరోజు వేడుకలు శనివారం అట్టహాసంగా జరిగాయి. స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానుల కోలాహలం మధ్య ఆయన కేక్‌ను కట్ చేశారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపేందుకు తెలుగు తమ్ముళ్లు పోటీపడ్డారు. అంతకుముందు దామచర్ల కుటుంబ సభ్యులతో కలిసి వల్లూరమ్మ ఆలయంలో పూజలు చేశారు. అనంతరం దక్షిణ బైపాస్‌లోని మినీ స్టేడియంకు చేరుకున్న ఆయనకు అభిమానులు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి పార్టీ కార్యాలయం వరకూ భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. వేలాది మంది టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు. మరోవైపు నగరంలోని పలు ప్రాంతాల్లో తెలుగు తమ్ముళ్లు జనార్దన్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు.

- ఒంగోలు కార్పొరేషన్



జిల్లాకు ఆర్థిక సంఘం నిధులు

- పంచాయతీల ఖాతాల్లో రూ.37.57 కోట్లు
- వడ్డీ రూపేణా మరో రూ.34.82లక్షలు జమ

ఒంగోలు (కలెక్టరేట్), జనవరి 20 : గ్రామ పంచాయతీలకు ఎట్టకేలకు ఆర్థిక సంఘం నిధులు మంజూరయ్యాయి. 2022-23 సంవత్సరానికి సంబంధించి రెండో విడత రూ.37.57 కోట్లు, వడ్డీ రూపేణా మరో 34.82 లక్షలు విడుదలయ్యాయి. అన్‌టైడ్ కింద రూ.14.95 కోట్లు, వడ్డీ కింద రూ.13.60 లక్షలు, టైడ్ కింద రూ.22.62 కోట్లు, వడ్డీ కింద రూ.21.22 లక్షలను ఇచ్చింది. అన్‌టైడ్ కింద మంజూరు చేసిన నిధులను ఇప్పటికే పంచాయతీ అకౌంట్లకు జమచేయగా, టైడ్ కింద ఇచ్చిన నిధులునాలుగైదు రోజుల్లో పంచాయతీ అకౌంట్లకు పీఎఫ్ఎంఎస్ ద్వారా జమ కానున్నాయి. ఈ నిధులను గ్రామాల్లో డ్రైన్ల నిర్మాణం, ఎల్ఈడీ బల్బుల ఏర్పాటుతోపాటు తాగునీటికి వినియోగించుకునేందుకు అవకాశం ఏర్పడింది.


33వ డివిజన్‌లో మాట్లాడుతున్న దామచర్ల జనార్దన్


దామచర్లకు బొకే ఇస్తున్న కోటపాటి జనార్దన్‌రావు



దామచర్లను పూలమాలతో సత్కరిస్తున్నహనీఫ్‌ఖాన్, నాయకులు

ఘనంగా దామచర్ల జన్మదిన వేడుకలు

- అభిమాన నేతకు ఆత్మీయ శుభాకాంక్షలు
- టీడీపీ శ్రేణులు, స్నేహితులు, అభిమానుల మధ్య కేక్ కట్ చేసిన దామచర్ల
- నగరంలో తెలుగు తమ్ముళ్ల భారీ ర్యాలీ

ఒంగోలు(కార్పొరేషన్), జనవరి 20: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ జన్మదిన వేడుకలు ఒంగోలు నగరంలో శనివారం ఘనంగా జరిగాయి. స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన జన్మదిన వేడుకల్లో ఆయన అభిమానుల ఆప్యాయతల మధ్య కేక్ కట్ చేసి సంతోషాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా దామచర్లకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపేందుకు పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చారు. బొకేలు అందజేయడంతో పాటు పలువురు శాలువాలు కప్పి సత్కరించారు. ఇదిలా ఉండగా పలు టీడీపీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌లను దామచర్ల కట్ చేశారు. కాగా ఉదయం వల్లూరమ్మ దేవస్థానంలో దామచర్ల జనార్దన్ కుటుంబసభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం రాత్రి నుంచే స్థానిక బీకే ఎన్‌క్లేవ్ దామచర్ల అభిమానుల రాకతో సందడి నెలకొంది. ఈ సందర్భంగా పార్టీ ముఖ్య నాయకులు, రాష్ట్ర నాయకులు, పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు జనార్దన్‌కు జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు.

శుభాకాంక్షల వెల్లువ

దామచర్ల జనార్దన్‌కు పలువురు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ నాయకులు కోటపాటి జనార్దన్‌రావు, మేడికొండ మోహన్‌రావు, గుమ్మళ్ళ సుబ్బారావు, శ్యామల కాశిరెడ్డి, దామచర్ల నరసింహారావు, సోమినేని రవీంద్ర, పంగులూరి శ్రీకాంత్‌బాబు, పఠాన్ హనీఫ్‌ఖాన్, హర్షిణి విద్యాసంస్థల చైర్మన్ గోరంట్ల రవికుమార్, వలివర్తి శేషంరాజు, కుర్రా రాంబాబు, నాదెండ్ల శ్రీనివాసరావు, రావిపాటి శ్రీనివాసరావు, రుద్రవరం గ్రామానికి చెందిన నార్నే శ్రీనివాస్, ఎం.మురళీకృష్ణ, ఈదర విష్ణువర్ధన్, శిరిపురపు అనంతకృష్ణ, రావి శ్రీనివాస్, నాగులుప్పలపాడుకు చెందిన గుమ్మడి సాయిబాబు, కాకర్ల లక్ష్మీ వరప్రసాద్ (చిన్నా), చాగంటి శ్రీహరి, వీవీకే.చౌదరి, కామేపల్లి చెంచయ్య, నారాయణమ్మ, తాండ్ర వెంకటేశ్వర్లు, వేగనాటి అల్లూరయ్య, తోట కోటేశ్వరరావు, వల్లపునేని ఆదినారాయణ, వైకే.చౌదరి, దుగ్గెంపూడి కోటేశ్వరరావు, ఫణిదపు అనంతరాములు, సింగమనేని హనుమంతరావు, విప్పర్ల వెంకటశేషయ్య, దరిశి నియోజకవర్గానికి చెందిన ఆర్ల శివరాంప్రసాద్, కూరపాటి శ్రీను, యాదగిరి వాసు, బి.ఓబులరెడ్డి, ఎస్.శివకోటేశ్వరరావు, వి.నెమిలయ్య గుడిపూడి ప్రసాద్, ఇతర నగరాలలో ఉంటున్న దామచర్ల స్నేహితులు జీజే.రవీంద్రనాథ్, ఎం.రవిబాబు, ఈపీ యోగేంద్రనాథ్, ఈపీ సంతోష్‌కుమార్, పి.కళ్యాణ్‌చక్రవర్తి, చేకూరి జయచంద్ర, జి.సుకుమార్‌నాయుడు, కె.అజయ్‌కుమార్, కె.అనిల్‌కుమార్, పి.ప్రవీన్, సి.దీపక్, అలాగే చిత్తూరుకు చెందిన గురజాల జగన్మోహన్, శింగమనేని తేజ సుధాచరణ్, టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు రాయపాటి రవీంద్ర, వీరగంధం దేవేంద్రనాథ్‌చౌదరి, చుండూరి రఘురామ్, పాటిబండ్ల వెంకటేశ్వర్లు, మలినేని లక్ష్మీనారాయణ, కందిమళ్ళ బ్రహ్మయ్య, మద్దిన రవికిరణ్, రావుల పద్మజ, మండవ లావణయ్య, పసుపులేటి సునీత, బండారు మదన్, తమ్మిశెట్టి రమాదేవి, పోలవరపు సురేష్‌బాబు, పులివర్తి బసవయ్యనాయుడు, పల్లపోతు దుర్గాప్రసాద్, మండవ జయంత్‌బాబు, తాళ్లూరి పార్థసారధి, పాలపర్తి లక్ష్మీనారాయణ, దివి రోశయ్య, ఒంగోలు రూరల్ నాయకులు పోలవరపు వెంకట్రామయ్య, కామేపల్లి శ్రీనివాసరావు, నలమోతు బాలగంగాధర్, మక్కెన శ్రీనివాసరావు, గుండపనేని శ్రీనివాసరావు, మండవ వెంకటసుబ్బయ్య, నన్నపనేని వెంకటేశ్వరరావు, యర్రమనేని నరసింహారావు, యర్రంనేని వెంకటశేషయ్య, యర్రా ఆంజనేయులు, కొక్కెలగడ్డ ప్రభాకర్‌రావు, సీహెచ్.సోమరాజు, మారెళ్ళ రామకృష్ణ, కోమటనేని ఉదయభాస్కర్, అన్న వెంకటేశ్వర్లు, పాతూరి పూర్ణచంద్రరావు, పిలుట్ల సుధాకర్‌రావు, పాలూరి బాపయ్యచౌదరి, పెంట్యాల రాధాకృష్ణ, మారెళ్ళ రాజేంద్రప్రసాద్, పోలవరపు శ్రీనివాసరావు, కారుమూడి ప్రభాకర్‌రావు, పోవలవరపు చెంచురామయ్య, కారుమూడి గోపీనాథ్, ముప్పవరపు శ్రీనివాసరావు, పాలేటి ప్రభాకర్‌రావు, గొలిమి చంద్రమౌళి, శింగోతు వెంకటేశ్వర్లు, గద్దె వెంకటకృష్ణ, శింగోతు ఏడుకొండలు, గొర్రెముచ్చు శేఖర్, అంచెల సుబ్బారావు, గుట్లపల్లి రవితేజ, చుంచు శింగయ్య, పుచ్చకాయల సుబ్బారావు, దొడ్డ రామకృష్ణారెడ్డి, చప్పిడి శేషయ్య, గల్లా సురేష్‌బాబు, వలేటి రాంబాబు, కంటినేని సుబ్బారావు, చెరుకూరి రామకృష్ణ, కంకణాల శ్రీనివాసులు, వడ్లమూడి బాలాజీ, చేజర్ల పవన్‌కుమార్, పసుపులేటి వెంకటయ్య, ఒంగోలులోని న్యూ ఇందిరమ్మ కాలనీ టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు దామచర్లకు శుభాకాంక్షలు తెలిపారు.


ర్యాలీలో కత్తి చూపుతూ శ్రేణులను ఉత్సాహపరుస్తున్న దామచర్ల


జనార్దన్‌తో మండవ జయంత్‌బాబు

మినీ స్టేడియం నుంచి ర్యాలీగా..

వల్లూరమ్మ గుడిలో ప్రత్యేక పూజల అనంతరం నగరంలోకి ప్రవేశించిన దామచర్ల జనార్దన్ దంపతులకు అభిమానులు ఘన స్వాగతం పలికారు. స్థానిక మినీ స్టేడియం నుంచి టీడీపీ కార్యాలయం వరకు నిర్వహించిన బైక్, కార్ ర్యాలీలో వేలాదిగా శ్రేణులు పాల్గొన్నారు. బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. కాన్వాయ్‌లోని కారుపైకి ఎక్కిన దామచర్ల అందరికీ అభివాదం చేస్తూ సాగారు. దామచర్లకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపేందుకు విచ్చేసిన వారితో పార్టీ కార్యాలయం కళకళలాడింది. మరోవైపు నగరంలోని పలు ప్రాంతాల్లో దామచర్ల అభిమాను నేతృత్వంలో పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు.

33వ డివిజన్‌లో..

నగరంలోని 33వ డివిజన్‌లో జరిగిన జన్మదిన వేడుకల్లో దామచర్ల జనార్దన్ హాజరై కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు నల్లూరి రవి, మండే శ్రీమన్నారాయణ, కృష్ణమోహన్, మురళీ, శారదాదేవి, రాంబాబు, సుబ్రహ్మణ్యం, బూత్ ఇన్‌చార్జులు యలమంద, యోనా, అంకయ్య ప్రవీణ్ తదితరలుఉ పాల్గొన్నారు.

'బొమ్మరిల్లు'లో..

దామచర్ల జనార్దన్ పుట్టినరోజు వేడుకలను శనివారం నగరంలోని భాగ్యనగర్‌లోని బొమ్మరిల్లు అనాథ ఆశ్రమంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జనార్దన్ సతీమణి నాగసత్యలత పార్టీ శ్రేణులతో కలిసి చిన్నారుల మధ్య కేక్ కటింగ్ చేసి 70 మంది చిన్నారులకు విందు ఏర్పాటు చేశారు. బొమ్మరిల్లు నిర్వాహకులు దామచర్ల కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు.

అనాథలకు అన్నదానం

ఒంగోలు(కల్చరల్): టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ జన్మదినం సందర్భంగా శివం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఆర్కేసీ ఫుడ్స్ అధినేత చుండూరి రామకృష్ణ సహకారంతో స్థానిక రిమ్స్ ఆస్పత్రి ఆవరణలో అనాథలకు జనార్దన్ సతీమణి నాగసత్యలత అన్నదానం చేశారు. ఈ సందర్భంగా తెలుగు మహిళ మండవ లావణ్య మాట్లాడుతూ ఒంగోలు నియోజకవర్గ అభివృద్ధికి దామచర్ల జనార్దన్ ఎంతో కృషి చేశారని, అందుకే ప్రజలకు ఆయనపై ప్రత్యేక అభిమానం ఉందన్నారు. కార్యక్రమంలో దుర్గ మల్లేశ్వరి, శివం ఫౌండేషన్ వ్యవస్థాపకులు గొల్లపూడి శ్రీహరి, మారెళ్ల సుబ్బారావు, కోసూరి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.


జనార్దన్‌కు బొకే ఇస్తున్న మోహన్


బొమ్మరిల్లులో కేక్ కట్ చేస్తున్న నాగసత్యలత

బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా

నేడు, రేపు ప్రత్యేక కార్యక్రమాలు

ఒంగోలు(కల్చరల్), జనవరి 20: అయోధ్యలో సోమవారం జరిగే బాలరాముని విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా ఆది, సోమవారం జిల్లావ్యాప్తంగా పలు కార్యక్రమాలను వివిధ హిందూ ధార్మిక సంఘాలు నిర్వహించనున్నాయి. ఇప్పటికే అయోధ్య నుంచి వచ్చిన అక్షతలు, శ్రీరాముని చిత్రపటం మొదలైన వాటిని ప్రతి ఇంటికీ పంపిణీ చేశారు. ఇక ఆదివారం అనేక దేవాలయాల్లో శ్రీసీతారాముల కళ్యాణాలు, శోభాయాత్రలు ఘనంగా నిర్వహించటానికి ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఒంగోలు నగరం అమలనాధుని వీధిలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఉదయం 9 గంటలకు సీతారామ కళ్యాణం నిర్వహిస్తున్నట్లు తదియారాధన కమిటీ తెలిపింది. ఒంగోలు ఫ్రెండ్స్ క్లబ్, ఇతర ధార్మిక సంఘాల నిర్వహణలో ఆదివారం సాయంత్రం 3 గంటలకు గడియారంవారివీధి శ్రీఅనంత కోదండరామస్వామి దేవస్థానం దగ్గర నుంచి గాంధీరోడ్డు గీతామందిరం వరకు వెండిరథం, 125 కలశాలతో శోభాయాత్ర నిర్వహించనున్నారు. స్థానిక అంజయ్యరోడ్డు ఆంధ్రకేసరి విద్యాకేంద్రంలో ఉదయం 9 గంటల నుంచి సంస్కార భారతి ఆధ్వర్యంలో విద్యార్థులచే శ్రీరాముని వేషధారణలు, కవితా రచన, పఠన పోటీలు, దేశభక్తి గీతాల బృందగానం పోటీ, చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నారు.

ఇక బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ జరుగనున్న 22వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు స్థానిక సంతపేట శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంలో శ్రీసీతారామ కళ్యాణోత్సం నిర్వహిస్తున్నట్లు దేవస్థాన ప్రతినిధులు తెలిపారు. అదేవిధంగా ప్రతిష్ఠా మహోత్సవాన్ని ప్రత్యక్షంగా భక్తులు చూసేందుకు వీలుగా స్థానిక గాంధీరోడ్ శ్రీకోదండ రామస్వామి దేవస్థానంలో అతి పెద్ద స్క్రీన్ ఏర్పాటు చేస్తున్నట్లు దేవస్థాన ప్రతినిధులు గుర్రం సత్యనారాయణ, గుర్రం రంగనాథ్ తెలిపారు. రామునిపై విద్యార్థుల భక్తిగీతాలాపన, రామభజ, శ్రీరాముని వేషధారణ పోటీలు, రామాయణ అంశాలపై క్విజ్, రామసేవకులకు సన్మానం మొదలైనవి ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు.

కులగణనను పారదర్శకంగా చేపట్టాలి

- రాష్ట్ర అధ్యక్షుడు శంకరరావు డిమాండ్

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 20: రాష్ట్రంలో చేపట్టిన బీసీ కులజనగణనను అధికార పార్టీ పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు డిమాండ్ చేశారు. ఒంగోలులోని సంఘ కార్యాలయంలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పారదర్శకంగా కులగణన చేపట్టడం ద్వారా వాస్తవ సమాచారం వెలుగులోకి వస్తుందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో బీసీలకు మూడు అసెంబ్లీ స్థానాలను కేటాయించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన సంక్షేమ స ంఘం అధ్యక్షుడు కుమ్మరి క్రాంతికుమార్, జిల్లా అధ్యక్షుడు బలగాని ఆంజనేయులు, షేక్ అజీజ్, కేవీ.శేషమ్మ, దేవరంపాటి శ్రీదేవి, వంకేశ్వర గోవింగ్, పోతులూరి శివ బ్రహ్మచార్యులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శంకరరావు

పండరీపురంలో చోరీ

ఒంగోలు(క్రైం), జనవరి20: ఒంగోలు నగరం పండరీపురంలో దుండగులు సుమారు రూ.3లక్షల విలువైన సొత్తును అపహరించుకువెళ్లారు. ఈ సంఘటన శనివారం తెల్లవారుజామున జరిగింది. పండరీపురంలోని ఎ.శ్రీకాంత్ ఇంట్లో గుర్తు తెలియని దొంగలు వెనుక వైపు తలుపు తీసుకొని లోపలికి చొరబడ్డారు. బెడ్‌రూంలో శ్రీకాంత్ కుటుంబసభ్యులు నిద్రిస్తుండగా అక్కడ బ్యాగ్‌లో ఉన్న రూ.20వేల నగదు, మూడు సెల్‌ఫోన్లు, బంగారం చైను, కమ్మలు సుమారు రూ.3లక్షల విలువైన సొత్తును చోరీ చేశారు. సమాచారం అందుకున్న ఏఎస్పీ క్రైమ్స్ శ్రీధర్‌బాబు, సీఐ లక్ష్మణ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మేరుగ పరిచయవేదికలో సమస్యల గళం

- బిల్లుల కోసం నాయకుల గగ్గోలు
- మౌనముద్రలో మంత్రి నాగార్జున
- సర్దిచెప్పిన శివప్రసాదరెడ్డి

చీమకుర్తి, జనవరి20 : "మేము పనులు చేసి ఆరునెలలు దాటుతోంది. మా బిల్లులు పరిస్థితి ఏమిటి? మా గ్రామాల్లో కరెంట్, తాగునీటి సమస్యలను పరిష్కరించేది ఎప్పుడు? మా ఊరి రోడ్లు గుంతలమయంగా మారాయి, వాటికి ఎప్పుడు మరమ్మతులు చేస్తారు..?" ఇలా చీమకుర్తి మండలంలోని వైసీపీ సర్పంచ్, ఎంపీటీసీ, ముఖ్యనాయకులు గగ్గోలు పెట్టారు. మండలానికి కొత్తగా పరిచయం కోసం వచ్చిన మంత్రి మేరుగ నాగార్జున, నాయకుల గగ్గోలు దెబ్బకు మౌనముద్ర వహించారు. అయితే మండలాన్ని తన కనుసన్నల్లో ఏలుతున్న మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి తనదైన శైలిలో నాయకులను సముదాయించి, వారి సమస్యలను పరిష్కరించాలని అక్కడే ఉన్న అన్ని శాఖల అధికారులకు సూచించి సంతృప్తి పరిచారు. సంతనూతలపాడు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జిగా నియమితులైన జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగ నాగార్జున పరిచయ వేదిక శనివారం చీమకుర్తి మండల పరిషత్ కార్యాలయంలో బూచేపల్లి శివప్రసాదరెడ్డి అధ్యక్షతన జరిగింది. మంత్రి నాగార్జున, జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని కీలక ప్రజాప్రతినిధులు, నాయకులు అన్ని గ్రామాలు, పట్టణం నుంచి హాజరై తమ గోడును వెళ్లబోసుకున్నారు. దాదాపు ప్రతి గ్రామం నుంచి తమ సమస్యలను తెలిపారు. ముఖ్యంగా తాము గ్రామాల్లో నిర్వహించిన పనులకు నెలలు గడుస్తున్నా బిల్లులు చెల్లింపు రాలేదని, ఎన్నికలు దగ్గర పడుతన్న తమ పరిస్థితి ఏమిటని ఆందోళన వ్యక్తం చేశారు. బూచేపల్లి శివప్రసాదరెడ్డి వారిని సముదాయిస్తూ త్వరలోనే సీఎఫ్ఎంస్‌కు వెళ్లిన బిల్లులుకు మోక్షం లభిస్తుందన్నారు. అలాగే తమ గ్రామాల్లో నెలకొన్న కరెంట్, రోడ్ల మరమ్మతులు, తాగునీటి సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం మంత్రి నాగార్జున, జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మలు మాట్లాడారు. మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహనరెడ్డి గెలుపు కోసం అందరూ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. నాగార్జునను గతం కన్నా ఎక్కువ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజ్యలక్ష్మి, వైసీపీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, శేఖరరెడ్డి, ఓబుల్‌రెడ్డి, అధికారులు నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి నాగార్జున

డ్వాక్రా గ్రూపు రుణాల గోల్‌మాల్‌పై విచారణ

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్), జనవరి 20: నాగులుప్పలపాడు మండలం ఒమ్మెవరం గ్రామంలో డ్వాక్రాగ్రూపు రుణాల గోల్‌మాల్‌పై శనివారం వెలుగు ఏపీఎం రవికుమాంర్, సీసీ కవిత విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా బ్యాంక్ ఖాతాలలో నగదు మార్పిడి జరిగినట్లు తేల్చారు. బ్యాంక్ ఖాతాలలో నగదు మార్పిడికి వెలుగు యానిమేటర్ కోట అనిత ఫోర్జరీ సంతకాలు చేసినట్లు గుర్తించారు. సుమారుగా రూ.35 లక్షలు స్వాహా చేశారని డ్వాక్రా గ్రూపు మహిళలు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో వీఏ కోట అనిత, ఆమె కుమారులు వంశీకృష్ణ, నితిన్‌లపై పోలీసులు కేసు నమోదు చేయటంతో గ్రామం వదిలి పరారయ్యారు. బ్యాంక్ ఖాతా నుంచి నగదు తీసుకోవాలంటే పలు రకాలుగా సంతకాలు తనిఖీలు చేసి నగదు ఇస్తారు. అయితే ఇక్కడ అంత పెద్ద మొత్తంలో నగదు అక్రమంగా తీసుకుంటే బ్యాంక్ అధికారులు ఎలాంటి తనిఖీలు చేయకపోడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నగదు గోల్‌మాల్‌లో వెలుగు సిబ్బంది పాత్రకూడా ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని డ్వాక్రా మహిళలు కోరుతున్నారు.


విచారణ చేస్తున్న వెలుగు అధికారులు

కర్నూల్‌రోడ్డు యమడేంజర్..!

గోతులమయంగా రహదారి ● వాహనదారుల అవస్థలు

సంతనూలపాడు, జనవరి 20: ఒంగోలు నగర పరిధిలోని కర్నూల్‌రోడ్డు గోతులమయంగా మారి ప్రమాదకరంగా తయారైంది. దీంతో వాహనదారులు అల్లాడుతున్నారు. ప్రధానంగా పేర్నమిట్ట సమీపంలోని పాలకేంద్రం వద్ద కర్నూలురోడ్డు అత్యంత ప్రమాదకరంగా మారింది. ఇక్కడ ప్రతి రోజూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈక్రమంలో శనివారం పేర్నమిట్ట నుంచి ఒంగోలు వైపునకు ద్విచక్రవాహనంపై ఓ యువకుడు ప్రయాణిస్తూ పాలకేంద్రం వద్ద ఏర్పడ్డ పెద్దగుంత వద్ద అదుపుతప్పి కిందపడ్డాడు. వెంటనే పక్కనే ఉన్న కొందరు అతడిని పైకి లేవదీశారు. అదృష్టవశాత్తు అదే సమయంలో ఎటువంటి వాహనాలు రాకపోవడంతో ప్రాణాపాయం తప్పి చిన్నపాటి గాయాలతో బయటపడ్డాడు. నిత్యం ఇదేరోడ్డుపై వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. సంబంధిత అధికారులు మొద్దునిద్ర వీడి పాలకేంద్రం వద్ద కర్నూల్ రోడ్డుపై ఏర్పడ్డ గుంతకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.




గుంతలతో బైక్‌పై నుంచి కిందపడిన యువకుడు, సహాయం చేస్తున్న స్థానికులు

అవీ..ఇవీ..

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు నగరం, జనవరి 20: స్త్రీశిశు సంక్షేమశాఖ ఒంగోలు అర్బన్ ప్రాజెక్టు పరిధిలోఖాళీగా ఉన్న అంగన్‌వాడీ వర్కరు, ఆయా పోస్టులకు ఈ నెల 27వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో ఫణిరాజకుమారి శనివారం ఓ ప్రకటనలో కోరారు. ఒంగోలు అర్బన్ ప్రాజెక్టు పరిధిలో 3 కార్యకర్తలు, 10 ఆయా పోస్టులను భర్తీ చేయనున్నారు. ఒంగోలు నగరం మిరియాల పాలెం, సురేష్‌మహల్ ప్రాంతాల్లో, కొత్తపట్నం మండలం అల్లూరు 10వ నంబర్ కోడ్‌లో కార్యకర్తల పోస్టులు, నగరంలోని చింతలచెరువు, గద్దలగుంట వాటర్ ట్యాంక్, త్రోవగుంట-1, సురేష్‌మహల్, రైల్‌పేట, బాలకృష్ణాపురం, కొండమిట్ట 2, వెంగముక్కలపాలెం 2, యరజర్ల2, కొత్తపట్నం మండలం మడనూరు 1లో ఆ యా పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యకర్త పోస్టుకు దరఖాస్తు చేసుకునే వారు తప్పనిసరిగా 10వ తరగతి, ఆయా పోస్టుకు 7వ తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. దరఖాస్తుదారులు వారు దరఖాస్తు చేస్తున్న డివిజన్‌లో నివాసం కలిగి ఉండి వివాహితై ఉండాలని, గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జనసేన పార్టీ జోనల్ కమిటీలు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 20: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని జనసేన పార్టీ తన కార్యక్రమాల నిర్వహణ కోసం జోనల్ కమిటీలను నియమించింది. రాష్ట్రంలో ఉత్తరాంధ్ర, గోదావరి, సెంట్రల్ ఆంధ్ర, రాయలసీమ-1, రాయలసీమ-2 జోన్లుగా ఏర్పాటు చేసి కన్వీనర్లు, కో కన్వీనర్లు, సభ్యులను నియమించింది. ఎన్నికల సమయంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పాల్గొనే కార్యక్రమాలు, సభల నిర్వహణ సజావుగా సాగేందుకు ఈ కమిటీలు పనిచేయాల్సి ఉంటుంది. సెంట్రల్ ఆంధ్ర జోన్‌లో జిల్లా నుంచి చీకటి వంశీదీప్, అలా అనిల్‌కుమార్‌లు కన్వీనర్‌గా, కో కన్వీనర్‌గా సుంకర సాయిబాబులను నియమించారు. జోనల్ కమిటీలో నియమితులైన కన్వీనర్లు, కో కన్వీనర్లు, సభ్యులతో ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో సన్నాహక సమావేశానికి రావాలని ఆహ్వానాలను పంపారు.

36 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 20: గృహ అవసరాలకు వినియోగించాల్సిన గ్యాస్ సిలిండర్లను వ్యాపార అవసరాలకు మళ్ళించిన అక్రమార్కులపై దాడులు చేసి 6 ఎ కేసులు నమోదు చేశారు. జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశాల మేరకు పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆరు బృందాలుగా ఏర్పడి జిల్లాలోని అన్ని ముఖ్య పట్టణాల్లో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 36 గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకొని 6ఏ కేసులు నమోదు చేశారు. గృహ అవసరాలకు వినియోగించాల్సిన గ్యాస్ సిలిండర్లను దుర్వినియోగం చేస్తూ అక్రమాలకు పాల్పడే వారిపై చర్యలు తప్పవని జేసీ హెచ్చరించారు ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

బీఎన్ నివాళి

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్), జనవరి20: కొత్తకోట గ్రామంలో ఇటీవల మృతి చెందిన టీడీపీ నాయకుడు కసుకుర్తి యలమంద పెద్దకర్మ శనివారం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీఎన్.విజయకుమార్, నాయకులు హాజరై యలమంద చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన కుటుంసభ్యులకు రూ.10 ఆర్థికసాయం అందజేశారు. యలమంద కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఆడకా స్వాములు, కాకర్ల లక్ష్మీవరప్రసాదు, కోనూరి ఆంజనేయులు, కసుకుర్తి అంకరాజు, బొడపాటి వెంకటసుబ్బయ్య, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న విజయకుమార్

ప్రశాంతంగా నవోదయ ప్రవేశపరీక్ష

- 4,096 మంది గైర్హాజరు

ఒంగోలు(విద్య), జనవరి 20: ఒంగోలు, కలుజువ్వలపాడులోని జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశానికి శనివారం నిర్వహించిన ప్రవేశపరీక్ష ప్రశాంతంగా జరిగింది. మొత్తం 46 పరీక్షా కేంద్రాల్లో పరీక్షను నిర్వహించారు. సుమారు 35శాతం మ ంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షకు మొత్తం 11,303 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 7,202 మంది పరీక్ష రాశారు. 4,096 మంది గైర్హాజరయ్యారు. ఒంగోలు నవోదయ పరిధిలో 18 కేంద్రాల్లో 3,821 మందికి 2,799 మంది హాజరు కాగా 1,122 మంది గైర్హాజరయ్యారు. కలుజువ్వలపాడు నవోదయ విద్యాలయ పరిధిలో 28 పరీక్షా కేంద్రాల్లో 7382 మందికి 4,408 మంది విద్యార్థులు మాత్రమే హాజరుకాగా 2,974 మంది గైర్హాజరయ్యారు. ప్రభుత్వ పరీక్షల సహాయక కమిషనర్ కె.శివకుమార్ ఒంగోలు నగరంలోని పలు పరీక్షా కేంద్రాలను సందర్శించారు.

28న జిల్లా స్థాయి మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్

ఒంగోలు(కార్పొరేషన్), జనవరి 20: జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీన జిల్లా స్థాయి మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఒంగోలులోని ది లార్డ్ కృష్ణ షటిల్ బ్యాడ్మింటన్ అకాడమీలో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ చైర్మన్ ఎ.మురళీకృష్ణ తెలిపారు. శనివారం స్థానిక అకాడమీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీబీఏ వార్షిక బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక ట్రయల్స్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీలలో 35 నుంచి 75 సంవత్సరాల వయస్సు వారు పాల్గొనవచ్చని, ప్రతిభ గల క్రీడాకారులు రాజమహేంద్రవరంలో జరిగే 4వ రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేస్తారని వెల్లడించారు. తమ ఎంట్రీలను ఈనెల 26వ తేదీలోపు నమోదు చేసుకోవాలని, పూర్తి వివరాలకు సెల్: 9398260109, 90009445211 ద్వారా సంప్రదించాలన్నారు. సమావేశంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ జేఎస్.లక్ష్మణ్ రెడ్డి, సెక్రటరీ పి.విజయకృష్ణ, కోశాధికారి అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతా మాసోత్సవాలు ప్రారంభం

ఒంగోలు(క్రైం), జనవరి 20: రహదారి భద్రతా మాసోత్సవాలు ఈనెల 20 నుంచి వచ్చే నెల 19 వరకు జరుగుతాయని జేసీ శ్రీనివాసులు తెలిపారు. శనివారం స్థానిక ప్రకాశంభవన్‌లో గల జేసీ చాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో రహదారి భద్రత పోస్టర్లు, బ్యానర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా ప్రజలలో అవగాహన పెంపొందించేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ ఆర్.సుశీల, పలువురు అధికారులు పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జేసీ శ్రీనివాసులు, అధికారులు

నేడు మస్తాన్ ఆవులియా గంధ మహోత్సవం


ఒంగోలు(కార్పొరేషన్), జనవరి 20 : హజరత్ గొరె మస్తాన్ ఆవులియా 45వ ఉరుసేరీఫ్ గంధ మహోత్సవం ఒంగోలులో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పూరిమిట్ల హజరత్ బాబా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21వ తేదీ రాత్రి 11గంటలకు నగరంలోని గోపాల్‌నగరం 1వ లైనులో దివంగత పూరిమిట్ల కృష్ణ స్వగృహం నుంచి ఫకీర్ల జల్సా, నవరంగ్ మేళం వాయిద్యాలతో, సాము ప్రదర్శనలు, విద్యుద్దీపాల అలంకరణలో ట్రాక్టర్లపై అమర్చిన పల్లకీలతో హజరత్ సయ్యద్ గొరె మస్తాన్ గంధ మహోత్సవం జరుగుతుందన్నారు. నగరంలో ఊరేగింపుగా సాగే ఈ మహోత్సవం సోమవారం ఉదయం 6గంటలకు దర్గా వద్దకు చేరుకుంటుందని, తదనంతరం అఖండ దీపారాధ న, రాత్రి 10 గంటలకు మిలాధే షరీఫ్ జరుగుతుందని పేర్కొన్నారు. భక్తులు పాల్గొని హజరత్ బాబా కోరారు.

గుర్తుతెలియని మహిళ అనుమానాస్పద మృతి

ఒంగోలు(క్రైం), జనవరి 20: గుర్తుతెలియని మహిళ అనుమానాస్పద రీతిలో మృతి చెందిన సంఘటన ఒంగోలు నగరం కొత్తపట్నం బస్టాండ్‌లో శనివారం మధ్యాహ్నం జరిగింది. సుమారు 40ఏళ్ళు వయస్సు కలిగిన మహిళ బస్టాండ్‌లో కూర్చొని వాంతులు చేసుకొని అక్కడిక్కడే కిందపడి మృతిచెందింది. ఈ మేరకు టూటౌన్ ఎస్సై మీరాసాహేబ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దామచర్ల జన్మదిన వేడుకలకు తరలిన నాయకులు

ఒంగోలు(రూరల్), జనవరి 20: టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ జన్మదిన వేడుకలకు మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు ద్విచక్ర వాహనాలతో ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. తూర్పునాయుడుపాలెం నుంచి ఒంగోలులోని టీడీపీ కార్యాలయం వరకు ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో పోలవరపు వెంకటరామయ్య, కామేపల్లి శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు నలమోతు బాలగంగాధర్, మక్కెన శ్రీనివాసరావు, ఎంపీటీసీ గుండపనేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీగా వెళుతున్న నాయకులు



తహసీల్దార్లు, పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్వో నారదముని

పోలింగ్ కేంద్రాలలో అన్ని వసతులు కల్పించాలి

● నియోజకవర్గ ఈఆర్వో నారదముని

కొండపి, జనవరి 20 : నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ర్యాంప్‌లు, విద్యుత్, తాగునీటి వసతులు కల్పించాలని నియోజకవర్గ ఈఆర్వో నారదముని ఆదేశించారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల తహసీల్దార్లు, ఎన్నికల సిబ్బంది, పలు పార్టీల నాయకులతో ఆయన శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా నారదముని మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నియోజకవర్గం వెలుపల నుంచి వచ్చిన షిఫ్టింగ్ ఓట్ల దరఖాస్తుల (ఫారం-8ల)ను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఆధార్ అనుసంధానం వందశాతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నియోజకవర్గ కేంద్రాలు, పెద్ద గ్రామ పంచాయతీల్లో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఈనెల 22న తుది ఓటర్ల జాబితాలు ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. 25న జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా అన్ని గ్రామాలు, మండల కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రంలో కొత్త ఓటర్లకు గుర్తింపు కార్డులు ఇవ్వడం, సీనియర్ ఓటర్లకు సన్మానించడంతోపాటు ఓటుహక్కు ప్రాముఖ్యం ప్రజలకు తెలిసే విధంగా ర్యాలీలు నిర్వహించాలని నారదముని తహసీల్దార్‌లకు సూచించారు. రైజ్ కృష్ణసాయి ఇంజనీరింగ్ కళాశాలను రిసెప్షన్ సెంటర్, ఈవీఎం స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ కేంద్రంగా వినియోగించుకోవాలని ఉన్నతాధికారులు నిర్ణయించారని చెప్పారు. దీనిపై అభ్యంతరాలు ఉంటే తెలపాలని పార్టీల నాయకులను ఈఆర్వో కోరారు. ఎప్పుడూ అదే కళాశాలను వినియోగిస్తున్నందున ఇబ్బంది లేదని సీపీఎం నాయకుడు కేజీ మస్తాన్, టీడీపీ నాయకుడు యనమద్ది వెంకటేశ్వర్లు ఈఆర్వోకు తెలిపారు.



క్లస్టర్ ఇన్‌చార్జిలతో మాట్లాడుతున్న నియోజకవర్గ పరిశీలకుడు స్వాములు

భవిష్యత్‌కు గ్యారెంటీని వేగవంతం చేయాలి

సింగరాయకొండ, జనవరి 20 : బాబు షూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిలకు నియోజకవర్గ పరిశీలకుడు అడకా స్వాములు సూచించారు. శనివారం రాత్రి స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, నేతలు షేక్ సందానీబాషా, పి.సుబ్బారావు, మించల బ్రహ్మయ్య, జమ్ము శంకర్, బొడ్డు బాలకోటయ్య పాల్గొన్నారు.

ఎస్టీయూ మండల అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

సింగరాయకొండ, జనవరి 20 : ఎస్టీయూ మండల అధ్యక్షుడిగా పనపాకల శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. స్థానిక లోటస్ స్కూల్‌లో శనివారం సంఘ మండల కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ మండల ప్రధాన కార్యదర్శిగా కీర్తి శ్రీనివాసులు, ఆర్థిక కార్యదర్శిగా చిలకపాటి సుధాకర్‌రావు, జిల్లా కౌన్సిలర్స్‌గా జీవీఎల్ అజయ్‌కుమార్‌చౌదరి, ఎ.జయలక్ష్మి, కె.అమరేశ్వర్, గౌరవ అధ్యక్షుడిగా నూకసాని వెంకటేశ్వర్లు, గౌరవ సలహాదారునిగా కె.వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు.

విధ్వంసానికి ప్రతిరూపం వైసీపీ పాలన

● టిడ్కో ఇళ్లు పూర్తిచేయలేని, చేతగాని ప్రభుత్వం

● ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్



అద్దంకిలోని మౌలానగర్‌లో టీడీపీ మినీ మేనిఫెస్టో కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

అద్దంకి, జనవరి 20 : జగన్‌రెడ్డి పాలన అంతా దోపిడీ, దౌర్జన్యాలు, విధ్వంసానికి ప్రతిరూపమని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అద్దంకి పట్టణంలోని 1వ వార్డు లో బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి ఇంటింటికి తిరిగి టీడీపీ మినీ మేనిఫెస్టో గురించి వివరించి కరపత్రాలు అందజేశారు. ఇందులో మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేసినందుకు కృతజ్ఞతగా ఏర్పాటుచేసిన కేక్ ను ఎమ్మెల్యే కట్ చేశారు. కొత్తదామావారిపాలెం, మౌలానగర్, కాకానిపాలెం, దూదేకులపాలెంలో పర్యటించారు. అనంతరం జరిగన సభలో ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ నాలుగున్నర సంవత్సరాలలో టిడ్కో ఇళ్ళలో అసంపూర్తిగా ఉన్న పది శాతం పనులు పూర్తి చేయలేని చెత్త ప్రభుత్వం అధికారంలో ఉండటం దురదృష్టకరమన్నారు. వైసీపీ పాలనలో పేదలకు సొంతింటి కల భారంగా మారిందన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో అద్దంకి పట్టణ దాహార్తి తీర్చేందుకు రూ.84 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. ఇప్పటికీ వైసీపీ ప్రభుత్వం ఆ పనులు పూర్తి చేయలేదన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే టిడ్కో గృహాలను పేదలకు ఉచితంగా అందజేస్తామన్నారు. వైసీపీని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. టీడీపీ-జనసేన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జగన్ సర్కార్ రద్దు చేసిన 27 ఎస్సీ సంక్షేమ పథకాలను పునరుద్ధరిస్తామన్నారు. ఎన్నికల సమయంలో జగన్‌రెడ్డి మద్యపాన నిషేధం హామీ ఇచ్చి మాట తప్పారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, 3 ఉచిత గ్యాస్ సిలెండర్లు తదితర పథకాలు అందించనున్నట్టు చెప్పారు. వైసీపీ పాలనలో ప్రచారం కోసం పథకాలు, అమలుకు వచ్చేసరికి ఆంక్షలుగా ఉందన్నారు. అబద్ధపు మాటలతో గారడీలే వైసీపీ ప్రభుత్వ లక్ష్యాలని అన్నారు. కార్యక్రమాలలో టీడీపీ నేతలు చిన్ని శ్రీనివాసరావు, వడ్డవల్లి పూర్ణచంద్రరావు, సందిరెడ్డి శ్రీనివాసరావు, కాకాని అశోక్ , గోరంట్ల లక్ష్మణదాస్, కోనేటి అనిల్, రహమాన్, ఖాశీం తదితరులు పాల్గొన్నారు.

పలువురిని పరామర్శించిన ఎమ్మెల్యే

అద్దంకి, జనవరి 20: అద్దంకి పట్టణంలోని కాకానిపాలెంలో పలు కుటుంబాలను ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ శనివారం రాత్రి పరామర్శించారు. పుష్కర కాలంగా కోమాలో ఉన్న మల్లెంపూడి శ్రీకుమార్‌ను పరామర్శించారు. ఇటీవల మృతి చెందిన సందిరెడ్డి శ్రీరాములు కుటుంబసభ్యులను పరామర్శించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి శస్త్రచికిత్స చేయించుకున్న మురకొండ వీరాంజనేయులును పరామర్శించారు.

చెరువులకు చేరని సాగర్ జలాలు

● దిగువకు రాకుండానే నిలిపివేత

● పొంచిఉన్న మంచి నీటి ఎద్దడి



నూతలపాడు మైనర్ చేరని చుక్క నీరు

పర్చూరు, జనవరి 20: తాగునీటి అవసరాలకు సాగర్ నీరు విడు దల చేసినా ఆయకట్టు చివరకు చుక్కనీరు చేరలేదు. ఇప్పటికే పలు గ్రామాల్లోని మంచినీటి చెరువులు అడుగంటాయి. ఉన్న అరాకొర నీరు కాస్త రంగుమారి కలుషితంగా మారాయి. దీంతోపాటు దుర్గంధం కూ డా వెదజల్లుతుంది. గత్యంతరం లేక ప్రజలు కలుషిత నీటినే ఉపయో గించుకుంటున్నారు. మంచినీటి అవసరాల కోసం సాగర్ జలాలు విడు దల చేయగా, చెరువులను నింపుకునేందుకు ఎదురుచూసిన అధికా రులకు నిరాశే మిగిలింది.

పర్చూరు నియోజకవర్గ పరిధిలో 82 మంచినీటి చెరువులు ఉన్నా యి. ఈచెరువులను సాగర్, కొమ్మమూరు కాలువతోపాటు, పర్చూరు వాగు ద్వారా నింపాల్సి ఉంది. అయితే, ప్రభుత్వం మంచినీటి అవసరాల కోసం విడుదల చేసిన సాగర్ జలాలు చెరువులకు చేరకుండానే డ్యాం వద్ద నీటిని నిలిపివేశారు. పర్చూరు అయకట్టు చివర కావటంతో నీటి సరఫరా అంతంతమాత్రంగానే ఉంటుంది. ఓపక్క ఆయకట్టు చివర కావటంతోపాటు, ఉన్న సాగర్ కాలువలు చిల్లచెట్లు, ముళ్ళ పొదలతో నిండిపోయి ఉన్నాయి. దీంతో నీటి సరఫరా సక్రమంగా సాగటంలేదు.



కాలువను కమ్మేసిన చిల్లచెట్లు, ముళ్ళ పొదలు

ప్రస్తుతం మంచినీటి చెరువుల్లో నీరు అరకొరగానే ఉంది. ఉన్న నీరు కాస్త కలుషితంగా మారింది. ఆయా గ్రామాల్లో ఫిల్టర్ బెడ్‌లు పనిచేయకపోవటంతో శుద్ధి చేయకుండానే కలుషిత నీటిని సరఫరా చేస్తున్నారు. గత్యంతరం లేక కలుషిత నీటినే ప్రజలు వినియోగించుకుంటున్నారు. చెరువుల్లో నీరు అడుగంటి ఉండటంతో వేసవిలో తాగునీటి కష్టాలు తప్పవేమోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

దామచర్లకు టీడీపీ నేతల శుభాకాంక్షలు



టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావుకు ఉమ్మడిజిల్లా టీడీపీ నేతలు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శనివారం రాత్రి ఒంగోలులోని ఆయన నివాసంలో అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, మాజీ ఎమ్మెల్యేలు ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, బీఎన్ విజయకుమార్, ముత్తుముల అశోక్‌రెడ్డి, కందుల నారాయణరెడ్డి, టీడీపీ ఒంగోలు లోక్‌సభ అధ్యక్షులు నూకసాని బాలాజీ, వైపాలెం ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబులు బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.
- ఒంగోలు



సమావేశంలో మాట్లాడుతున్న రంగారావు

26న ట్రాక్టర్, బైక్‌ర్యాలీని విజయవంతం చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 20 : కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా గణతంత్ర దినోత్సవం రోజైన ఈనెల 26న ఒంగోలులో జరిగే ట్రాక్టర్, బైక్ ర్యాలీలను విజయవంతం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు పిలుపునిచ్చారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో శనివారం జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం రెండు పర్యాయాలు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ ఓటమే లక్ష్యంగా సంయుక్త కిసాన్ మోర్చా సుదీర్ఘ పోరాటానికి సన్నద్ధమైనట్లు తెలిపారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెవీరారెడ్డి మాట్లాడుతూ వ్యవసాయచట్టాల రద్దుకు రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో మోదీ పూర్తిగా విఫలమయ్యారన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పమిడి వెంకట్రావు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ తెచ్చిన భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆచార్య రంగా కిసాన్ సంస్థ ప్రధాన కార్యదర్శి చుంచు శేషయ్య మాట్లాడుతూ ఈనెల 26న జరిగే ర్యాలీలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పీవీఆర్.చౌదరి, జి.శ్రీనివాసులు, కంకణాల ఆంజనేయులు, యు.బాలకోటయ్య, లలితకుమారి, కంకణాల రమాదేవి, బి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



దామచర్ల సమక్షంలో పార్టీలో చేరిన నాయకులు

టీడీపీలో 39 వైసీపీ కుటుంబాలు చేరిక

●సాదరంగా ఆహ్వానించిన దామచర్ల

ఒంగోలు(రూరల్), జనవరి20: ఒంగోలు నగర పరిధిలోని కొప్పోలులో శుక్రవారం రాత్రి వైసీపీకి చెందిన పలు కుటుంబాల వారు టీడీపీలోకి చేరారు. దాసరి నరేష్ ఆధ్వర్యంలో 39కుటుంబాల వారు పార్టీలోకి చేరగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ వారికి టీడీపీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రాగానే గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టడంతో సంక్షేమ పథకాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు మంత్రి శ్రీనివాసరావు, కామేపల్లి శ్రీనివాసరావు, కొఠారి నాగేశ్వరరావు, పొదిలి శ్రీనివాసరావు, వీరగంధం శ్రీనివాసరావు, కాట్రగడ్డ రఘు, నడిపినేని భాస్కర్, బొడపాటి హరిబాబు, ఎస్పీకాలనీవాసులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల ఆందోళన

● పలుచోట్ల రాస్తారోకోలు



నాగులుప్పలపాడు బస్టాండ్ సెంటర్‌లో రాస్తారోకో చేస్తున్న అంగన్‌వాడీలు

ఒంగోలు నగరం, జనవరి 20: వేతనాల పెంపు, గ్రాట్యుటీ అమలు చేయాలని కోరుతూ అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె శనివారానికి 40వ రోజుకు చేరింది. అంగన్‌వాడీలకు మద్దతుగా పలు కార్మిక సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్‌సెంటర్‌లో పెద్ద ఎత్తున రాస్తారోకో జరిగింది. దాదాపు గంట పాటు వాహనాలను నిలుపుదల చేశారు. సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘం, ఐద్వా సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీలపై ప్రయోగించిన ఎస్మాను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలతో చర్చలు జరిపి సానుకూలమైన నిర్ణయాన్ని ప్రకటించాలని వారు కోరారు. రాస్తారోకో వల్ల వాహనాల రాకపోకలు నిలిచిపోవటంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. నాయకులను అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించటంతో తోపులాట జరిగింది. వన్‌టౌన్ సీఐ లక్ష్మణ్, పోలీసు సిబ్బందితో నాయకులను స్టేషన్‌కు తరలించారు. కాగా కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీల దీక్షా శిబిరాన్ని శనివారం సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి కళ్యాణి ప్రారంభించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి అన్నపూర్ణప్రశాంతి, జీవీ.కొండారెడ్డి, జి.శ్రీనివాసులు, చీకటి శ్రీనివాసులు, పీవీఆర్.చౌదరి, రమాదేవి, చుండూరి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడులో..

ఒంగోలు(రూరల్), జనవరి 20: అంగన్‌వాడీలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నాగులుప్పలపాడు బస్టాండ్ సెంటర్‌లో శనివారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కౌలు రైతు సంఘం నాయకుడు ఎస్‌కే.మాబు మాట్లాడుతూ అంగన్‌వాడీలు 40రోజులు నుంచి నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని, సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు జజ్జూరి జయంత్‌బాబు, టి.శ్రీకాంత్, బసవపున్నయ్య ఎస్.రామారావు పాల్గొన్నారు.



సంతనూతలపాడులో అంగన్‌వాడీలకు మద్దతుగా రాస్తారోకో చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు: అంగనవాడీ కార్మికుల వేతనాలను పెంచాలని, వారి డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గత 40 రోజులుగా చేస్తున్న అంగనవాడీల సమ్మెకు మద్దతుగా శనివారం సంతనూతలపాడు బస్టాండ్ వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. టిఎన్.వెంకటేశ్వర్లు, బి.సుబ్బారావు, ఎ.వెంకటేశ్వర్లు, ఏవీ.సుబ్బారావు, మస్తాన్, సుబ్బారావు, శేషారావు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



మానవహారం నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడీల మానవహారం

కొండపి, జనవరి 20: పనికి తగిన విధంగా నెలకు రూ.26వేల జీతం ఇవ్వాలని అంగన్‌వాడీలు డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వారు చేస్తున్న సమ్మె శనివారం 40వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా కార్యకర్తలు, ఆయాలు స్థానిక టంగుటూరు రోడ్డులో మానవహారం నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ నాయకుడు కేజీ మస్తాన్ మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీల పట్ల అవలంబిస్తున్న మొండి వైఖరిని విడనాడాలన్నారు. వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ఆదిలక్ష్మి, పున్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

వల్లూరమ్మ సన్నిధిలో దామచర్ల పుట్టిన రోజు వేడుకలు

వల్లూరు (టంగుటూరు), జనవరి 20 : మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పుట్టిన రోజు వేడుకలు వల్లూరమ్మ సన్నిధిలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా దామచర్ల కేక్ కట్‌చేసి అందరికీ మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొజ్జా శ్రీను, రామా గోపి, చిరుమామిళ్ల మురళి, పొనుగోటి పవన్‌కుమార్, చిరుమామిళ్ల గోపి, సునీల్, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కోదండరాముని ఆలయంలో రేపు శ్రీరామ జపం

టంగుటూరు, జనవరి 20 : టంగుటూరులోని కోదండరామస్వామి ఆలయంలో సోమవారం శ్రీరామ జపం జరుగుతుందని స్థానిక ఆర్యవైశ్య సంఘం వారు తెలిపారు. అయోధ్యలో శ్రీరాముని ప్రతిష్ఠ సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 6.30 నుంచి 8.30 గంటల వరకు స్వామి వారికి అభిషేకాలు, ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు శ్రీరామ నామ హోమాలు కొనసాగుతాయన్నారు. హోమంలో పాల్గొనదలచిన వారు ముందుగా సెల్ ఫోన్ నెంబర్లు : 99482 60856, 99481 40950లో సంప్రదించాలని కోరారు.

16 మద్యం బాటిళ్ల పట్టివేత



పట్టుబడిన మద్యం బాటిళ్లతో ఎస్సై ఖాదర్‌బాషా

జయవరం (టంగుటూరు) జనవరి 20 : మండలంలోని జయవరంలో మద్యం అక్రమంగా విక్రయిస్తున్న కొప్పోలు సంతోష్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద 16 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. సంతోష్ టంగుటూరు, జరుగుమల్లి మండలాల్లోని ప్రభుత్వ వైన్ షాపుల నుంచి మద్యం తెచ్చి విక్రయిస్తున్నట్లు ఎస్సై ఖాదర్‌బాషాకు సమాచారం అందింది. దీంతో శనివారం ఆయన సిబ్బందితో కలిసి దాడి చేసి పట్టుకున్నారు. సంతోష్‌ను, పట్టుబడ్డ మద్యం బాటిళ్లను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.



కూకట్లపల్లి వద్ద కాలువకు అడ్డుగా వేసి పంట పొలాలకు పెడుతున్న నీరు

పంట పొలాలకు తాగునీరు మళ్లింపు

» వెంపరాల మేజర్ కాలువలో నీరు కిందకు రాకుండా అడ్డగింత

బల్లికురవ, జనవరి 20: తాగునీటి అవసరాలకు విడుదలచేసిన సాగర్ నీరు పంటలకు పెడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవటం వలనే ఈ పరిస్థితి నెలకొందని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండల పరిధిలోని వెంపరాల మేజర్ కాలువ ద్వారా వచ్చే నీటిని కొందరు వ్యర్థాలను అడ్డుగా వేసి కూకట్లపల్లి గ్రామం వద్ద నీటిని పంట పొలాలకు మళ్లిస్తున్నారు. కొప్పెరపాడు రైతులు కూడా తమ పంటలకు కూడా నీటిని పెట్టుకోవాలని మేజర్ కాలువ పైకి వెళ్లి అడ్డుగా ఉన్న వ్యర్థాలను తొలగించే చర్యలు చేపట్టారు. ఈక్రమంలో అక్కడి రైతులు నీటిని కిందకు రానివ్వమని వాదనకు దిగారు. దీంతో రైతుల మధ్య వివాదం నెలకొంది. ఇలా అయితే చెరువులకు నీరు ఎలా చేరుతుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారులు పర్యవేక్షణ చేపడితేనే తాగునీటి చెరువులకు పూర్తిస్థాయిలో నీరు చేరుతుందని వారు తెలిపారు.

ముడిరాయి లారీలు పట్టివేత

మార్టూరు, జనవరి 20: మండలంలోని నాగరాజుపల్లి గ్రామ సమీపంలో బల్లికురవ మండలంలోని గ్రానైట్ క్వారీల నుంచి మార్టూరులోని పరిశ్రమల కు ముడిరాయిని తరలిస్తున్న రెండు లారీలను శుక్రవారం అర్ధరాత్రి మై నింగ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి బిల్లులు లేకుండా ము డిరాయి లారీలు మార్టూరు వస్తున్నాయి. వీటిని తనిఖీచేసి రెండులారీలను మార్టూరు స్టేషన్‌కు తరలించారు.

మద్యం బాటిళ్లు పట్టివేత

మార్టూరు, జనవరి 20: స్థానిక కిశోర్ కాలనీలో శనివారం సాయంతరం మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు ఏఎస్‌ఐ బాషా తెలిపారు. అక్రమంగా మ ద్యం అమ్ముతున్న మహిళను అదుపులోకి తీసుకొని 7 బాటిళ్లను స్వాధీ నం చేసుకున్నట్లు ఏఎస్‌ఐ చెప్పారు.

పురుగుమందు తాగి వృద్ధుడు ఆత్మహత్య

బల్లికురవ, జనవరి 20: మండలంలోని చెన్నుపల్లికి చెందిన మందపాటి అంజయ్య (87)అనే వృద్ధుడు అనారోగ్యంతో జీవితంపై విరక్తిచెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేనిసమయంలో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు గమనించి నర్సరావుపేట వైద్యశాలకు తరలించగా, చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతి చెందాడు, మృతుడి కుమారుడు శ్రీనివా సరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ బండి శ్రీనివాసరావు తెలిపారు.

సమష్టి కృషితోనే టీడీపీ గెలుపు

- మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ కందుల నారాయణరెడ్డి
- అశోక్‌రెడ్డి సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్న బీసీ నాయకులు



పొదిలిలో కేడర్‌తో మాట్లాడుతున్న కందుల నారాయణరెడ్డి

పొదిలి, జనవరి 20 : టీడీపీ నాయకులు, కార్యకర్తల సమష్టి కృషి గెలుపునకు ముఖ్యమని మార్కాపురం మాజీ శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి కోరారు. శనివారం పట్టణంలోని 6, 7, 8 వార్డుల్లో యూనిట్, బూత్‌కమిటీ ఇన్‌చార్జుల సభ్యులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇంటింటికి తిరిగి వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం 12వ వార్డులో బాబుష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పార్టీ ఇచ్చిన కార్యక్రమాలను తూచా తప్పకుండా పాటించాలన్నారు. వైసీపీ ప్రభుత్వం వలంటీర్ల ముసుగులో ఓట్లను తొలగించే ప్రక్రియకు కంకణం కట్టుకొందన్నారు. టీడీపీ నాయకులు ఓటర్ల జాబితాపై నిరంతరం నిఘా పెట్టాలన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే మహిళలకు గౌరవం, యువతకు భవిష్యత్తు ఉంటుందన్నారు. అన్నదాతల సాదకబాదలను తెలిసిన చంద్రబాబునాయుడు వ్యవసాయదారులు ఇబ్బందులకు గురికాకుండా ఏటా వారిఖాతాల్లో రూ.20 వేల నగదు జమ చేయనున్నట్లు ప్రజలకు తెలపాలన్నారు. చంద్రబాబునాయుడిని గెలిపించుకుంటే వెలుగొండ ప్రాజెక్ట్‌తోపాటు, మార్కాపురం జిల్లాను కూడా సాధించుకోవచ్చన్నారు. ఆదేవిధంగా నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగిరే విధంగా నాయకులు, కార్యకర్తలు ప్రణాళిక ప్రకారం విభేదాలు విడనాడి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు, యూనిట్ సభ్యులు, బూత్‌కమిటీ ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

కంభం : రాష్ట్రంలో బీసీల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని గిద్దలూరు టీడీపీ ఇన్‌చార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. శనివారం 'బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా అర్ధవీడు మండలం మాగుటూరు గ్రామంలో ఆయన ఇంటింటికి పర్యటించారు. ఇంటింటికి తిరిగి టీడీపీ, జనసేనల ఉమ్మడి మానిఫెస్టోలోని అంశాలను ప్రజలకు, మహిళలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక బీసీలకు చేసిన అన్యాయాలను ఖండిస్తూ యాచవరం గ్రామానికి చెందిన నాయిబ్రాహ్మణ సంఘం నాయకులు మాగుటూరు గ్రామానికి చెందిన బీసీ నాయకులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఇరు గ్రామాలకు చెందిన బీసీలకు టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి బీసీలకు చేసింది ఏమీ లేదన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను దోచుకోవడమే పనిగా పెట్టుకున్న వైసీపీని గద్దెదింపేందుకు టీడీపీ, జనసేన ఉమ్మడిగా చేసే పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. టీడీపీలో చేరిన వారిలో యాచవరం గ్రామ నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు లింగాల నాగయ్య, లింగాల బాలచెన్నయ్య, క్రిష్టాపురం రాములు, క్రిష్టాపురం చిన్నదాసయ్య, చిన్నరామయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకటరామయ్య, లింగాల మస్తాన్, వెంకటచెన్నయ్య, దూదేకుల కాశయ్య, మాగుటూరుకు చెందిన షబ్బీర్, వెంకటేశ్వర్లు, రాములు, శ్రీను, రాజశేఖర్, రాజులయ్య సునీల్‌కుమార్, సుధాకర్, అరవింద్, లక్ష్మయ్య, చిన్నరాజయ్య, విజయ్ కుమార్ తదితరులు చేరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు బండ్లమూడి ఆంజనేయులుయాదవ్, ప్రధాన కార్యదర్శి కొనతం రంగారెడ్డి, మాజీ ఎంపీపీ చేగిరెడ్డి చిన్నకాశిరెడ్డి, యాచవరం సర్పంచ్ పీరయ్య, వైస్ సర్పంచ్ కోడె పెద్దిరాజు, మాజీ సర్పంచులు బండి నారాయణరెడ్డి, కర్నం కాశయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యులు గంగుల పెద్దిరాజు, రంగయ్య, నాగకాశి పాల్గొన్నారు.



వేములకోటలో టీడీపీ బాండ్లు అందజేస్తున్న నారాయణరెడ్డి తండ్రి



మాగుటూరు, యాచవరం గ్రామాలలో వైసీపీని వీడి టీడీపీలో చేరిన బీసీ నాయకులు

దుర్మార్గపు పాలనకు చమరగీతం పాడాలి

మార్కాపురం వన్‌టౌన్ : వైసీపీ దుర్మార్గపు పాలనకు చమరగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందని మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమని వసంతలక్ష్మీ, నియోజకవర్గ పోల్‌మేనేజ్‌మెంట్ క్లస్టర్ ఇన్‌చార్జ్ కందుల రామిరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని 30వ వార్డులో భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఇంటింటికి తరుగుతూ ప్రజల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే చేపట్టే సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగుతున్నారు. మహిళలకు మూడు సిలెండర్లు, తల్లికి వందనం కింద రూ.20వేలు మహిళలలకు ఉపయోగ పడతాయన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే బృహత్తరమైన సూపర్ సిక్స్‌లాంటి సంక్షేమ పథకాలు అమలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మహిళా నాయకరాళ్లు పట్టణ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్ : మండలంలోని కొల భీమునిపాడు గ్రామంలో శనివారం సాయంత్రం బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తండ్రి నారాయణరెడ్డి కార్యకర్తలతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. యువతకు ఉద్యోగాలు రావాలన్నా, రాష్ట్ర భవిష్యత్తు బాగుండాలన్నా, టీడీపీ-జనసేన ప్రభుత్వం రావాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు జవ్వాజి రామానుజులరెడ్డి, బొగ్గు శేఖర్‌రెడ్డి, దూదేకుల మస్తాన్, నాగిరెడ్డి, సుబ్బారావు, నాయకులు గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 20: నవోదయ ప్రవేశపరీక్ష మార్కాపురంలోని పాఠశాలల్లో శనివారం ప్రశాంతంగా నిర్వహించారు. జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 336 మందికి, 180 మంది విద్యార్థులు హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. బాలికల ఉన్నత పాఠశాలలో 336కు 204 మంది, రాయవరం గురుకుల పాఠశాలలో 336కు 223, వివేకానంద విద్యాపీఠంలో 204మంది హాజరయ్యారు. 1344 మందికి గాను 811 మంది హాజరయ్యారు. అబ్జర్వర్‌గా స్వాతి వ్యవహరించారు. డిప్యూటీ డీఈవో చంద్రమౌళి, జవహర్ నవోదయ ప్రిన్సిపాల్ గణపతి, ఎంఈవో రాందాస్ నాయక్‌లు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

పరీక్షకు 502 మంది హాజరు

ఎర్రగొండపాలెం : ఎర్రగొండపాలెం మండల కేంద్రంలో శనివారం జవహర్ నవోదయ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశం కోసం పరీక్ష ప్రశాంతంగా నిర్వహించారు. మొత్తం 864 మంది విద్యార్థులు ఎంట్రెన్స్ పరీక్షకు దరఖాస్తు చేసుకోగా 502 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. 362 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఎర్రగొండపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కాలేజీ, గిరిజన గురుకుల పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎంఈవో పి ఆంజనేయులు పరీక్షా కేంద్రాలలో ఆకస్మిక తనిఖీ చేశారు. ఎస్‌ఐ రాజేష్ పర్యవేక్షణలో పోలీసులు పహారా నిర్వహించారు. పరీక్ష కేంద్రాలలో వైద్యసిబ్బంది అందుబాటులో ఉన్నారు.

కట్టుదిట్టంగా నవోదయ ప్రవేశ పరీక్ష

పెద్ద దోర్నాల : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం జవహర్ నవోదయ ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష నిర్వహించారు. కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య నిర్వహించిన ఈ పరీక్షకు 303 తెలుగు మాధ్యమంలో, ముగ్గురు ఉర్దూ మాధ్యమం కలిపి 306 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 176 తెలుగు, ఒకరు ఉర్దూ మొత్తం 177 మంది పరీక్షలు రాశారు. 129 మంది గైర్హాజరయినట్లు పాఠశాల హెచ్‌ఎం పరీక్ష సూపరింటెండెంట్ ఎస్‌వీ నారాయణరెడ్డి తెలిపారు. 14 మంది ఉపాధ్యాయులు ఇన్విజిలేటర్లుగా వ్యవహరించినట్లు ఆయన తెలిపారు.

ప్రయాణికుల సమస్యలు పరిష్కరించాలి

గిద్దలూరు, జనవరి 20 : రైల్వే డబ్లింగ్ పనులను పరిశీలించేందుకు గిద్దలూరు వచ్చిన చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ అరవింద్ మాల్కోడేను ఆర్యవైశ్య సూర్యవంశావలి ప్రతినిధులు కలిశారు. ప్రయాణికులు ఎదుర్కొంటున్న పలు అంశాలపై ఆ సంఘం అధ్యక్షుడు నాగేశ్వరరావు వినతిపత్రం అందజేశారు. గిద్దలూరు రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫారాల మధ్యన మరో ఓవర్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని, కర్నూలు-నంద్యాల డెమో ఎక్స్‌ప్రెస్‌ను, తెనాలి-మార్కాపురం రైలును, నంద్యాల-రేణిగుంట రైలును గిద్దలూరు వరకు పొడిగించాలని కోరారు. రాచర్ల బస్టాండ్‌లో అండర్ బ్రిడ్జి గాని ఓవర్ బ్రిడ్జిని గాని వెంటనే నిర్మించాలని, పాములపల్లె గేటు, రాచర్లగేట్ల మధ్య పక్కా రోడ్డును నిర్మించి అనుసంధానం చేయాలని కోరారు. గిద్దలూరు రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంపై బోగీ వివరాల డిస్‌ప్లే ఏర్పాటు చేయాలన్నారు.

నేడు దీపోత్సవ శోభయాత్ర

గిద్దలూరు, జనవరి 20 : అయోధ్యలో జరుగనున్న ప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా గిద్దలూరులో దీపోత్సవ శోభయాత్ర, అభిషేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థాన కమిటీ అధ్యక్షులు గర్రె సత్యనారాయణ, కార్యదర్శి తుమ్మలపెంట సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. 21న ఆదివారం సాయంత్రం 4 గంటలకు దేవస్థానం నుంచి మహిళలతో దీపోత్సవ శోభయాత్ర ప్రధాన వీధుల్లో నిర్వహిస్తామని పేర్కొన్నారు. పాల్గొనే మహిళలు ప్లేటు, ప్రమిద, బియ్యం తీసుకొని సాంప్రదాయ దుస్తులు ధరించి రావాలని సూచించారు. 22వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు అమ్మవారిశాలలో సీతారామలక్ష్మణ మూలవిరాట్, ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా హనుమాన్ చాలీసా



చాలీసా పఠిస్తున్న భక్తులు, విశేష అలంకరణలో ఆంజనేయుడు

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 20: అయోధ్య బాలరామయ్య ప్రాణప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా స్థానిక లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో శనివారం మొదటిరోజు అఖండ హనుమాన్‌చాలిసా సంకీర్తన నిర్వహించారు. ప్రధానార్చకులు శ్రీపతి అప్పనాచార్యులు ఆంజనేయస్వామి ఉత్సవమూర్తికి ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. చెన్నకేశవస్వామి, వికాసతరంగిణి మహిళల ఆధ్వర్యంలో హనుమాన్‌చాలిసా పఠించారు. ఈవో చెన్నకేశవరెడ్డి పాల్గొన్నారు.

బాధితులకు నగదు సాయం



బియ్యం, నగదు పంపిణీ చేస్తున్న దాతలు

త్రిపురాంతకం, జనవరి 20: మండలంలోని లేళ్లపల్లిలో ఈ నెల 16న జరిగిన అగ్ని ప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన బాధిత కుటుంబాలను శనివారం పలువురు దాతలు ఆర్థిక సాయం చేశారు. త్రిపురాంతకం ముస్లిం కమిటీ ఆధ్వర్యంలో రూ.20 వేల నగదు, బియ్యం పంపిణీ చేశారు. మండల ఆర్‌ఎంపీ, పీఎంపీ డాక్టర్ల అసోషియేషన్ ఆధ్వర్యంలో బియ్యం, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు రషీద్, కె.సురేంద్ర, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంతో పని చేయాలి

- ఎర్రగొండపాలెం వైసీపీ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్

పెద్ద దోర్నాల, జనవరి 20: వైసీపీ కార్యకర్తలు, నాయకులు ఐకమత్యంతో పనిచేయాలని వైపాలెం నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. నూతనంగా నియోజకవర్గ బాధ్యతలు చేపట్టిన చంద్రశేఖర్ మండల నాయకులతో శనివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నటరాజ్ కూడలిలోని వైఎస్సార్, అంబేడ్కర్ పొట్టిశ్రీరాములు, గాంధీజీ, వాల్మీకి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం శివసదన్‌లో సమావేశం నిర్వహించారు. అందరినీ కలుపుకుని వైసీపీ విజయానికి దోహదం చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆయన్ను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ ఘంటా వెంకటరమణారెడ్డి, నాయకులు గురవారెడ్డి, జోగి వెంకటనారాయణ, వై.వెంకటేశ్వరరెడ్డి, శేఖర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, ఆదినారాయణరెడ్డి, అల్లు ఆంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌బూత్‌లను పరిశీలించిన తహసీల్దార్



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

పొదిలి, జనవరి 20 : మండలంలోని మూగచింతల, కొండాయపాలెం, దొండ్లేరులోని పోలింగ్ బూత్‌లను తహసీల్దార్ అశోక్ కుమార్‌రెడ్డి, ఎస్‌ఐ వెంకట సైదులు పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో సమస్యలు ఉంటే వెంటనే గుర్తించి తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని బీఎల్వోలను కోరారు. అంతేకాకుండా సమస్యాత్మంగా ఉన్న గ్రామలను గుర్తించి పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలన్నారు. ప్రతిఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకునే కట్టుదిట్టమైన చర్య తీసుకుంటా మన్నారు.

సామాజిక తనిఖీకి సహకరించండి

ఎర్రగొండపాలెం, జనవరి 20 : మండలంలో జరిగిన ఉపాధి పనులను పంచాయతీరాజ్‌శాఖ, ఫారెస్టు, గ్రామీణ నీటిపారుదల శాఖ నాడు- నేడు పనులకు గ్రామాల వారిగా సామాజిక తనిఖీ చేయనున్నట్లు డ్వామా విజిలెన్స్ అధికారి ఝాన్సీరాణి పేర్కొన్నారు. తనిఖీ కోసం వచ్చే ఉద్యోగులకు ఫీల్డ్‌ఉద్యోగులు పూర్తి సహకారం అందించాలన్నారు. ఎర్రగొండపాలెం మండల సమావేశం హాలులో శనివారం ఉపాధిహామీ ఉద్యోగులకు, సామాజిక తనిఖి సిబ్బందికి సమావేశం నిర్వహించారు. క్షేత్రస్థాయి ఉద్యోగులు ఎం-బుక్‌లు, ఇవ్వడంతో పాటు పనిప్రదేశం చూపించాలన్నారు. సామాజిక తనిఖీలో తప్పులు నమోదు అయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో అదనపు విజిలెన్స్ అధికారి వెంకటస్వామి, ఎంపీడీవో వై.నాగేశ్వరప్రసాదు, ఏపీవో శైలజ, ఐటీడీఏ ఏపీవో నాగేశ్వరరావు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

మతోన్మాద పార్టీలను ఓడించటమే ధ్యేయం

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 20: మతోన్మాద బీజేపీ, దాని అనుబంధ పార్టీలను ఓడించడమే ధ్యేయంగా పని చేస్తామని మేలుకో ఆంధ్రప్రదేశ్ సభ్యులు కేఎం అబ్దుల్ సుభాన్, రమేష్ పట్నాయక్‌లు అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. దేశానికి, సమాజానికి నష్టపరిచే పార్టీలను ఓడిస్తామని దేశవ్యాప్తంగా బీజేపీ వ్యతిరేక శక్తులను ఏకతాటిపైకి తెచ్చి ఇండియా కూటమి గెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 50 నియోజకవర్గాల్లో పర్యటించామన్నారు. ఈ సమావేశంలో ఐజేఐ నాయకులు ఎంవీ రమణ, ఆప్ జిల్లా అధ్యక్షులు సుదర్శన్, ఏంపీజే రాష్ట్ర కార్యదర్శి ఎస్‌ఏ రజాక్, కాంగ్రెస్ నాయకురాళ్లు రెహనా, ముస్లిం లీగ్ నాయకులు ఇస్మాయిల్, కంభం మైనారిటీ నాయకులు షేక్ బాషా తదితరులు పాల్గొన్నారు.

'యూజీసీ నెట్'లో సచివాలయ ఉద్యోగి విజయం



వైష్ణవి

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 20: మార్కాపురం పట్టణానికి చెందిన సచివాలయ ఉద్యోగి వైష్ణవి యూజీసీ నెట్‌లో విజయం సాధించారు. ప్రతిష్టాత్మక యూనివర్సిటీ గ్రాండ్ కమిషన్ నేషనల్ ఎలిజిబుల్ టెస్ట్ (నెట్)కు ఎంపికయ్యారు. నెట్‌లో విజయం సాధించటంతో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఎంపికయ్యారు. పట్టణానికి చెందిన డా. సీఆర్‌ఎస్ మూర్తి కుమార్తె వైష్ణవి. వైష్ణవి ఎంపికపై మార్కాపురం వాసులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా జనార్ధన్ జన్మదినం



చీరలు పంపిణీ చేస్తున్న నాయకులు

పొదిలి, జనవరి 20 : ఒంగోలు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ జన్మదిన వేడుకలు పొదిలిలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని పుట్టిన రోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు కాటూరి పెదబాబు మాట్లాడుతూ ప్రజాసంక్షేమమే పరమావధిగా, ప్రజలనే నమ్ముకొని పాలన చేసే వ్యక్తి దామచర్ల జనార్దన్ అని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు ముల్లా ఖుద్దూస్, టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పరికుంట్ల అనీల్, శివాలయం మాజీ చైర్మన్ సామంతపూడి నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, కాటూరి శ్రీనివాసులు, లాయర్ షబ్బీర్, మహిళా నాయకురాలు శ్రీదేవి, ముని శ్రీను, కొలిపాకులు నారాయణ, మహమ్మద్‌అలి నాయకులు పాల్గొన్నారు. అనంతరం కేక్‌కట్ చేసి పేదలకు చీరలు పంపిణీ చేశారు.

గుడి పేరుతో ప్రభుత్వ భూమి ఆక్రమణ

- మార్కెట్ విలువ రూ.2కోట్ల పైమాటే
- నిద్రమత్తులో రెవెన్యూ అధికారులు



గుడిపేరుతో ఆక్రమించిన భూమి

మార్కాపురం రూరల్ జనవరి 20: గుడి పేరుతో ప్రభుత్వ భూమిని కొట్టేసేందుకు ఓ రియాల్టర్ పావులు కదుపుతున్నాడు. రూ.2కోట్ల విలువైన భూమికి కంచె ఏర్పాటు చేసి తన వెంచర్‌లో కలుపుకొనే ప్రయత్నం చేస్తున్నాడు. ఈ భూమికి కూతవేటు దూరంలో మార్కాపురం నుంచి కంభం వెళ్లే ప్రధాన రహదారి ఉంది. దీని పక్కనే సదరు రియల్ ఎస్టేట్ వ్యాపారి వెంచర్ కూడా ఉంది. ఈ భూమి నుంచి రోడ్డు ఏర్పాటు చేసుకుంటే ఆయన వెంచర్‌కు విలువ పెరుగుతుంది. దీంతో రెవెన్యూ శాఖలో ఓ క్షేత్రస్థాయి అధికారిని లోబరుచుకొని, గుడి పేరుతో గుట్టుగా ఆక్రమించేస్తున్నాడు. మార్కాపురం పట్టణం ఆనుకొని వేములకోట ఇలాకాలోని సర్వే నెంబరు 164లో 0.33 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమి కంభం-మార్కాపురం ప్రధాన రహదారిపై ఉంది. దీంతో ఆ భూమికి విలువ పెరిగింది. ఆ భూమి మార్కెట్ విలువ ఇప్పుడు రూ.కోట్లు ఉంటుందని అంచనా. ఇక ఇదే భూమికి వెనుక వైపున సదరు రియల్ ఎస్టేట్ వ్యాపారి భూమి ఉంది. ఆ భూమిలో ఈ పాటికే ప్లాట్‌లు వేశాడు. ఆ భూమికి రహదారికి మధ్య ఈ ప్రభుత్వ భూమి ఉంది. దీన్ని ఆక్రమిస్తే మొత్తం వెంచర్‌కు విలువ వస్తుంది. దీంతో ఆ భూమిని ఆక్రమించేందుకు ప్రణాళిక సిద్ధం చేశాడు. ముందుగా ఒక్క సెంట్ ప్రభుత్వ భూమిలో చిన్న గుడిని ఏర్పాటు చేశాడు. ఆ గుడి కోసం అని ప్రజలు నమ్మేలా చూస్తూ మొత్తం భూమికి కంచె ఏర్పాటు చేశాడు. అయితే ఈ విషయం అధికారులకు తెలియనిది కాదు. ఈ ప్రభుత్వ స్థలంలో బోర్డు ఏర్పాటు చేసి పరిరక్షించడం లేదు. ఏదో మొక్కుబడిగా అక్కడికి వెళ్లి కంచె తొలగించడం అనంతరం రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆక్రమించడం యథాప్రకారంగానే జరుగుతోంది. ప్రస్తుతం ఈ ఆక్రమణ భూమిని ప్లాట్లుగా చేసి అమ్మేసేందుకు సిద్ధం చేశాడు. అయినప్పటికీ సంబంధిత అధికారులు ఈ ఆక్రమణలపై తగు చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైన విలువైన ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారు.

నాయుడుపల్లె కాలనీలో దాహం కేకలు

- కొత్తపైప్‌లైన్ వేస్తూ పాతపైప్‌లైన్ ధ్వంసం
- వారం రోజులుగా ప్రజల అవస్థలు
- పట్టించుకోని అధికారరులు



ఉన్న ఒక్కబోరు వద్ద నీరు పట్టుకుంటున్న ప్రజలు

తర్లుపాడు, జనవరి 20: తర్లుపాడు పంచాయతీలోని నాయుడుపల్లె కాలనీలో వారం రోజుల నుంచి తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నాయుడుపల్లె కాలనీ, రజక కాలనీలలో ఇప్పటి వరకు డీప్ బోరు ద్వారా మంచినీటి సరఫరా చేస్తున్నారు. ఈ కాలనీలకు జల జీవన్ మిషన్ పథకం కింద రూ.20లక్షల నిధులు మంజూరయ్యాయి. దీంతో సదరు కాంట్రాక్టర్ కొత్త పైప్‌లైన్ వేసేందుకు పాత పైప్‌లైన్ ధ్వంసం చేశారు. దీంతో ఈ కాలనీ వాసులకు మంచినీటి సమస్య ఏర్పడింది. దీంతో కిలోమీటరు దూరంలో ఉన్న తర్లుపాడు బస్టాండ్ సెంటర్‌లోని చిన్నట్యాంకు దగ్గర నుంచి సైకిళ్లు, మోటర్ సైకిళ్ల ద్వారా నీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. అధికారులకు చెప్పిన ప్పటికీ తాము ఏమి చేయలేమంటూ చేతులె త్తేశారు. రెండళ్ల క్రితం ఈ కాలనీకి రూ.2లక్షల నిధులతో పైప్‌లైన్ వేసి కొళాయిలు బిగించారు. ప్రస్తుతం కాంట్రాక్టర్ పాతలైన్‌ను ధ్వంసం చేశా రు. ఈ విషయాన్ని కాంట్రాక్టర్‌ను నిలదీయ డంతో 'కొత్తలైన్ వేస్తున్నాం కదా.. పాత లైన్ అవసరం ఉండదు. పది రోజుల పాటు తర్లుపాడు చిన్న ట్యాంకు నుంచి నీరు తెచ్చుకోవాల్సిందే' అంటూ సమాధానం ఇచ్చారు. దీంతో విధిలేని ఈ కాలనీ వాసులు నిత్యం పనులకు వెళ్లి నీటిని కిలోమీటరు దూరం వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎంపీడీవో కార్యాలయంలోని సింగల్‌ఫేస్ మోటర్ నుంచి కొంతమంది మహిళలు నీరు తెచ్చుకుంటున్నారు. ఎప్పటికీ, కొత్తలైన్ పూర్తయ్యి కాలనీకి నీరు సరఫరా చేస్తారోనంటూ కాలనీవాసులు వాపోతు న్నారు. ఇప్పటికైనా సంబంధించిన అధికారులు స్పందించి కాలనీ వాసులకు ప్రత్యామ్నాయంగా నీళ్ల ట్యాంకర్లతో నీటి సమస్యను పరిష్కరించా లని కాలనీ వాసులు కోరుతున్నారు.



పాతపైపులైన్‌ను ధ్వంసం చేస్తున్న ఎక్సకవేటర్

పాత పైప్‌లైన్‌ను ధ్వంసం చేయకూడదు

నాయుడుపల్లె కాలనీకి గతంలో వేసిన పాత పైప్‌లైన్‌ను ధ్వంసం చేయకూడదు. పాత పైప్ లైన్‌కు ప్రస్తుత కాంట్రాక్టర్ ధ్వంసం చేసిన విషయం మా దృష్టికి వచ్చింది. ఎక్కడైతే పైప్‌లైన్ ధ్వంసం అయిందో అక్కడ సదరు కాంట్రాక్టర్‌తో మరమ్మతులు చేయిస్తాం. కాలనీ వాసుల మంచినీటి సమస్యను త్వరలో పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాగరాజు

అంగన్‌వాడీ కార్యకర్తల రాస్తారోకో

- 40వ రోజూ కొనసాగిన అంగన్‌వాడీ కార్యకర్తల నిరసనలు
- మద్దతుల తెలిపిన ప్రతిపక్ష నేతలు



గిద్దలూరు, మార్కాపురంలో అంగన్‌వాడీ కార్యకర్తల నిరసనలు

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 20: తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె శనివారం 40వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదురు దీక్షా శిబిరం వద్ద అంగన్‌వాడీలు, వామపక్ష నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. దాదాపు గంట సేపు జరిగిన రాస్తారోకోతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. అక్కడికి చేరుకున్న పోలీసులు ఆందోళన చేస్తున్న వారికి నచ్చజెప్పి విరమింపజేశారు. ఈ క్రమంలో పోలీసులపై అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. తమకు జీతాలు పెంచమని, సమస్యలు పరిష్కరించాలని మాత్రమే ప్రభుత్వానికి తెలియజేస్తున్నామన్నారు. పోలీసులు కూడా ఉద్యోగస్తులే కదా అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు అందె నాసరయ్య, కాశీం, సీఐటీయూ నాయకులు రూబెన్, బాల నాగయ్య ఏడు కొండలు, ఆప్ జిల్లా అధ్యక్షులు సుదర్శన్, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

కంభం : టీడీపీ అధికారంలోకి రాగానే అంగన్‌వాడీలకు న్యాయం చేస్తామని కంభం మండల టీడీపీ నాయకులు 40 రోజులుగా నిరసన దీక్షలు చేస్తున్నారు. అంగన్‌వాడీలకు మద్దతు తెలిపారు. వారి న్యాయమైన డిమాండ్లు తీర్చే తీరిక ముఖ్యమంత్రి జగన్‌కు లేకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు కేతం శ్రీనివాసులు, మైనారిటీ నాయకులు దాదా, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గిద్దలూరు : డిమాండ్లు నెరవేర్చాలని 40 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు శనివారం జాతీయ రహ దారిపై నేలపై భైఠాయించి రాస్తారోకో చేశారు. ప్రభుత్వా నికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమవి గొంతెమ్మ కోర్కెలు కావని, న్యాయమైన కోర్కెలని పేర్కొన్నారు. సమ స్యలు పరిష్కారం అయ్యేంత వరకు సమ్మెను వీడబోమని స్పష్టం చేశారు. రాస్తారోకో చేసిన అంగన్‌వాడీలకు మద్దతుగా మురాకార్మికులు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు పాల్గొని సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో అంగన్‌వాడి వర్కర్స్ యూనియన్ ప్రతి నిధులు స్వర్ణకుమారి, మున్నా, రమణమ్మ, సీఐటీయూ నాయకులు ఆవులయ్య, నరసింహులు, వివిధ సంఘాల ప్రతినిధులు థామస్, శ్రీనివాసులు, లక్ష్మీదేవి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : అంగన్వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని సమ్మెలో భాగంగా శనివారం ఎర్రగొండపాలెం ప్రధాన కూడలిలో హైవే రోడ్డుపై అంగన్వాడీ కార్యకర్తలు మానవహారం ఏర్పాటు చేసి రాస్తారోకో చేశారు. కార్యక్రమానికి సీపీఐ నాయకులు సంఘీబావం తెలిపి మద్దతు పలికారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి డి శ్రీనివాసులు మాట్లాడుతూ 40 రోజులుగా అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు ధర్నా చేస్తున్నా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య, బి.రామయ్య, సీఐటీయూ నాయకులు షేక్ రఫీ, అమీర్‌బాషు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు జి.మల్లేశ్వరి, పి.సుభాషిణి, నాగరాజకుమారి, రామసుబ్బమ్మ, అరుణ, సునీత, టి.సుబ్బమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

పొదిలి : తమపై ఎస్మా ప్రయోగించడానికి అంగన్‌వాడీ కార్యకర్తలు ఖండించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తాడేపల్లిలో కూర్చోని పిచ్చుకపై బ్రహ్మాస్త్రం ఉపయోగించడం దుర్మార్గమన్నారు. మండలపరిషత్ కార్యాలయం వద్ద రాస్తారోకో చేశారు. దీంతో గంటపాటు ఎక్కడిక్కడ వాహనాలు నిలిచిపోయాయి. అనంతరం పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల : తమ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ నిర్వహిస్తున్న సమ్మె శనివారం జరిగింది. స్థానిక నటరాజ్ కూడలిలో మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశారు. 'సీఎం డౌన్ డౌన్' అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ముంతాజ్‌బేగం. వై.సుబ్బమ్మ, వెంకటలక్ష్మీ, పద్మ రాణి, కుమారి, సుహాసిని, వెంటరత్నం తదితరులు పాల్గొన్నారు.



కంభంలో అంగన్‌వాడీల దీక్షకు మద్దతు తెలుపుతున్న టీడీపీ నాయకులు

తిరుగు ప్రయాణంలోనూ తప్పని కష్టాలు

- దొనకొండలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఉన్నట్టా..లేనట్టా..?
- మూడేళ్లుగా తప్పని రవాణా ఇబ్బందులు
- రైల్వే జీఎం, బోర్డు చైర్‌పర్సన్‌కు ఎంపీ మాగుంట విన్నవించినా స్పందన కరువు
- అమృత్‌భారత్‌కు ఎంపికై జరుగుతున్న అభివృద్ధి పనులు



బోర్డు చైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ మాగుంట (ఫైల్), దొనకొండ రైల్వే స్టేషన్

దొనకొండ, జనవరి 20 : దొనకొండ రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం లేక, ఉన్న రైళ్లను డబ్లింగ్ లైను పనుల కారణంగా అధికారులు తాత్కాలికంగా రద్దు చేయడంతో పండుగకు పట్టణాల నుంచి స్వగ్రామాలకు వచ్చి వెళ్లి తిరిగి వెళ్లే క్రమంలో ప్రయాణ కష్టాలు ఎదుర్కొన్నారు. దొనకొండ రైల్వేస్టేషన్లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం ఉన్నట్టా..లేనట్టా, ఉంటే ఎ ప్పుడు కల్పిస్తారో అర్థంకాని పరిస్థితి ప్రజల్లో నెలకొంది. కరోనాకు ముందు దొ నకొండ రైల్వే స్టేషన్‌లో అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేవి. కరో తర్వాత రైళ్ల పునఃప్రారంభం నుంచి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు దొనకొండలో హాల్టింగ్‌ను ఎత్తేయడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ గజానన్‌మాల్యా 2021 సెప్టెంబరు 13వ తేదీన దొనకొండ పర్యటనకు విచ్చేసిన సందర్భంగా ఈ విషయమై స్పష్టత వస్తుందని ప్రజలు ఎం తో ఆత్రుతగా ఎదురుచూశారు. జీఎం ఆ రోజు ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారేగాని ఎటువంటి స్పష్టమైన హామీ ఇవ్వకపోవటం, నెలలు గడిచినా ఎటువంటి స్పందన లేకపోవడంతో నాడు జీఎంకు వినతిపత్రాలను అందించిన పెద్దలు, ప్రజలు తీవ్ర నిరుత్సాహానికి గురయ్యారు. అనంతరం ఈ విషయాన్ని స్థానికులు ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి దృష్టికి తీసుకెళ్లి దొనకొండలో ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్ సౌకర్యం కల్పించేలా చర్యలు చేపట్టాలని విన్నవించారు. అందుకు స్పందించిన ఎంపీ మాగుంట దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ దొనకొండ పర్యటనకు వచ్చినప్పుడు ఎంపీ ఆయన్ని కలిసి సమస్యను విన్నవించారు. దొనకొండలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించాలంటూ వినతిపత్రం స హితం అందించారు. ఎంపీ మాగుంట రైల్వే జీఎంను కలిసి నెలలు గడిచినా నేటికీ ఎటువంటి స్పందన లేదు. ఎంపీ విన్నపానికీ దిక్కులేదని ప్రజలు అంటున్నారు. తిరిగి ఎంపీ మాగుంట గత సెప్టెంబరు 20న ఢిల్లీలో రైల్వే బోర్డు చైర్ పర్సన్ జయవర్మసిన్హాను కలిసి వినతిపత్రం అందజేశారు. దీంతో దొనకొండలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు కచ్చితంగా ఆగుతాయని అందరూ ఆశించారు. ఏడాది దాటినా సమస్య పరిష్కారం కాలేదు. ఇక ఈ స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగవని, తమకు రవాణా కష్టాలు తప్పవని ప్రజలు భావిస్తున్నారు. గత ఆగస్టు 6వ తేదీన అమృత్‌భారత్ పథకంలో దొనకొండ రైల్వే స్టేషన్ ఎంపికైంది. దీంతో దాదాపు రూ.17కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఆ పనులు పూర్తయిన తర్వాతనైనా ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పిస్తారేమోనని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇదిలావుండగా క్రిస్మస్, సంక్రాంతి, దసరా తదితర పండుగలకు వివిధ పట్టణాల నుంచి స్వగ్రామాలకు వచ్చే ప్రజలు రైలు సౌకర్యం లేక తీవ్ర ప్రయాణ కష్టాలు పడుతున్నారు. ఈ ప్రాంత ప్రజలు జీవనోపాధి కోపం పట్టణ ప్రాంతాలకు వలసలు వెళ్తుంటారు. ఇక్కడ రైళ్లు ఆగకపోవడంతో ఇబ్బందిపడుతున్నట్లు చెప్తున్నారు. రోడ్డు మార్గాన కూడా సరైన రవాణా సౌకర్యం లేక కష్టాలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఎంపీ మాగుంట దృష్టికి సమస్యను పలుమార్లు తీసుకెళ్లారు. ఎంపీ రైల్వే అధికారులకు విన్నవించినా నేటికీ పరిష్కారం కాలేదు. రైల్వే అధికారుల నిర్లక్ష్య ధోరణిపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కనీసం కొండవీడు-అమరావతి, ప్రశాంతి మూడు ఎక్స్‌ప్రెస్ రైళ్లయినా ఇక్కడ ఆగేలా మరోసారి ఎంపీ మాగుంట కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

దొనకొండలో ఆగని ఎక్స్‌ప్రెస్ రైళ్లు

మచలీపట్నం-బెంగళూరు-మచలీపట్నం కొండవీడు ఎక్స్‌ప్రెస్, పూరీ, యశ్వంత్‌పూర్ - పూరీ గరీబ్‌రథ్, విజయవాడ - హుబ్లీ - విజయవాడ అమరావతి ఎక్స్‌ప్రెస్, హౌరా - వాస్కోడిగామా - హౌరా, అమరావతి ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్ - బెంగళూరు - భువనేశ్వర్, ప్రశాంతి ఎక్స్‌ప్రెస్, విజయవాడ, ధర్మవరం - విజయవాడ, ధర్మవరం.


పుట్టిన రోజు కేక్ కట్ చేస్తున్న నాయకులు

ఘనంగా దామచర్ల పుట్టిన రోజు వేడుకలు

దొనకొండ, జనవరి 20 : టీడీపీ కార్యాలయంలో యువ నాయకుడు వీరపనేని వెంకన్నచౌదరి ఆధ్వర్యంలో నాయకులు ఒంగోలు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పుట్టిన రోజు వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు పులిమి రమణాయాదవ్, టీడీపీ నాయకులు కామేపల్లి చెంచయ్య, షేక్ మస్తాన్‌మియా, బత్తుల గాలయ్య, పణిదపు అనంతరాములు, మోడి ఆంజనేయులు, దుగ్గెంపూడి కోటేశ్వరరావు, వైకె చౌదరి, పణిదపు వీరాంజనేయులు, పురుషోత్తం సత్యానందం, జనసేన పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు గుండాల నాగేంద్రప్రసాద్, ఎం షఫిఉల్లాఖాన్(బాజీ) భారీ కేకు కట్ ప్రజలకు పంపిణీ చేశారు.

ఒంగోలుకు తరలివెళ్లిన నాయకులు


శుభాకాంక్షలు చెప్తున్న నాయకులు

తాళ్లూరు : మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పుట్టినరోజు వేడుకకు మండలంలోని పలు గ్రామాల టీడీపీ నాయకులు, శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. దామచర్లకు శుభాకాంక్షలు తెలిపినవారిలో టీడీపీ మండల అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి, ఒంగోలు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శులు శాగం కొండారెడ్డి, మానం రమేష్‌బాబు, వల్లభనేని సుబ్బయ్య, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి గొల్లపూడి వేణుబాబు, దర్శి నియోజకవర్గ టీడీపీ బీసీ సెల్ నేత వంగపల్లి నాగేశ్వరరావు మాజీ సర్పంచ్ కోట నరసింహారావు, దర్శి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కొర్రపాటి రామయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి కైపు నాగార్జునరెడ్డి, నారిపెద్ది కల్యాణ్ శ్రేణులు ఉన్నారు.

రాజంపల్లిలో మొక్కలు నాటిన విద్యార్థులు

దర్శి జనవరి 20 : మండలంలోని రాజంపల్లిలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు శనివారం వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వయ్యారిభామ చెట్లను తొలగించి మొక్కలను నాటారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ విజయంలో బీసీలదే ప్రముఖ పాత్ర

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర
- ఎన్నికలకు సమాయత్తం కావాలని బీసీ నాయకుల పిలుపు


జయహో బీసీ సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి, జనవరి 20: టీడీపీ విజయంలో ఇప్పటి వరకు బీసీలే ప్రముఖ పాత్ర పోషించారని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో శనివారం జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. బీసీ సంఘ నాయకులు చింతలపూడి తిరుపాలు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉగ్ర ముఖ్య అతిథిగా మాట్లాడారు. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చాక బీసీలు తీవ్రంగా నష్టపోయారని ఉగ్ర ఆందోళన వ్యక్తం చేశారు. జనాభాలో సగానికి ఉన్న బీసీ వర్గాల ఓట్లను కొల్లగొట్టిన వైసీపీ ఎన్నికల అనంతరం వారికి నష్టం చేకూర్చిందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 30 శాతానికి పైగా రిజర్వేషన్లు పొందిన బీసీ వర్గాలు జగన్‌రెడ్డి వచ్చాక 25 శాతానికి కుదించి అన్యాయం చేశారన్నారు. మరోసారి జగన్‌రెడ్డి కల్లబొల్లి మాటలు నమ్మి మోసపోవద్దని ఉగ్ర హితవు పలికారు. ముస్లిం మైనారిటీ రాష్ట్ర నాయకుడు రోషన్ సంధాని మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు బీసీ వర్గాలకు చేయూతనందించారన్నారు. చేతి వృత్తులు చేసుకుని జీవించే వారికి పరికరాల యూనిట్లతో అభివృద్ధికి బాటలు వేశారన్నారు. వైసీపీ పాలనలో 75మంది బీసీ వర్గాలకు చెందిన వ్యక్తులపై దాడు చేసి ప్రాణాలు తీశారని ఆరోపించారు. వైసీపీకి చెందిన బీసీ ప్రజాప్రతినిధి ఒక్కరైనా బీసీల సంక్షేమానికి పాటుపడ్డారా అని ప్రశ్నించారు. ప్రజా సేవ చేసే ఉగ్ర వెంట అందరూ ఉండాలన్నారు. ప్రజాసేవలో నిజమైన బీసీ డాక్టర్ ఉగ్ర అన్నారు. కనిగిరి ప్రాంతంలో నిమ్జ్, నడికుడి రైల్వే మార్గం, వెలిగొండ, ఇంటింటికీ కుళాయి, ట్రిపుల్ ఐటీ సాధించాలంటే ఉగ్ర ఎమ్మెల్యే కావలిసిందేనన్నారు. ఉగ్ర గెలుపులో ప్రతి బీసీ పాత్ర ఉండాలన్నారు. ప్రతి బూత్‌లో వైసీపీ నాయకులు చేర్చిన దొంగ ఓట్లను గుర్తించి తొలగించేలా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ విషయంలో ప్రధాన భూమిక బీసీ నేతలపై ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో దొంగ దారిలో గెలిచేందుకు వైసీపీ నేతల ప్రతి కుట్రలనూ తిప్పికొట్టాలన్నారు. సమావేశంలో బీసీ సంఘాల నాయకులు జంషీర్ అహ్మద్, డీ శివ కాశయ్య, గవదగట్ల మాలకొండయ్య, సిద్ధాంతి బారాయిమాం, తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, కేవీఎస్ గౌడ్, వెంకటేశ్వర్లు, దేవేండ్ల మాధవ, గడ్డి నరసింహారావు, బాలవెంకటరమణ, మనోహర్, యలమంద, నరసయ్య, బాలమదార్, కసునూరి మౌలాలి, దొరసానితోపాటు పరిశీలకులు కోమటికుంట్ల వీరయ్య, నేతలు పాల్గొన్నారు.

ఓడిపోతారనే బుర్రాకు బదులు దద్దాలకు టికెట్

- రాజీనామాలు సరికాదు : రామిరెడ్డి
- బాలినేనిపై అనుచిత వ్యాఖ్యలు చేసేవారికి బుద్ధి చెప్పండి


మాట్లాడుతున్న రామిరెడ్డి

పామూరు, జనవరి 20 : బుర్రా ఓడిపోతారనే ఆయన స్థానంలో అధిష్ఠానం దద్దాలకు టికెట్ కేటాయించిందని, పార్టీ నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాలని వైసీపీ జిల్లా కమిటీ నాయకుడు, ఒమిగా విద్యా సంస్థల కరస్పాండెంట్ కల్లూరి రా మిరెడ్డి నాయకులకు సూచించారు. స్థానిక నివాసంలో శనివారం వైసీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ పార్టీ నిర్ణయానికి విరుద్ధంగా రాజీనామాలు చేయడం సరికాదన్నారు. బుర్రా ఓడిపోతారనే సమాచారంతోనే ఆయనను పక్కనపెట్టి బీసీ అభ్యర్థి, విద్యావంతుడైన దద్దాల నారాయణయదవ్‌కు టికెట్‌ను అధిష్ఠానం కేటాయించిందన్నారు. ఆ నిర్ణయానికి వ్యతిరేంగా ఓ వ్యక్తి స్వార్థ ప్రయోజనాల కోసం పదవులకు రాజీనామాలు చేయడం పద్ధతి కా దన్నారు. బాలినేనిపై అనుచిత వ్యాఖ్యలు చేసేవారిపై తగిన బుద్ధి చెప్పాలన్నారు. రియల్ ఎస్టేట్ బ్రోకర్లను ప్రోత్సహించిన బుర్రా, పార్టీ కోసం పనిచేసిన వారిని విస్మరించారన్నారు. తాపీ మేస్త్రీ అయిన బుర్రాను మంచి మెజారిటీతో గెలిపించుకున్న మనం దద్దాలను అత్యధిక ఓట్లతో గెలిపించుకోవాలన్నారు. సమావేశంలో వైసీపీ జి ల్లా కమిటీ సభ్యుడు అంబటి కొండారెడ్డి, మండల బూత్ కమిటీ అధ్యక్షుడు గట్లా విజయ భాస్కరరెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు చల్లా సుబ్బారావు, జిల్లా రై తు సంఘం విభాగం నాయకులు, అంచూరి సత్యంరెడ్డి, ముడియాల అనంతరెడ్డి, మార్కొండాపురం గ్రామ సర్పంచ్ పుట్లూరి నారాయణరెడ్డి, చింతలపాలెం, మోపాడు గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్‌లు కేతు రమేష్‌రెడ్డి, అంబారపు లక్ష్మీనారాయణరెడ్డి, బత్తుల మస్తాన్‌రెడ్డి, కోటపాటి రవికుమార్‌రెడ్డి, ఎం.రామసుబ్బారెడ్డి, ధైండే తిరుపతయ్య, ఉడుముల ప్రభాకర్‌రెడ్డి, వైఎస్ రామిరెడ్డి, ఉప్పటూరి మాలకొండయ్య, బోయిళ్ల నారాయణరెడ్డి, ఇర్రి వినోద్, బి శంకర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, జొన్నలగడ్డ ప్రహల్లద, పి విష్ణువర్ధన్‌రెడ్డి, బ్రహ్మారెడ్డి, మాలకొండారెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై నిర్లక్ష్యం తగదు


చర్చి సెంటరులో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

కనిగిరి, జనవరి 20 : అంగన్‌వాడీల పట్ల వైసీపీ నిర్లక్ష్య వైఖరి తగదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పీసీ కేశవరావు అన్నారు. సమస్యలను పరిష్కరించాలని కోరతూ స్థానిక చర్చి సెంటర్‌లో అంగన్‌వాడీలు శనివారం మానవహారం నిర్వహించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌రెడ్డి అంగన్‌వాడీలపై కక్ష సాధింపు చర్యలకు దిగడం సరికాదన్నారు. కేంద్రాలను స్వాధీనం చేసుకున్న ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించటంలో విఫలమైందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సమ్మెకు దిగిన అంగన్‌వాడీలపై జగన్‌రెడ్డి ఎస్మాతో భయపెట్టాలని చూడడం సిగ్గుచేటన్నారు. సమస్యలు పరిష్కరించేవరకూ పోరాటాన్ని విరమించేదే లేదన్నారు. పాలకుత తీరుపై గ్రామాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. అనంతరం ర్యాలీగా ఐసీడీఎస్ కార్యాలయం వద్దకు చేరుకోగా వారికి మద్దతుగా ఆటోవర్కర్స్, ఐద్వా, డీవైఎఫ్‌ఐ సంఘాల నేతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు రాజ్యలక్ష్మి, రాజేశ్వరి, రామసుబ్బులు, సీత, రజని, సుజాత, సౌందర్య, మనోరంజిత, డీవైఎఫ్‌ఐ నరేంద్ర, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

పీసీపల్లి, : అంగన్‌వాడీ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. 40రోజులుగా ఆందోళన చేస్తున్నా జగన్‌రెడ్డికి చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. సమస్యలను పరిష్కరించకపోగా మహిళలు అని కూడా చూడకుండా ఎస్మాను ప్రయోగించడం దారుణమన్నారు.అనంతరం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటోవర్కర్స్, తాపీ వ ర్కర్స్, వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధులు నిరసన కార్యక్రమం నిర్వహించారు.

పామూరు : అంగన్‌వాడీల ఆందోళనపై జగన్‌రెడ్డి మొండిగా వ్యవహరిస్తున్నారని సీఐటీయూ జిల్లా నాయకుడు సయ్యద్ హనీఫ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో స్థానిక మమ్మీడాడీ సెంటర్‌లో అంగన్‌వాడీలకు మద్దతుగా శనివారం రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కె మాల్యాద్రి, అల్లాభక్ష్, ఐద్వా నాయకులు ఖాదర్ ఉన్నీసా, మదారమ్మ, రమీజా, అవాజ్ మండల కార్యదర్శి సయ్యద్ గౌస్‌బాషా, శ్రీను, సాంబయ్య, సీహెచ్ వెంకటేశ్వర్లు, పుల్లయ్య, శంకర్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

దర్శి : డిమాండ్ల సాధన కోసం చేస్తున్న ఆందోళనల్లో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు శనివారం గడియార స్తంభం సెంటర్లో రాస్తారోకో చేశారు. రోడ్లపై బైఠాయించడంతో ట్రాఫిక్ నిలచిపోయింది. సీఐటీయూ, ఏఐటీ యూసీ దళిత ప్రజాసంఘాల నాయకులు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా సీఐటీయూ దర్శి నియోజకవర్గ కార్యదర్శి రంగారావు మాట్లాడుతూ జగన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకుండా మాట తప్పారన్నారు. పోలీసు లు రోడ్డుపై బైఠాయించిన నాయకులను పక్కకు నెట్టి ట్రాఫిక్‌ను క్రమబద్ధీక రించారు. కార్యక్రమంలో అం గన్‌వాడీ యూనియన్‌నాయకులు తిరుపతమ్మ, అజిత, నాగమణి, బాలమ్మ, వెంకటరమణ, విశ్వవాణి, మల్లేశ్వరీ, సీఐటీయూ, ఏఐటీయూసీ, ప్రజాసంఘాల నాయకులు వెంకటేశ్వరరావు, నారాయణ, నాగేశ్వరరావు, హనుమంతరావు, వెంకటేశ్వరరావు, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.


గడియార స్తంభం సెంటర్‌లో ధర్నా చేస్తున్న కార్యకర్తలు

ముండ్లమూరు : అంగన్‌వాడీలకు మద్దతుగా బస్టాండ్ సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో శనివారం రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వెల్లంపల్లి ఆంజనేయులు, బోడపాటి హనుమంతరావు, ఏడుకొండలు, సత్యం పాల్గొన్నా రు. వారిని పోలీసులు అరెస్టు చేశారు.

దొనకొండ : అంగన్‌వాడీల సమ్మెకు సీఐటీయూ ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్‌లో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ కార్యదర్శి చిరుపల్లి అం జయ్య మాట్లాడుతూ 40 రోజులుగా మహిళలు రోడ్లపై ఆందోళన చేస్తుంటే జగన్‌రెడ్డికి పట్టకపోవడం దుర్మార్గానికి నిదర్శనమన్నారు. వైసీపీ పాలకుల నిర్లక్ష్యానికి తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొమ్మతోటి సుబ్బారావు, సీ ఐ టీయూ నాయకులు కుందుర్తి అనిల్, సం తోష్‌కుమార్, ఉదయ్. బండారు శ్రీకాంత్, కో టేసు, దావీదు, కర్జా కృష్ణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన

దర్శి, జనవరి 20 : బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పట్టణంలో శనివారం నిరసన ర్యాలీ చేశారు. 185 నెలలుగా డీఏ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, సెలవులకనగదు బకాయిలు చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర యుటీఎఫ్ మాజీ కార్యదర్శి మీగడ వెంకటేశ్వరరెడ్డి వెంకటరెడ్డి, యూనియన్ నాయకులు షేక్ అబ్దుల్, రాజశేఖర్, శ్రీనివాసరావు, ఖాశిం,రోశయ్య, కోటేశ్వరరావు, దేవరాజు పాల్గొన్నారు.


కందిని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ

మార్కెట్ ధరకే కందుల కొనుగోలు

దొనకొండ, జనవరి 20 : ఈ ఏడాది బహిరంగ మార్కెట్ ధరలకే కందులను కొనుగోలు చేస్తామని, ఒంగోలులో జరిగిన జిల్లా వ్యవసాయ మండలి సమావేశంలో జిల్లా ఉన్నతాధికారులు ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారని వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. కనీస మద్దతు ధర రూ.7వేలు కాగా, బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.8500 నుంచి రూ.9వేలు ధర ఉందన్నారు. ముందు రోజు మార్కెట్‌లో ఉన్న రేటుకే తర్వాత రోజు కొనుగోలు చేస్తారన్నారు. మండలంలో ఆరవల్లిపాడు, వద్దిపాడు, ఇండ్లచెరువు, మంగినపూడి, పోలేపల్లి గ్రామాల్లో కందుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది మండలంలో సుమారు 4వేల ఎకరాల్లో కంది పంట సాగు చేశారని 1600 మెట్రిక్ టన్నుల దిగుబడి రావచ్చని అంచనా వేసినట్లు చెప్పారు. కంది పంటలో అక్కడక్కడా మరూకా మచ్చల పురుగు, శనగపచ్చ పురుగు సోకిందని దీని నివారణకు లీటర్ నీటికి 5 మిల్లీ లీటర్లు వేప నూనెతో పాటు ఇమామెక్ట్ బెంజోయేట్ గ్రాము కలిపి సాయంత్రం సమయంలో పిచికారీ చేయాలని వ్యవసాయాధికారి సూచించారు.

ముగిసిన క్రికెట్ పోటీలు


విజేతలకు బహుమతులను అందజేస్తున్న ప్రసాద్‌రెడ్డి

తాళ్లూరు, జనవరి 20 : మండలంలోని బొద్దికూరపాడు గ్రామంలో రాజారెడ్డి యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. ఈ పోటీల్లో మొదటి స్థానం సాధించిన బొద్దికూరపాడు రాజారెడ్డి లెవెల్స్ ఈటీమ్‌కు సొసైటీ మాజీ అధ్యక్షుడు, ఉపసర్పంచ్ పులి ప్రసాద్‌రెడ్డి రూ.15,000, రెండవ స్థానం సాధించిన వెలుగువారిపాలెం జట్టుకు ఫీల్డ్ అసిస్టెంట్ గంగవరపు శివారెడ్డి రూ.10,000, మూడవ బహుమతిని అయ్యపురాజుపాలెం జట్టుకు ఎంపీటీసీ మాజీ సభ్యుడు గోపాల్‌రెడ్డి రూ.5వేలు, మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌కు కొప్పుల కల్యాణ్‌కి సొసైటీ సెక్రటరీ పులి శ్రీనివాసరెడ్డి రూ.2వేలు, మ్యాన్ ఆఫ్ ది మ్యాన్ కెప్టెన్ నగిలి రోశిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి అందజేశారు.

ఎస్‌ఈబీ సీఐ వినుకొండకు బదిలీ

కనిగిరి, జనవరి 20 : కనిగిరి ఎస్‌ఈబీ సీఐగా విధులు నిర్వహిస్తున్న షేక్ మహ్మద్ అబ్దుల్ జలీల్ ఖాన్ ఎన్నికల బదిలీల్లో భాగంగా కనిగిరి నుంచి గుంటూరు జిల్లా వినుకొండ సెబ్‌స్టేషన్ సీఐగా బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో రేపల్లె నుంచి ఎలీనను కనిగిరి ఎస్‌ఈబీ స్టేషన్ సీఐగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత సీఐగా విధులు నిర్వహిస్తున్న జలీల్‌ఖాన్ విధి నిర్వహణలో ఇసుక, మద్యం మాఫియాపై ఉక్కు పాదం మోపారు. అందులో భాగంగా ఆయనకు అధికారపార్టీ ప్రజాప్రతినిధుల నుంచి, రాజకీయ ప్రముఖుల నుంచి ఒత్తిళ్లు వచ్చినా ఎక్కడా తలొగ్గకుండా కంటగింపుగా మారారు. మద్యం మాఫియాకు చెందిన వ్యక్తులను సీఐ జలీల్‌ఖాన్ అదుపులోకి తీసుకున్న సమయంలో స్థానిక ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ విడిచి పెట్టాలని చెప్పినప్పటికీ ఎదురు తిరగారు. ఈక్రమంలో సీఐ జలీల్‌ను బదిలీ చేయిస్తానని ఎమ్మెల్యే హెచ్చరికలు జారీ చేసినప్పటికీ ఆయన విధి నిర్వహణలో నిక్కచ్చిగానే ఉన్నారు. దీంతో ఆయనపై తప్పుడు కేసులు నమోదు చేయించేందుకు ఎమ్మెల్యే, ఆయన అనుచర వర్గం ప్రయత్నించినట్లు ఇటీవల పెద్ద చర్చ సాగింది. ఆయితే రానున్న ఎన్నికల ప్రక్రియలో భాగంగానే ఆయన బదిలీ జరిగిందని ఎస్‌ఈబీ కార్యాలయ వర్గాలు చెప్తున్నాయి.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

పీసీపల్లి, జనవరి 20 : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని ఏఈఆర్వో ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ జి.కోటయ్య అన్నారు. మండలంలోని పోలింగ్ కేంద్రాలను శనివారం బీఎల్వోలతో కలిసి వారు పరిశీలించారు. అనంతరం పీసీపల్లి బ్యాంక్ సెంటర్లో ఓటర్లతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఇప్పటికే సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాలను గుర్తించామన్నారు. గతంలో నేరచరిత్ర కలిగిన వారిని గుర్తించి బైండోవర్ చేస్తున్నామన్నారు. ఓటు హక్కు వినియోగానికి అంతరాయం కలిగించే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, బీఎల్వోలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాక్సిన్ వికటించి చిన్నారి మృతి


చిన్నారి మృతదేహం

ముండ్లమూరు, జనవరి 20 : నాలుగు నెలల పాప వ్యాక్సిన్ వికటించి మృతిచెందిన సంఘటన శనివారం ముండ్లమూరు మండలంలోని వేముల గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గజ్జల శ్రీనివాసరెడ్డి, కుసుమకు అబ్బాయి, అమ్మాయి ఉన్నారు. పాపకు ఇటీవలే మూడు నెలలు నిండి నాలుగో నెల వచ్చింది. దీంతో శనివారం గ్రామంలోని ప్రభుత్వ హెల్త్ సెంటర్‌లో వ్యాక్సిన్ వేయించారు. వేసిన అరగంటకు చిన్నారి స్పృహతప్పి పడిపోవడంతో వెంటనే కుటుంబసభ్యులు దర్శి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. వైద్యాధికారులు పరీక్షలు చేసి పాప మృతిచెందినట్టు తెలిపారు. దీంతో తల్లిదండ్రులు శ్రీనివాసరెడ్డి, కుసుమ కన్నీరుమున్నీరుగా విలపించారు. దీనిపై ముండ్లమూరు పీహెచ్‌సీ వైద్యాధికారి జంగా వెంకటేశ్వరరెడ్డిని వివరణ కోరగా ఎనిమిది సబ్ సెంటర్లు ఉన్నాయని, ప్రతి బుధ, శనివారం వ్యాక్సిన్లు వేస్తున్నట్లు చెప్పారు. చిన్నారులకు వ్యాక్సిన్ వేసిన తర్వాత అరగంట పాటు అబ్జర్వేషన్‌లో ఉంచుతామని తెలిపారు. ఆ పాపతో పాటు గ్రామంలోని ఐదుగురి చిన్నారులకు వ్యాక్సిన్ వేశామని, వారంతా బాగానే ఉన్నారని చెప్పారు. మృతిచెందిన పాపకు ఆరు వారాల వరకు వ్యాక్సిన్ వేయించలేదని, ఏఎన్ఎంలు వెళ్లి తల్లిదండ్రులను అడిగితే తమ పాపకు ఆరోగ్యం సరిగా ఉండటం లేదని చెప్పినట్లు వైద్యాధికారి తెలిపారు. ఆరోగ్య సమస్యల వల్లే పాప మృతిచెందిందని తెలిపారు. వేముల గ్రామాన్ని వైద్యాధికారి జాస్మిన్, వెంకటేశ్వరరెడ్డి, సిబ్బంది సందర్శించారు.





మందు పిచికారి

తెగుళ్లతో.. దిగాలు

మిరప పంటపై తెగుళ్ల ఉధృతి అధికంగా ఉంది. ఒకటి రెండు కాదు ఏకంగా నాలుగైదు రకాల తెగుళ్లు మిరప పంటకు సోకడంతో రైతులు విలవిల్లాడుతున్నారు. తెగుళ్లు అధికమవ్వడంతో ఎకరాకు రూ.50 వేల వరకు పురుగు మందులకే వెచ్చిస్తున్నారు. రైతుల ప్రయోజనాల కోసం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశాం.. వీటిలో 899 రకాల పురుగు మందులు అందుబాటులో ఉంచాం.. రైతులు అడిగిన నాలుగైదు గంటల్లోనే మందులు సరఫరా చేస్తామంటూ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. అమలు మాటలకే పరిమితం కావడంతో రైతులు బయట మార్కెట్లో అధిక ధరలకు తెచ్చుకుంటున్నారు. రైతు భరోసా కేంద్రాలు అలంకార ప్రాయంగా మారాయి.



- మిర్చి పంటపై తెగుళ్ల ఉధృతి
- ఆర్బీకేల్లో అందుబాటులో లేని పురుగు మందులు
- మిరప రైతులకు తప్పని అవస్థలు
- తెగుళ్లు సోకిన మిరపకు మందులు సిఫార్సు లేదాయె
- ప్రైవేట్ వ్యాపారులపైనే ఆధారం
- అలంకారంగా రైతుల భరోసా కేంద్రాలు

తీవ్రతరమైన తెగుళ్ల బెడద..

పంట పూత, కాపు దశలో తెగుళ్ల బెడద మొదలైంది. చలితో పాటు మంచు ఎక్కువగా కురుస్తుండటంతో తెగుళ్ల తీవ్రత పెరిగింది. కొన్నిచోట్ల ఆకు ముడత, మచ్చ తెగుళ్ల వలన పంటలో ఎదుగుదల లేదు. ఆకులు రాలిపోయి, మొక్కలు ఎండి పోతున్నాయి. కాయలు కుళ్లి ఎండి రాలిపోతున్నాయి. నల్ల తామరతో పూత, కాయ దశలో వైరస్, నల్ల, పచ్చ, తెల్ల నల్లి సోకడంతో కాయ రాలిపోతోంది. కాయలు కుళ్లి ఎండి రాలిపోతుండటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.



వైరస్ సోకిన మిరప మొక్కలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఆర్బీకేలకు పురుగు మందులు సరఫరా చేయడాన్ని ప్రభుత్వం విస్మరించింది. 25 రకాల ఆర్గానిక్ మందులు, 178 రకాల సూక్ష్మ పోషకాలు, 899 రకాల పురుగు మందులు అందుబాటులో ఉంచుతున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. నేటి వరకు ఒక్క రకం పురుగు మందు కూడా ఆర్బీకేలకు సరఫరా కాలేదు. ఏపీ సీడ్స్ కోరమాండల్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుంది. రైతులు అడిగిన నాలుగైదు గంటల్లోనే వీటిని సరఫరా చేస్తారని ప్రభుత్వం వెల్లడించింది. ప్రస్తుతం మన గ్రోమోర్ సెంటర్ల నుంచి ఆర్బీకేలకు పురుగు మందులు సరఫరా ఇంతవరకు చేపట్టలేదు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో ఒక్క ఆర్బీకేకి కూడా పురుగు మందులు సరఫరా కాలేదు. దీంతో రైతులు బయట మార్కెట్‌లో ఎక్కువ ధరలకు పురుగు మందులు కొనుగోలు చేస్తున్నారు. బయట బయో ఉత్పత్తుల పేరుతో నాసిరకం పురుగు మందులను విక్రయిస్తున్నారు. నాసిరకం పురుగు మందులు వినియోగించడం వలన తెగుళ్ల ఉధృతి తగ్గక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

మిరప సాగుపై ఆసక్తి..

మిరపకు నల్ల తామర, కొమ్మ ఎండు, నల్ల, తెల్ల, పచ్చ నల్లి, ఆకు ముడత, కాయకుళ్లు, వేరుకుళ్లు తెగుళ్లు సోకాయి. తెగుళ్ల ఉధృతి పెరగడంతో పూతతో పాటు కాయలు రాలిపోతున్నాయి. మొక్కలు ఎండిపోతు న్నాయి. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 1,89,770 ఎకరాల్లో మిరప సాగైంది. అత్యధికంగా పల్నాడు జిల్లాలో 1,25,881 ఎకరాల్లో, బాపట్ల జిల్లాలో 25,337 ఎకరాలు, గుంటూరు జిల్లాలో 38,550 ఎకరాల్లో మిరప సాగు చేశారు. మిరపకు మంచి ధర ఉండటంతో పంట సాగుపై రైతులు ఆసక్తి కనబరిచారు. తేజ, బాడిగ, వండర్‌హాట్, చపాటా వంటి రకాలను ఎక్కువగా సాగు చేశారు. తెగుళ్లు ఒక్కసారిగా మిర్చిపై దాడి చేశాయి. అటు వర్షాభావం, ఇటు తెగుళ్ల నుంచి మిరపను కాపాడుకొనేందుకు రైతులు పడుతున్న కష్టాలు చెప్పనలవికావు.


అధికారుల సూచనలేవీ..?

తెగుళ్ల నివారణకు నిర్దిష్ట పురుగు మందులు లేకపోవడంతో ఇతర పంటలకు వాడే వాటినే మిరపకు వాడుతున్నారు. పంట యాజమాన్య పద్ధతులు, పురుగు మందులు వినియోగంపై రైతులకు అధికారులు సూచించక పోవడంతో ప్రైవేట్ కంపెనీలు లాభాల కోసం అనేక రకాల పురుగు మందులను సిఫార్సు చేస్తున్నాయి. వాటిని వాడి మరింతగా రైతులు నష్టపోతున్నారు పంట వేసిన మొదట్లో ఆకు ముడత వైరస్ వాహకంగా ఉండే తెల్లదోమ, ఆ తదుపరి నల్ల తామర, వైరస్ వలన దిగుబడి గణనీయంగా తగ్గుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. తెగుళ్ల నివారణకు ఎన్ని పురుగు మందులు వాడినా ప్రయోజనం లేదని వాపోతున్నారు. వాతావరణంలో మార్పులు వస్తే తెగుళ్ల తగ్గే అవకాశం ఉందని ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. తెగుళ్ల పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. పెట్టుబడులూ తిరిగిరావన్న ఆందోళన రైతుల్లో నెలకొంది.

కొరవడిన వ్యవసాయ శాఖ నిఘా..

రూ.కోట్లల్లో వ్యాపారం జరుగుతున్నా, నాణ్యమైన పురుగు మందులు విక్రయిస్తున్నారా లేదా అనే దానిపై వ్యవసాయ శాఖ నిఘా కొరవడింది. ఆర్బీకేల్లో పురుగు మందులు అందుబాటులో లేనందున రైతులు ప్రైవేట్ దుకాణాలు, గ్రామల్లో దళారుల వద్ద కొనుగోలు చేస్తున్నారు. రూ.లక్షలు పెట్టుబడులు పెట్టి పెద్దఎత్తున మిరప సాగు చేశారు. బహిరంగ మార్కెట్‌లో విక్రయించే పురుగు మందులు పిచికారీ చేస్తే పెద్దగా ప్రయోజనం ఉండటంలేదు. దీంతో రైతులు బయో పురుగు మందులపై దృష్టి సారించారు. బయో పురుగు మందులు ఎక్కువగా విక్రయాలు జరుగుతున్నాయి. వ్యాపారులు రైతులు కొనుగోలు చేస్తున్న మందులకు బిల్లులు కూడా ఇవ్వడంలేదు. ఇంత జరుగుతున్నా వ్యవసాయం శాఖ అధికారులు తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఆర్బీకేల ద్వారా పురుగు మందులు సరఫరా చేయాలని రైతులు కోరుతున్నా వారి మొర ఆలకించే వారే కరువయ్యారు. తెగుళ్లతో దిగుబడులు భారీగా తగ్గే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. తెగుళ్లు, వర్షాభావం, అధిక వర్షాలకు పంట దెబ్బతినడంతో పెట్టుబడి కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వీడని ఉత్కంఠ



- చీరాల, పర్చూరు వైసీపీలో అసమ్మతి పోరు
- రేపు చీరాలలో వైసీపీ సాధికార బస్సు యాత్ర
- యాత్ర విజయవంతానికి వెంకటేష్ ప్రత్యేక కార్యాచరణ
- విఫలం చేసేందుకు కొందరు అసమ్మతివాదుల యత్నం..!

చీరాల, జనవరి 20: వైసీపీలో అభ్యర్థుల ప్రకటన కసరత్తు మూడగులు ముందుకు రెండడుగులు వెనక్కు అన్న చందంగా ఉందని విపక్షాలతో పాటు ఆ పార్టీలోని పలువురు నేతలు అంటు న్నారు. జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో వైసీపీ అద్దంకి, వేమూరు, రేపల్లె నియోజకవర్గాలకు మాత్రమే అభ్యర్థులను ప్రకటించింది. మిగిలిన మూడు నియోజకవర్గాల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో చీరాల, పర్చూరు, బాపట్ల నియోజకవర్గాల్లో వైసీపీ అభ్యర్థులు ఎవరనే విషయంపై పుకార్లు షికార్లు చేస్తున్నాయి. చీరాల, పర్చూరు నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు కరణం వెంకటేష్, ఆమంచి కృష్ణమోహన్‌లకు వారి నియోజకవర్గాల్లో అసమ్మతి పోరు తప్పటం లేదు. దీంతో పార్టీశ్రేణులు గందరగోళానికి గురవుతున్నామని అంటున్నారు. ఈ క్ర మంలో రేపు చీరాల నియోజకవర్గంలో జరగనున్న వైసీపీ సాధికార బస్సు యాత్ర విజయవంతానికి వెంకటేష్ ప్రత్యేక కార్యాచరణతో పనిచేస్తుండగా, విఫలం చేసేందుకు అసమ్మతివాదులు ప్రయత్నిస్తున్నట్లు ఆ పార్టీ వర్గీయు లతో పాటు ఇతర రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ఇటీవల తుఫాన్ నేపథ్యంలో జిల్లాకు వచ్చిన సీఎం జగన్‌ను ఎమ్మెల్యే బలరాం కలిసిన సందర్భంలో వెంకటేష్ ఆరోగ్యం ఎలా ఉంది. త్వరగా కోలు కోవాలని చెప్తూ అసరమైతే వీల్‌చైర్లో అయినా జనాల్లో ఉండాలని చెప్పారు. దీంతో వైసీపీ చీరాల నియోజకవర్గ అభ్యర్థి వెంకటేష్ అని చెప్పకనే చెప్పిన ట్లయిందని, అధికారికంగా ప్రకటించటమే తరువాయి అని తమ అభ్యర్థి వెంకటేష్ అని వారి వర్గీయులు ఘంటా పథంగా చెప్తు న్నారు. ఎమ్మెల్యే బలరాం, వెంకటేష్‌లు కూడా అదే విషయాన్ని ధృవ పరుస్తూ ప్రకటనలు చేశారు. వీటన్నింటికన్నా ముందు రామాపురంలో జరిగిన ఓ సమావేశంలో పార్టీ ముఖ్యులు కూడా అభ్యర్థి వెంకటేష్ అని చెప్పారు. పార్టీ క్రార్యక్రమాల్లో వెంకటేష్ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తూ సొంత క్యాడర్‌ను ఏర్పాటు చేసుకున్నారని ఆయన వర్గీయులు చెప్తున్నారు. అదే తమ గెలుపునకు మలుపు అవుతుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే గత ఎన్నికల్లో బలరాం, వెంకటేష్‌లతో కలసి ప్రయాణం చేసిన డాక్టర్ పాలేటి రామారావు ఈసారి ఎన్నికల్లో తాను ఏదో ఒక పార్టీ నుంచి పోటీలో ఉంటానని చెప్తున్నారు. ఇదిలా ఉంటే మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణ మోహన్ వర్గంలో కొందరు ఎమ్మెల్యే బలరాం, వెంకటేష్‌లకు దూరంగానే ఉంటూ వస్తున్నారు. పరిస్థితులు మారితే ఆమంచి చీరాల నుంచి ఇండిపెండెంట్‌గా పోటీచేసే అవకాశం లేకపోలేదని వారు చెప్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

కాగా వైసీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఆమంచి కృష్ణమోహన్‌ను నియమించే విషయంలో అప్పట్లో మాజీ మంత్రి బాలినేని తీవ్రంగా వ్యతిరేకించారు. చివరకు ఆమంచినే పర్చూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా అధిష్టానం నియమించింది. బాధ్యతలు స్వీకరించిన తొలిరోజు నుంచి ఆమంచికి అసమ్మతి బెడద కొనసాగుతూనే ఉంది. అక్రమార్జన ఆధిపత్య పోరులో క్యాడర్ మధ్య ఒకటి రెండు ఘర్షణలు కూడా జరిగాయి. కొందరు తీవ్ర ఆరోపణలు చేశారు. ఆ ఎపిసోడ్‌లో అధిష్టానం ఒకింత ఆమంచి వైపే మొగ్గింది. ఇప్పటికి వైసీపీ అధిష్టానం నాలుగు జాబితాలు విడుదల చేసింది. వాటిలో ఈ రెండు నియోజకవర్గాల అభ్యర్థుల పేర్లు లేకపోవటంపై రాజకీయ పండితులతో పాటు తటస్థులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

అటెన్షన్





ఎన్నికలు సమీపిస్తున్న వేళ అత్యంత కీలకమైన ఓటరు జాబితా తుది ప్రచురణ సోమవారం విడుదల కానుంది. దీంతో అటు రాజకీయ పార్టీల్లో ఓట్ల గోల్‌మాల్ జరిగిందేమోనన్న ఆందోళన నెలకొని ఉంటే, ఇటు యంత్రాంగంలో మాత్రం జాబితా పారదర్శకంగా లేకపోతే ఎన్నికల కమిషన్ కన్నెర్ర చేస్తుందేమోనన్న ఒత్తిడిలో ఉన్నారు. ఇక తుది ప్రచురణపై సామాన్య ఓటరుకు కూడా అంతోఇంతో ఆసక్తి ఉంది. తన ఓటు ఫైనల్ జాబితాలో ఉంచారా లేక ఎవరైనా కుట్రచేసి తొలగించారా అనే మీమాంసలో సగటు ఓటరు ఉన్నాడు. అన్నింటికన్నా మించి 2024లో ఆయా పార్టీల అభ్యర్థుల జాతకాన్ని నిర్ణయించే తుది ఓటరు జాబితా ఇదే. దీంతో అన్ని పక్షాలు తుది ప్రచురణపై దృష్టి సారించాయి.

- రేపు ఓటర్ల జాబితా తుది ప్రచురణ విడుదల
- అటు రాజకీయపార్టీలు, ఇటు యంత్రాంగంలో ఆందోళన
- ఈ జాబితాతోనే ఎన్నికలు
- కొత్త ఓటు నమోదుకు వెసులుబాటు.. ఇక మార్పులు చేర్పులకు నో చాన్స్

బాపట్ల, జనవరి20(ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా తుది ప్రచురణ సోమవారం విడుదలవుతుండడంతో సవరణ ప్రక్రియలో భాగస్వాములైన యంత్రాంగంలో టెన్షన్ నెలకొని ఉంది. రాజకీయ పార్టీలు తుది జాబితాపై డేగకన్ను వేసి ఉండడంతో ఏవైనా తప్పులు దొర్లితే ఎన్నికల కమిషన్ ముందు దోషిగా నిలబడాల్సి వస్తుందనే ఆందోళన వారిలో కనబడుతోంది. వాస్తవానికి జనవరి 5న ఫైనల్ జాబితా విడుదలవ్వాల్సి ఉండగా, మెరుగైన జాబితా కోసమే ఈసీ గడువును పెంచింది. ఇంత సమయం తీసుకున్న తర్వాత కూడా జాబితాలో తప్పులు కనబడ్డాయంటే చివరికి అది తమ మెడకు చుట్టుకుంటుందేమోనన్న ఒత్తిడి యంత్రాంగంలో స్పష్టంగా కనబడుతోంది. ఇక రాజకీయ పార్టీల నాయకులది మరో టెన్షన్. తమ అనుకూలుర ఓట్లు తీసేయడానికి ప్రత్యర్థి పార్టీ కుట్ర చేసిందేమోనన్న అనుమానం వారిలో ఉంది. పాలకపార్టీ ఫాం7లను దుర్వినియోగం చేసే కుట్రకు తెరలేపిన సంగతి తెలిసిందే. చాలాచోట్ల ఆ కుట్రలను ఛేదించినా పర్చూరు, గుంటూరు పట్టణంలోని నియోజకవర్గాల్లో ఇబ్బడిముబ్బడిగా ఫాం7లను దరఖాస్తు చేసి మొత్తం ప్రక్రియనే అపహాస్యం చేసే దుస్సాహసానికి అధికార పార్టీ పూనుకుంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని మూడు నియోజకవర్గాలతో పాటు, బాపట్ల జిల్లాలోని పర్చూరు నియోజకవర్గంలో ఓటర్ల తుది జాబితా ప్రచురణపై నేతల్లో ఆసక్తి నెలకొని ఉంది.

* టీడీపీ అప్రమత్తం..

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని ఆయా నియోజకవర్గాల్లో బూత్ లెవెల్లో ఉన్న టీడీపీ శ్రేణులను పార్టీ ఇప్పటికే అప్రమత్తం చేసింది. తుది జాబితా విడుదలవగానే వారి పరిధిలో ఉన్న ఓట్లన్నీ ఉన్నాయా లేవా అనే చెక్ చేయడంతో పాటు అనర్హుల ఓట్లు ఏమన్నా చేర్చారా అనే కోణంలో కూడా జల్లెడ పట్టడానికి ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ ప్రక్రియను ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యేవరకు కొనసాగిస్తామని అవకతవకలు కనబడితే ఎన్నికల కమిషన్ వద్ద పోరాడతామని టీడీపీ తేల్చిచెబుతోంది.

* మొత్తం వచ్చిన దరఖాస్తులు 2,06,672...

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ మొదలైన దగ్గర నుంచి బాపట్ల జిల్లా లో ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులు మొత్తం 2,06,672. వీటిలో ఫాం6,7,8లు ఉన్నా యి. 1,69,644 దరఖాస్తుల విచారణను సమగ్రంగా పూర్తి చేసినట్లు అధి కారులు తెలిపారు. 30,669 దరఖాస్తులు నిబంధనలకు అనుగుణంగా లేవని తిరస్కరించారు. ఇంకా 6,329 దరఖాస్తుల విచారణ పెండింగ్‌లో ఉందని, అవన్నీ సాంకేతిక సమస్యల వల్ల పరిష్కరించబడలేదని యంత్రాంగం చెబు తోంది. కొత్త ఓట్ల చేర్పులు, ఇతర దరఖాస్తుల విషయంలో ఎన్నికల కమిషన్ తదుపరి ఆదేశాల మేరకే నడుచుకుంటామని చెబుతున్నారు. పెండింగ్ దర ఖాస్తుల విషయంలో కూడా ఈసీ ఉత్తర్వులే శిరోధార్యంగా వ్యవహరిస్తామని అధికారులు అంటున్నారు.

* పెరుగుదలపై సర్వత్రా ఉత్కంఠ...

గతేడాది అక్టోబరు 27న ఓటర్ల జాబితా ముసాయిదాను ఈసీ విడుదల చేసిన సంగతి తెలిసిందే. అందులో ఆ ఏడాది ఫైనల్ పబ్లికేషన్‌తో పోలిస్తే జిల్లాలో 15,521 ఓట్ల పెరుగుదల నమోదైంది. ప్రస్తుతం విడుదల చేసే తుది ప్రచురణలో నమోదయ్యే ఓట్ల పెరుగుదలపై రాజకీయ పార్టీల్లో ఆసక్తి నెలకొని ఉంది. అసాధారణంగా ఫాం7లు వచ్చి ఉండడం ఒక ఎత్తయితే, ముసాయిదా జాబితా విషయంలో చాలావరకు మార్పులు, చేర్పులు జోలికి వెళ్లకుండా 2023 ఫైనల్ డ్రాఫ్టనే యథాతథంగా విడుదల చేశారనే విమర్శలు రాజకీయ పార్టీలు చేశాయి. ఇప్పుడు తుది జాబితా విడుదల కానుండడంతో పెరుగుదల ఉంటే ఏ స్థాయిలో ఉండనుంది లేక అనూహ్యంగా గతేడాది ఫైనల్ డ్రాఫ్ట్‌తో పోలిస్తే తగ్గుదల నమోదవుతుందా అనే టెన్షన్ రాజకీయ పార్టీల్లో ఉంది.

* మంగళవారం రిలీవ్...

పర్చూరు, అద్దంకి, వేమూరు ఈఆర్‌వోలుగా వ్యవహరిస్తున్న అధికారులకు బదిలీల ఉత్తర్వులు గతేడాది నవంబరులోనే వచ్చాయి. అయితే వీరంతా ఆయా నియోజకవర్గాలకు ఈఆర్‌వోలుగా వ్యవహరిస్తునందువల్ల మొత్తం ప్రక్రియ పూర్తయ్యాకే రిలీవ్ కావాలనే ఈసీ ఆదేశాల మేరకే వారంతా కొనసాగారు. సోమవారంతో కీలకమైన తుది ప్రచురణ రానుండడం, సవరణ ప్రక్రియ ముగియడంతో వారంతా రిలీవ్ కానున్నారు. గుంటూరు మెప్మా పీడీగా ఉన్న వెంకటనారాయణ, బాపట్ల జిల్లా మెప్మాకు ఇన్‌ఛార్జిగా ఉంటున్నారు. అత్యంత వివాదాస్పదమైన పర్చూరు నియోజకవర్గానికి ఈఆర్‌వోగా కూడా ఆయనే ఉన్నారు. ఈయన ఈ నెల 23న రిలీవ్ కానుండగా, మిగిలిన వారు కూడా రెండుమూడ్రోజుల్లో రిలీవ్ అయి బదిలీ అయిన స్థానాలకు వెళ్లనున్నారు.

* రేపు కలెక్టరేట్ వేదికగా..

కలెక్టరేట్ వేదికగా ఓటర్ల తుది జాబితా ప్రచురణను సోమవారం విడుదల చేయనున్నారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు జాబితా ప్రతులను నియోజకవర్గాల వారీగా అందజేయనున్నారు. తుది జాబితాపై అభ్యంతరాలకు అవకాశం లేదు. ఇక్కడ నుంచి అర్హత కలిగిన వారు కొత్తగా ఓటు నమోదుకు అవకాశం ఉంటుందే తప్ప మరెలాంటి చేర్పులు, మార్పులకు ఆస్కారం లేదు.

రాహోయి.. అతిథీ..

- ఏటా వెలమవారిపాలేనికి విదేశీ పక్షులు
- ఆరు మాసాల పాటు కనువిందు
- ఏడాది ఇంతవరకు రాలేదు..
- ఎదురు చూస్తున్న గ్రామస్తులు

బల్లికురవ, జనవరి20: ఎన్నో దశాబ్దాల నుంచి సంక్రాంతి పండగకు ముందే వేల కిలోమీటర్ల దూరం నుంచి వచ్చే విదేశీ పక్షులు ఈ ఏడాది వెలమవారిపాలేనికి రాలేదు. పక్షులు వస్తే అదృష్టంగా బావించే స్థానిక ప్రజలు ఇప్పుడు వాటి రాకకోసం వెయ్యి కళ్లతో ఎదురు చూపులు చూస్తున్నారు. డిసెంబరు మాసం చివరిలో కొన్ని పక్షులు వచ్చి జనవరి మొదటి వారంలో వందల సంఖ్యలో రావటం ఆనవాయితీ. అలాంటిది ఈ ఏడాది ఇప్పటికి ఒక్క పక్షి కూడా రాలేదు. బల్లికురవ మండలం వెలమవారిపాలెం అంటే గుర్తు వచ్చేది నైజీరియా విదేశీ పక్షులే. ఏటా జనవరి మాసంలో వచ్చి జూన్ మాసం వరకు అక్కడే చెట్లపై ఉండి పిల్లలను చేసుకొని వాటికి రెక్కలు రాగానే తిరిగి స్వదేశానికి విదేశీ పక్షులు వెళుతుంటాయి. ఈ గ్రామం గుండ్లకమ్మ నదికి సమీపంలో ఉండటంతో పక్షులు నివాసం ఉండేందుకు అనువుగా ఉండటంతో పక్షులు వందల సంఖ్యలో వస్తున్నాయి. అలాంటిది ఈ ఏడాది మాత్రం జనవరి మాసం వచ్చి ఇరవై రోజులు గడుస్తున్న ఇంత వరకు ఒక్క విదేశీ పక్షి కూడా రాలేదు. పక్షుల నివాసానికి వీలుగా గ్రామ ప్రజలు నీటి కుంటను ఏర్పాటు చేశారు. అలానే చెట్లు కూడా పచ్చగా ఉన్నాయి. ఈ గ్రామానికి నలువైపులా నీటి వసతి కూడా ఉంది. అయినా విదేశీ పక్షులు గ్రామం వైపు రాకపోవటం ఏమిటని ప్రజలు చర్చించుకొంటున్నారు.



వలస పక్షుల కోసం వెలమవారిపాలెంలో ఏర్పాటు చేసిన నీటి కుంట



గత ఏడాది చెట్లపై ఉన్న పక్షులు (పాత చిత్రం)

తర తరాల నుంచి వస్తున్నాయి..



మా గ్రామానికి మా పూర్వీకుల కాలం నుంచి ఏటా జనవరి నెలకు ముందే వచ్చే విదేశీ పక్షులు ఈ ఏడాది అసలు రాలేదు. ఒక్క పక్షి కూడా రాకపోవటంతో తీవ్రంగా ప్రజ లు బాధపడుతున్నారు.

పి. వెంకటనారాయణ, వెలమవారిపాలెం

ఒప్పందాలపై.. మెలిక!

- వైసీపీలో.. అంతర్మథనం
- పలు మండలాల్లో ఎంపీపీల మార్పుపై అమలు కాని ఒప్పందాలు
- హనిమిరెడ్డి దృష్టికి తీసుకుపోయినా దాటవేత ధోరణి

అద్దంకి, జనవరి 20: అద్దంకి నియోజకవర్గంలోని పలువురు వైసీపీ నేతలలో అంతర్మథనం ప్రారంభమైంది. సార్వత్రిక ఎన్నికల సమయానికి మరింత ముదిరిపాకాన పడి ఓ వర్గం దూరమయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో పదవుల పంపకాలపై వైసీపీ నేతల మధ్య ఒప్పందాలు జరిగాయి. మొదటి రెండున్నరేళ్లు ఒకరు, ఆ తరువాత మరొకరు ఎంపీపీగా పనిచేసే విధంగా ఒప్పందాలు జరిగాయి. ఈ నేపథ్యంలోనే కొన్ని మండలాల్లో ఎంపీపీ పదవులు ఆశిం చిన ఎంపీటీసీలు కొంత మొత్తాన్ని ఎన్నికల ఖర్చులకు కూడా వెచ్చిం చారు. ఒప్పందాలు అమలుచేసే గడువు దగ్గరపడిన సమయంలో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న బాచిన కృష్ణచైతన్యను తొలగించి పాణెం హనిమిరెడ్డిని నియమించటంతో నాటి ఒప్పందాల అమలుపై నీలినీడలు అలుముకున్నాయి. ఒప్పందాలు అమలు చేయాలని పదవులు ఆశిస్తున్న వర్గం ఒత్తిడి పెంచగా, అందివచ్చిన అవకాశాన్ని వినియోగిం చుకొని పూర్తికాలం కొనసాగాలన్న తలంపుతో అధికార పీఠంపై ఉన్న ప్రజా ప్రతినిధులు పావులు కదుపుతున్నారు.

బల్లికురవ ఎంపీపీగా కొణిదెన ఎంపీటీసీ బడుగు శ్రీలక్ష్మి కొనసాగుతున్నారు. ఒప్పందం ప్రకారం బల్లికురవ ఎంపీటీసీ తంగిరాల రాహేల్‌ను ఎంపీపీగా చేయాలి. పంగులూరు మండలంలో బూదవాడ ఎంపీటీసీ నాగమ్మ ప్రస్తుతం ఎంపీపీగా ఉండగా, ఒప్పందం ప్రకారం తూర్పుకొప్పె ర పాడు ఎంపీటీసీ సింధూర లేదా కొండమంజులూరు ఎంపీటీసీని ఎంపీపీగా చేయాల్సి ఉంది. అద్దంకి మండలంలో ధర్మవరం ఎంపీటీసీ అవిశన జ్యోతి ఎంపీపీగా ఉండగా, బొమ్మనంపాడు ఎంపీటీసీ కామేపల్లి నాగేంద్రమ్మను ఎంపీపీగా చేయాలి. అద్దంకి మున్సిపాలిటీలో 2వ వార్డు కౌన్సిలర్ అనంతలక్ష్మి వైస్ చైర్‌పర్సన్ 2గా ఉండగా, ఒప్పందం ప్రకారం 9వ వార్డు కౌన్సిలర్ చెన్నుపల్లి రత్నకుమారిని చేయాల్సి ఉంది. సంత మాగులూరు మండలంలో ఉన్న ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా ఆట్లా చినవెంకటరెడ్డి గత ఏడాది రాజీనామా చేయటంతో అతని అనుచరుడే మరలా ఎంపీపీగా ఎన్నికయ్యాడు. ఎన్నికల సమయంలో వైసీపీ నియో జకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉన్న బాచిన కృష్ణచైతన్య సమక్షంలో ఒప్పందాలు జరిగి ఆమేరకు ఇరువర్గీయుల చేత ఒప్పంద పత్రాలు రాయించి తన వద్దనే ఉంచుకున్నట్లు తెలుస్తుంది. అయితే, ఇటీవల నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా కృష్ణచైతన్యను తొలగించి హనిమిరెడ్డికి అప్పగించారు. దీంతో నాటి ఒప్పందాలు అమలుచేయాలని ప్రస్తుత ఇన్‌చార్జ్‌గా ఉన్న హనిమిరెడ్డి దగ్గరకు ఆయా నేతలు వెళ్లినట్లు తెలుస్తుంది. ఆ విషయాలపై పెద్దగా స్పందించకుండా దాటవేత ధోరణితో వ్యవహరించినట్లు సమాచారం. దీంతో ఒకింత అసంతృప్తితో ఆయా మండలాల నేతలు ఉన్నట్లు తెలుస్తోంది. ఒప్పందాలు అమలు చేయకపోతే వచ్చే సార్వత్రిక ఎన్నికలలో తమ తడాఖా చూపించాలన్న ధోరణితో పలువురు నేతలు ఉన్నట్లు సమాచారం. ఈ ఒప్పందాలు అమలు జరగాలంటే పదవుల్లో ఉన్న వ్యక్తులు స్వచ్ఛందంగా రాజీనామా చేయాల్సి ఉంది. ప్రస్తుత పరిస్థితులలో ఉన్న పదవిని వదులుకునేందుకు ఏ ఒక్కరు కూడా సిద్ధంగా లేనట్లు తెలుస్తుంది.



చెట్టును ఢీకొని నుజ్జునుజ్జయిన కారు (ఇన్‌సెట్లో) మృతుడు శ్రీనివాస్

టైరు పేలి చెట్టును ఢీకొన్న కారు

● ఒకరి మృతి

కావలి రూరల్, జనవరి 20: కారు బోల్తాపడి ఒకరు మృతిచెందిన సంఘటన కావలి మండలం సర్వాయపాలెం క్రాస్‌రోడ్డు సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం జరిగింది. రూరల్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం నందనవనం గ్రామానికి చెందిన షేక్ శ్రీనివాస్ (39)కు బెంగళూరులోని బొమ్మనహళ్లి ప్రాంతానికి చెందిన ఆయేషాకు 10 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. లండన్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న వారు 6 నెలల క్రితం స్వగ్రామానికి వచ్చారు. ఈనేపథ్యంలో ఈనెల 18న నందనవనంలో ఉన్న భార్యను కారులో అత్తగారి ఊరైన బెంగళూరు తీసుకువెళ్లి వదిలిపెట్టి శుక్రవారం రాత్రి 9గంటల సమయంలో శ్రీనివాస్ కారులో స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యంలోని కావలి మండలం ముసునూరు టోల్‌గేట్ వద్ద కారు రోడ్డుపక్కన ఆపి నిద్రపోతుండగా శ్రీనివాస్ బావమరిది గొడుగు సాయిసలీమ్ ఫోన్ చెయ్యగా గంటలో ఊరికి వస్తానని చెప్పి తిరిగి కారులో బయలుదేరాడు. బయలుదేరిన 10 నిమిషాల్లోనే కారు టైరు పగిలి అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ఫెన్సింగ్ రాళ్లను ఢీకొని బోల్తాపడి చెట్టును ఢీకొంది. దీంతో కారులో నుండి కింద పడిపోయిన శ్రీనివాస్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య ఆయేషా, 3 నెలల కుమార్తె ఉన్నారు. రూరల్ ఎస్ఐ సుమన్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న రంగారావు

26న ట్రాక్టర్, బైక్‌ర్యాలీని విజయవంతం చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 20 : కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా గణతంత్ర దినోత్సవం రోజైన ఈనెల 26న ఒంగోలులో జరిగే ట్రాక్టర్, బైక్ ర్యాలీలను విజయవంతం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు పిలుపునిచ్చారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో శనివారం జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం రెండు పర్యాయాలు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ ఓటమే లక్ష్యంగా సంయుక్త కిసాన్ మోర్చా సుదీర్ఘ పోరాటానికి సన్నద్ధమైనట్లు తెలిపారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరారెడ్డి మాట్లాడుతూ వ్యవసాయచట్టాల రద్దుకు రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో మోదీ పూర్తిగా విఫలమయ్యారన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పమిడి వెంకట్రావు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ తెచ్చిన భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆచార్య రంగా కిసాన్ సంస్థ ప్రధాన కార్యదర్శి చుంచు శేషయ్య మాట్లాడుతూ ఈనెల 26న జరిగే ర్యాలీలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పీవీఆర్.చౌదరి, జి.శ్రీనివాసులు, కంకణాల ఆంజనేయులు, యు.బాలకోటయ్య, లలితకుమారి, కంకణాల రమాదేవి, బి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఊరు మారలే..!

పడకేసిన పల్లె ప్రగతి
రోడ్లు, డ్రైన్లు ఊసేలేని ప్రభుత్వం
అధిక ప్రాంతాల్లో పారిశుధ్యం అధ్వానం
నాలుగేళ్లు అయినా
కొలిక్కిరాని భవన నిర్మాణాలు
రూ.100 కోట్ల బిల్లులు పెండింగ్
మిల్క్ సెంటర్, డిజిటల్ లైబ్రరీల
నిర్మాణాలకు బ్రేక్
సగం ఇళ్లకు కూడా చేరని కొళాయిలు
పాఠశాలల్లో నాడు- నేడు పనులు
ఎక్కడవి అక్కడే
ప్రభుత్వం మాత్రం ఆర్భాటపు ప్రచారం
పంచాయతీలకు సమాంతరంగా
సచివాలయాలు
సర్పంచ్‌లలో తీవ్ర అసంతృప్తి
వైసీపీ ప్రభుత్వంలో కునారిల్లుతున్న గ్రామాలు

పల్లెసీమలు ప్రగతికి నోచుకున్నాయని అధికార వైసీపీ చేసిన ప్రకటనలను చూసి జనం ముక్కున వేలేసుకుంటున్నారు. 2019 నుంచి ఇప్పటివరకూ గ్రామాల్లో ఒక్క సిమెంటు రోడ్డుకానీ, సైడు కాలువ కానీ నిర్మించలేదు. ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన ప్రధాన భవనాల నిర్మాణం నత్తనడకన సాగుతున్నాయి. కొన్నిచోట్ల అసలు ప్రారంభించనే లేదు. ఇక నాడు-నేడు పనులు నిధులు లేక నీరసంగా సాగుతున్నాయి. అలాగే ధరలు ఆకాశాన్ని అంటి గ్రామీణ ఆర్థిక వ్యవస్థలు చిన్నాభిన్నమయ్యాయి. మునుపెన్నడూ లేని విధంగా గ్రామాలు వెనకబడ్డాయని పలువురు మండిపడుతున్నారు. మొత్తంగా గడచిన నాలుగున్నరేళ్లుగా గ్రామాలు అభివృద్ధికి నోచుకోకపోవడంతో ప్రజలు మార్పువైపు అడుగులు వేస్తున్నారు.



సింగరాయకొండ మండలం ఊళ్లపాలెంలో రద్దుచేసిన జగనన్న లేఅవుట్

ఒంగోలు,జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ పాలనలో పల్లెల ప్రగతి పడకేసింది. గ్రామీణ ప్రజలకు అవసరమైన అంతర్గత రోడ్లు, డ్రైన్లు వంటి కీలకమైన వాటి నిర్మాణాలు, అభివృద్ధి ఊసే ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అంతా అధ్వానంగా ఉంది. ఈ ప్రభుత్వం వచ్చాక ఏర్పాటుచేసిన సచివాలయ వ్యవస్థ గ్రామ పంచాయతీలకు సమాంతరంగా పనిచేస్తున్నాయి. ఇక గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, వివిధ సేవలు సత్వరం అందించేందు కోసం ప్రభుత్వం చేపట్టిన ప్రాధాన్యత భవన నిర్మాణాలు నాలుగేళ్లు గడిచినా కొలిక్కి రాలేదు. ఇక మిల్క్ సెంటర్లు, డిజిటల్ లైబ్రరీలు భవన నిర్మాణాలు అయితే ఆగిపోయాయి. మరోవైపు కేంద్ర సహకారంతో జలజీవన్ పథకం కింద చేపట్టిన ఇంటింటికి కొళాయి పథకం సగం ఇళ్లకు కూడా చేరిన దాఖలాలు లేవు. పాఠశాలల్లో చేపట్టిన నాడు-నేడు పనులు ఎక్కడివి అక్కడే కనిపిస్తున్నాయి. అయినప్పటికి రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పల్లె ప్రగతి పేరుతో ప్రభుత్వం ఆర్భాటపు ప్రచారం చేస్తుండటంతో ఏమాత్రం మార్పు లేని పల్లెల దుస్థితిపై ప్రజల్లో విస్తృత చర్చ సాగుతోంది.



పీసీపల్లిలో పాతభవనంలోనే అంగన్‌వాడీకేంద్రం

ఆగిపోయిన అభివృద్ధి

జిల్లాలో గత ప్రభుత్వ కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద ఎత్తున కృషి జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం నేరుగా కొన్ని గ్రాంట్లు, ఎంపీలాడ్స్, ఎస్‌డీఎఫ్, ఎమ్మెల్యే కోటా నిధులను ఉపాధి పథకం నిధులతో అనుసంధానం చేసి భారీగా సిమెంట్ రోడ్లు, డ్రైన్లు, పాఠశాలల అభివృద్ధి పనులు, అంగన్‌వాడీలు, పంచాయతీ భవన నిర్మాణాలు, మినీగోకులంలో షెడ్లు, ఫిషింగ్ డ్రయ్యర్లు వంటి అనేకం చేపట్టారు. దాదాపు రూ.2వేల కోట్లతో గ్రామాల్లో ఈ తరహా పనులు చేశారు. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి అంతా ఆగిపోయింది. పంచాయతీలకు సమాంతరంగా సచివాలయ వ్యవస్థను తెచ్చిన ప్రభుత్వం సిబ్బంది నియామకం అయితే చేసింది కాని వారిలో అత్యధికులు చేసేందుకు పనులు మాత్రం కనిపించలేదు. ఈ వ్యవస్థ ఏర్పాటుతో పంచాయతీ పాలకవర్గాల ప్రాధాన్యత తగ్గిందనే ఆవేదన, ఆగ్రహం సర్పంచ్‌లు, క్షేత్రస్థాయి ప్రజాప్రతినిధుల్లో అధికంగా కనిపిస్తోంది. గ్రామస్థాయిలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల మెరుగు ఊసేలేదు. గత ప్రభుత్వం ప్రణాళిక బద్ధంగా ఉపాధి పథకం మెటీరియల్ నిధులు వాడకం చేయగా వైసీపీ ప్రభుత్వం వచ్చాక జగనన్న కాలనీలలో లెవలింగ్ ఇతర సదుపాయాల కల్పన పేరుతో అధికశాతం నిధులు వైసీపీ నేతలు జేబుల్లోకి వెళ్లాయి. రోడ్లు, డ్రైన్లు అభివృద్ధితోపాటు పంచాయతీలో నిధులు లేక ప్రభుత్వం నుంచి గ్రాంట్లు రాక వీధిలైట్లు, తాగునీటి నిర్వహణ, అంతంతమాత్రంగా సాగుతుండగా పల్లెల్లో పారిశుధ్యం అధ్వానంగా మారింది.

భవన నిర్మాణాలు ఎక్కడివక్కడే..

సచివాలయ వ్యవస్థ వచ్చాక జిల్లాలో ప్రాధాన్యత భవనాల పేరుతో సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలను ప్రభుత్వం చేపట్టింది. ఒక్కొక్క సచివాలయ భవన నిర్మాణానికి రూ .43.20 లక్షలు, ఆర్‌బీకేలకు రూ.23.94 లక్షలు, హెల్త్ క్లినిక్‌లకు రూ.20.80 లక్షలు కేటాయించారు. అలా రూ.231.52 కోట్లతో 531 సచివాలయాలు, రూ.115.81 కోట్లతో 484 ఆర్బీకేలు, రూ.75.92 కోట్లతో 365 హెల్త్ క్లినిక్‌లు వెరసి మొత్తం రూ.423.31 కోట్లతో 1,380 భవన నిర్మాణాలు చేపట్టారు. అయితే నాలుగేళ్లు అయినా ఇంతవరకు అవి కొలిక్కి రాలేదు. తాజా అధికారిక లెక్కల ప్రకారం మొత్తం 1,380 భవనాల్లో 1,079 పూర్తిచేసి ఆయా శాఖలకు లేదా పంచాయతీలకు అప్పజెప్పగా ఇంకా 309 భవనాలు అప్పగించాల్సి ఉంది. అదేసమయంలో ఆయా భవన నిర్మాణాలకు రూ.380 కోట్ల వరకు వ్యయం కాగా ఇంకా రూ.103 కోట్ల మేర వాటిని నిర్మించిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. నాల్గవ వంతు భవనాలు ఇంకా పెండింగ్‌లోనే ఉండగా ఆయా శాఖలకు అప్పగించిన వాటిలోను వాడుకలో ఉన్నవి సగమే. కొన్నిచోట్ల అసంపూర్తిగా భవనాలు దర్శనమిస్తున్నాయి. ఇక మిల్క్ సెంటర్లు, డిజిటల్ లైబ్రరీల నిర్మాణం అసలు ఆగిపోయింది.

రాష్ట్ర వాటా ఇవ్వక ఆగిన జలజీవన్

మరోవైపు కీలకమైన జలజీవన్ మిషన్ పనులు అడుగు ముందుకు పడటం లేదు కేంద్ర ప్రభుత్వం ఇంటింటికి కొళాయితో రక్షిత నీటి సరఫరాకు ఈ పథకాన్ని ప్రవేశపెట్టగా రాష్ట్రప్రభుత్వం సకాలంలో తన వాటా నిధులు జమచేయక పనులు ముందుకు సాగడం లేదు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 4.98లక్షల కుటుంబాలు ఉండగా 2020 ఏప్రిల్ 1నాటికి కేవలం 1.37లక్షల కుటుంబాలకు మాత్రమే కొళాయిలు ఉన్నాయి. తదనంతరం పంచాయతీ, ఇతర గ్రాంట్లతో 65వేల కుటుంబాలకు ఏర్పాటుచేయగా జలజీవన్ మిషన్ కింద 2.97లక్షల కుటుంబాలకు కొళాయిలు ఏర్పాటు చేపట్టారు. అయితే నాలుగేళ్లు గడుస్తున్నా ఇంతవరకు కేవలం లక్షా 19వేల కుటుంబాలకు మాత్రమే కొళాయి కల్పించగా ఇంకా 1.77లక్షల కుటుంబాలకు జాడలేదు. ఇందుకు సంబంధించి గుర్తించిన 2,649 పనులలో 668 మంజూరే కాకపోగా మిగిలిన వాటిలో సగం కూడా పూర్తికాలేదు. ఇక పాఠశాలల్లో నాడు-నేడు పనుల పరిస్థితి కూడా అలాగే ఉంది. మూడేళ్లలో అన్ని పాఠశాలల రూపురేఖలు మార్చుతామని ప్రభుత్వం ప్రకటించినా తొలిదశలో 1,069 పాఠశాలల్లో చేపట్టిన పనుల్లో ఇంకా కొన్ని మిగిలి ఉన్నాయి. రెండవ దశలో రూ.417 కోట్లతో 977 స్కూళ్లు, కాలేజీల్లో పనులు చేపట్టగా రెండేళ్లు గడిచినా కేవలం రూ.188 కోట్ల పనులు మాత్రమే పూర్తయ్యాయి. అయితే వైసీపీ ప్రభుత్వం మాత్రమే పల్లెలు వెలిగించినట్లు ప్రచారం చేసుకుంటోంది.



పుట్టిన రోజు సందర్భంగా ఒంగోలు టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్



టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పుట్టిన రోజు సందర్భంగా నగరంలో భారీర్యాలీ నిర్వహిస్తున్న ఆయన అభిమానులు

ఘనంగా దామచర్ల జన్మదిన వేడుకలు

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఒంగోలు మాజీ శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ జన్మదిన వేడుకలు నగరంలో ఘనంగా జరిగాయి. శనివారం ఒంగోలులోని పార్టీ కార్యాలయంలో జరిగిన జన్మదిన వేడుకల్లో ఆయన అభిమానుల ఆప్యాయతల మధ్య కేక్ కట్ చేసి, సంతోషాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా జనార్దన్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపేందుకు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. నేరుగా కలిసి పుష్పగుచ్చం అందించడంతోపాటు, పలువురు శాలువాలు కప్పి సత్కరించారు. ఇదిలా ఉండగా టీడీపీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను దామచర్ల కట్ చేశారు. ఉదయం వల్లూరమ్మ దేవస్థానంలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు.

ఒంగోలు, కార్పొరేషన్



పుట్టిన రోజు సందర్భంగా జనార్దన్‌కు భారీ పూలమాల వేసి శుభాకాంక్షలు తెలుపుతున్న ముస్లిం నేతలు

ఆర్థిక సంఘం నిధులు మంజూరు

● రూ.37.57 కోట్లు పంచాయతీ అకౌంట్లకు జమ

● వడ్డీ రూపేణా మరో రూ.34.82 లక్షలు జమ

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 20: గ్రామ పంచాయతీలకు ఎట్టకేలకు ఆర్థిక సంఘం నిధులు మంజూరయ్యాయి. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెండో విడత నిధులు జిల్లాకు రూ.37.37 కోట్లు మంజూరు కాగా వడ్డీ రూపేణా మరో 34.82 లక్షలు జమయ్యాయి. కేంద్రప్రభుత్వం నేరుగా పీఎఫ్‌ఎంఎస్ ద్వారా పంచాయతీ అకౌంట్లకు నిధులను జమ చేసింది. అన్‌టైడ్ కింద రూ.14.95 కోట్లు, వడ్డీ కింద రూ.13.60 లక్షలు, టైడ్ కింద రూ.22.62 కోట్లు, వడ్డీ కింద రూ.21.22 లక్షలను మంజూరు చేసింది. అన్‌టైడ్ కింద మంజూరు చేసిన నిధులను ఇప్పటికే పంచాయతీ అకౌంట్లకు జమచేయగా, టైడ్ కింద మంజూరు చేసిన నిధులను నాలుగైదు రోజుల్లో పంచాయతీ అకౌంట్లకు పీఎఫ్ఎంఎస్ ద్వారా జమ చేయనుంది. ఈ నిధులతో డ్రైన్లు, ఎల్ఈడీ బల్బులు, సైడు కాలువలు వంటి పనులతో పాటు తాగునీటికి వినియోగించుకునేందుకు అవకాశం ఏర్పడింది. ఇప్పటికే నిధులు లేక నిర్వీర్యమైన గ్రామ పంచాయతీలు ప్రస్తుతం వచ్చిన కొద్దిపాటి నిధులతో పనులు చేసుకునే వీలు లభించింది.

రెండో రోజూ అదే పరిస్థితి

సర్వర్ పనిచేయక ఇబ్బందిపడ్డ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు

ఒంగోలు(కలెక్టరేట్),జనవరి 20 : జిల్లావ్యాప్తంగా శుక్రవారం నుంచి మొదలైన కులగణన సర్వేకు సర్వర్ అడ్డంకిగా మారింది. రెండో రోజైన శనివారం కూడా అనేక ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ ఆదేశాలతో సచివాలయ సిబ్బంది, వలంటీర్ల నేతృత్వంలో ఇంటింటికి తిరుగుతూ సర్వే చేశారు. జిల్లాలోని 719 గ్రామ, వార్డు సచివాలయాల్లో ఈ సర్వే జరుగుతుండగా సర్వర్ సక్రమంగా పనిచేయకపోవడంతో వివరాలు నమోదు చేసుకునేందుకు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఈ సర్వే పూర్తి స్థాయిలో సెల్‌ఫోన్ ద్వారా నమోదు చేయాల్సి ఉండటం, కొంత సమాచారం అందులోనే ఉండటంతో సర్వర్ పనిచేయక వలంటీర్లు, సచివాలయ సిబ్బంది అధిక సమయం ఒక ఇంటి వద్దనే ఉండాల్సి వస్తోంది. ఆ కుటుంబంలోని అన్ని వివరాలు నమోదు చేసేందుకు అధిక సమయం పడుతోంది. ఈ పరిస్థితి జిల్లాలోని అన్ని ఉన్నట్లు తెలుస్తోంది. ఒంగోలులోని శివారు కాలనీల్లో కూడా సర్వర్ పనిచేయక సిబ్బంది పడిగాపులు కాయాల్సి వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో సర్వే జరుగుతుండటంతో సర్వర్‌పై వత్తిడి పెరిగి డౌన్ అవుతుందని ఉన్నతాధికారులు చెప్తున్నట్లు సమాచారం.

డీకే భూములకు ఎసరు

● నిబంధనలకు విరుద్ధంగా పట్టాల్లో పేర్లు మార్పు

● వివాదాస్పదమవుతున్న అధికారుల తీరు

● ఉన్నతాధికారులకు ఫిర్యాదులు



చేతులు మారిన డీకే భూమిలో ప్లాట్లు వేసేందుకు మట్టితోలి చదును చేస్తున్న అక్రమార్కులు

దర్శి, జనవరి 20 : దర్శి ప్రాంతంలో డీకే పట్టా భూములు యథేచ్ఛగా చేతులు మారుతున్నాయి. పట్టాల పేర్లు మార్చి ఇతరులకు కట్టబెట్టే వ్యవహారం జోరుగా సాగుతోంది. ఇలా నిబంధనలకు విరుద్ధంగా క్రయవిక్రయాలు జరపటమే కాకుండా కొంతమంది ప్లాట్లు వేసి విక్రయాలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. తమకు అన్యాయం జరిగిందని పలువురు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతోపాటు కార్యాలయానికి వచ్చి గొడవకు దిగుతున్నారు. ఇందుకు రెండు రోజుల క్రితం జరిగిన ఘటన ప్రధాన చర్చనీయాంశమైంది. దర్శి-పొదిలి రోడ్డులోని 908/3 సర్వే నెంబర్‌లో ఎకరం భూమిని 1991లో ఎ.అచ్చయ్య అనే వ్యక్తికి డీకే పట్టా ఇచ్చారు. రెవెన్యూ అధికారులు అదే భూమిని ఆ పట్టా రద్దు చేసి కె.సామ్యేల్ అనే వ్యక్తికి ఇచ్చారు. 2010లో ఆ భూమిని ఓర్సు తిరుపతమ్మ అనే మహిళ కొనుగోలు చేసి రిజిస్టర్ చేయించుకుంది. ఇటీవల కొంతమంది వ్యక్తులు ఆ భూమిని కొనుగోలు చేసి ప్లాట్లు వేస్తున్నారు.

పట్టా మార్పు వివాదాస్పదం

కడపకు చెందిన వ్యాపారవేత్త శశికుమార్ అనే వ్యక్తి రెండు రోజుల క్రితం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి పట్టా మార్పుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 1991లో రిటైర్డ్ మిలటరీ ఉద్యోగి అయిన అచ్చయ్యకు ప్రభుత్వం ఆ భూమి కేటాయించి డీకే పట్టా ఇచ్చిందన్నారు. 2007లో అచ్చయ్య కుటుంబసభ్యుల నుంచి తాను కొనుగోలు చేసి స్వాధీనం రాయించుకున్నానని చెప్పారు. అచ్చయ్య కుటుంబసభ్యులకు తెలియకుండా రెవెన్యూ అధికారులు ఆ పట్టాను రద్దుచేసి ఇతరులకు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. అందుకు సంబంధించిన రికార్డులు తమకు ఇవ్వాలని సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసి నెలలు గడుస్తున్నప్పటికీ అధికారులు సమాచారం ఇవ్వకుండా ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయటమే కాక కోర్టులో కూడా న్యాయపోరాటం చేస్తామని శశికుమార్ హెచ్చరించారు. కాగా ఈ వ్యవహారంలో రెవెన్యూ అధికారులు చేతివాటం చూపినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

వాగుపోరంబోకు రికార్డులు

కాగా దర్శి-పొదిలి రోడ్డులోని 911 సర్వేనెంబర్‌లోని వాగు పోరంబోకు భూమి యథేచ్ఛగా ఆక్రమణలకు గురవుతోంది దశలవారీగా కొంతమంది వాగు భూమిని ఆక్రమించుకోవటంతో ప్రస్తుతం అక్కడ వాగు మాయమయ్యే పరిస్థితి నెలకొంది. ఆ భూమిలో యథేచ్ఛగా నిర్మాణాలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవటం లేదు. వాగుపోరంబోకు భూమిపై తమ పూర్వీకులకు హక్కు ఉందని, వారసత్వంగా తమకే వస్తుందని ఒక వ్యక్తి కొద్దిరోజుల క్రితం రికార్డులను బయట పెట్టారు. ఆ భూమి రికార్డుల్లో ప్రైవేట్ వ్యక్తుల పేర్లు ఎలా నమోదయ్యాయో అర్థం కాని పరిస్థితి. కానీ తనకు హక్కు కల్గిన భూమిని కేటాయించాలని ఆ వ్యక్తి కోరటంతో అధికారులు తలలుపట్టుకుంటున్నారు. రికార్డుల్లోకి అతని పేరు ఎలా ఎక్కిందనే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇటీవల కాలంలో దర్శిలో నకిలీ పత్రాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. కొంత కాలం క్రితం 80ఎకరాల ప్రభుత్వ భూమికి నకిలీ పట్టాలు సృష్టించి కొందరు వ్యక్తులు ఇతరులకు విక్రయించే ప్రయత్నాలు చేశారు. ఆ విషయాన్ని గుర్తించిన గ్రామస్థులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయటంతో పాస్ పుస్తకాలు తెప్పించి పరిశీలించగా నకిలీవిగా తేలింది. అదేవిధంగా కురిచేడు రోడ్డులో ఒక భూమి విషయంలో కూడా నకిలీ పట్టాలు సృష్టించి విక్రయించే ప్రయత్నాలు చేశారు. భూములకు, స్థలాలకు ధరలు విపరీతంగా పెరగటంతో కొంతమంది అక్రమార్కులు స్థలాలను, భూములను ఆక్రమించుకునేందుకు అక్రమ మార్గాలను ఎంచుకుంటున్నారు. కొంత మంది వివాదాలు సృష్టించి పంచాయితీలు చేసి లబ్ధి పొందుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే భూ వివాదాలు మరింత పెరిగే అవకాశం ఉంది.

చట్టపరంగా చర్యలు తీసుకుంటాం

ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా పటిష్ఠ చర్యలు తీసుకుంటామని డిప్యూటీ తహసీల్దార్ ఏ.రవిశంకర్ తెలిపారు. డీకే పట్టా మార్పు విషయాన్ని పరిశీలిస్తున్నామని, పాత రికార్డులు బయటకు తీసి వాస్తవాలు నిగ్గుతేల్చుతామన్నారు. వాగు పోరంబోకు భూమి రికార్డుల్లో ప్రైవేట్ వ్యక్తుల పేర్లు ఎలా ఎక్కాయో పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



ఆక్రమణకు గురైన వాగు పోరంబోకు భూమి

ప్రశాంతంగా నవోదయ ప్రవేశపరీక్ష

● 4,096 మంది గైర్హాజరు

ఒంగోలు(విద్య), జనవరి 20 : ఒంగోలు, కలుజువ్వలపాడులోని జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశానికి శనివారం నిర్వహించిన ప్రవేశపరీక్ష ప్రశాంతంగా జరిగింది. మొత్తం 46 పరీక్షా కేంద్రాల్లో పరీక్షను నిర్వహించారు. సుమారు 35శాతం మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షకు మొత్తం 11303 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 7202 మంది పరీక్ష రాశారు. 4096 మంది గైర్హాజరయ్యారు. ఒంగోలు నవోదయ పరిధిలో 18 కేంద్రాల్లో 3821 మందికి 2799 మంది హాజరు కాగా 1122 మంది గైర్హాజరయ్యారు. కలుజువ్వలపాడు నవోదయ విద్యాలయ పరిధిలో 28 పరీక్షా కేంద్రాల్లో 7382 మందికి 4408 మంది విద్యార్థులు మాత్రమే హాజరుకాగా 2974 మంది గైర్హాజరయ్యారు. ప్రభుత్వ పరీక్షల సహాయక కమిషనర్ కె.శివకుమార్ ఒంగోలు నగరంలోని పలు పరీక్షా కేంద్రాలను సందర్శించారు.

పంట పొలాలకు తాగునీరు మళ్లింపు

» వెంపరాల మేజర్ కాలువలో నీరు కిందకు రాకుండా అడ్డగింత



కూకట్లపల్లి వద్ద కాలువకు అడ్డుగా వేసి పంట పొలాలకు పెడుతున్న నీరు

బల్లికురవ, జనవరి 20: తాగునీటి అవసరాలకు విడుదలచేసిన సాగర్ నీరు పంటలకు పెడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవటం వలనే ఈ పరిస్థితి నెలకొందని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండల పరిధిలోని వెంపరాల మేజర్ కాలువ ద్వారా వచ్చే నీటిని కొందరు వ్యర్థాలను అడ్డుగా వేసి కూకట్లపల్లి గ్రామం వద్ద నీటిని పంట పొలాలకు మళ్లిస్తున్నారు. కొప్పెరపాడు రైతులు కూడా తమ పంటలకు కూడా నీటిని పెట్టుకోవాలని మేజర్ కాలువ పైకి వెళ్లి అడ్డుగా ఉన్న వ్యర్థాలను తొలగించే చర్యలు చేపట్టారు. ఈక్రమంలో అక్కడి రైతులు నీటిని కిందకు రానివ్వమని వాదనకు దిగారు. దీంతో రైతుల మధ్య వివాదం నెలకొంది. ఇలా అయితే చెరువులకు నీరు ఎలా చేరుతుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారులు పర్యవేక్షణ చేపడితేనే తాగునీటి చెరువులకు పూర్తిస్థాయిలో నీరు చేరుతుందని వారు తెలిపారు.

25న కేఆర్‌కేలో జాబ్ మేళా

అద్దంకిటౌన్, జనవరి 20: శింగరకొండ సమీపంలోని కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో ఈనెల 25న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మోహనరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్, బీసీఏ, పీజీ చేసిన విద్యార్థులు జాబ్ మేళాకు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. యావిటీ యూనివర్స్, పేటీఎం, హీరో మోటోకార్ప్, టాటా ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్, తదితర కంపెనీలు ఈ జాబ్‌మేళాలో పాల్గొంటాయని జేకేసీ సమన్వయకర్త ఎస్.షర్మిలారాణి తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాలలోపు విద్యార్థులు 24వ తేది మధ్యాహ్నం 2 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు కళాశాలలోని జేకేసీ సెంటర్ అధికారులను సంప్రదించాలని కోరారు.

'సమస్యలు సృష్టిస్తే చర్యలు'

చీరాలటౌన్, జనవరి 20: ఇటీవల ఓవర్గాన్ని దూషించి రిమాండ్‌కు వెళ్లి వచ్చిన వారి మద్దతుదారులు శనివారం రూరల్ సీఐ నిమ్మగడ్డ సత్యనారాయణను కలిశారు. ఘటనలో వారి వర్గానికి ఎటువంటి సంబంధం లేదని వివరించారు. మరోవర్గం వారు ఉద్దేశ పూర్వకంగానే కేసులో ఇరికించినట్లు చెప్పారు. దీనిపై వారినుంచి సీఐ స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. కేసు దర్యాప్తు జరుగుతున్నట్లు చెప్పారు. చట్టం అందరికీ సమానమేనని, కుల మత ప్రాంతాల బేధాలు సృష్టించి సమస్యలు రేకెత్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. దీనిపై మరోవర్గం కూడా ఆదివారం పోలీసులను కలిసి మరికొంత సమాచారంతో ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం.

ఇసుక టిప్పర్, ట్రాక్టర్ స్వాధీనం

అద్దంకి, జనవరి 20: గుండ్లకమ్మ నది నుంచి ఇసుక తరలిస్తున్న వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అద్దంకి పట్టణ సమీపంలోని గుండ్లకమ్మ నది నుంచి శనివారం ఇసుక తరలిస్తున్న ఒక టిప్పర్, ఒక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

నవోదయ పరీక్ష కేంద్రాలను సందర్శించిన ఆర్‌జేడీ



పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న ఆర్‌జేడీ సుబ్బారావు

అద్దంకిటౌన్, జనవరి 20: అద్దంకి పట్టణంలోని శ్రీప్రకాశం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, శ్రీప్రకాశం బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన నవోదయ ప్రవేశ పరీక్ష కేంద్రాలను విద్యాశాఖ ఆర్‌జేడీ సుబ్బారావు పరిశీలించారు. పరీక్ష జరుగుతున్న తీరు, విద్యార్థులకు కల్పించిన వసతులను పరిశీలించారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 264 మంది విద్యార్థులకుగాను 190 మంది హాజరయ్యారు. అలాగే, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 234 మంది విద్యార్థులకుగాను 170 మంది హాజరైనట్లు ఎంఈవోలు గంగాధరరావు, బి.సుధాకరరావు తెలిపారు. పదో తరగతి పరీక్షలలో ఉత్తీర్ణతా శాతాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఎంఈవోలకు ఆర్‌జేడీ సూచించారు.

సమష్టి కృషితో సత్ఫలితాలు

» ఎమ్మెల్యే కరణం బలరాం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బలరాం

వేటపాలెం(చీరాల), జనవరి 20: సమష్టి కృషితో సత్ఫలితాలు సాధించవచ్చునని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. కొత్తపేటలో రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన 33/11 విద్యుత్ సబ్‌స్టేషన్‌ను, దేశాయిపేటలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల షెడ్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఆయా సందర్భాల్లో ఎమ్మెల్యే బలరాం మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు లోఓల్టేజి సమస్య లేకుండా మార్గం సుగమమైందన్నారు. కార్యక్ర మంలో ఎమ్మెల్సీ పోతుల సునీత, మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు, విద్యుత్‌శాఖ ఎస్ఈ సత్యనారాయణ, ఈఈ థామస్‌జానీ, డీఈలు గోపాలరావు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, శ్రీనివాసులు, నాయకులు బొడ్డు సుబ్బారావు, కందేటి రమణ, దంతం వెంకట సుబ్బారావు, జంగిలి రామారావు, పులి వెంకటేశ్వర్లు, లేళ్ల శ్రీధర్, దంతం మంతు, జిడుగు మస్తాన్ పాల్గొన్నారు.

అనంతరం చీరాల మండలం తోటవారిపాలెంలో రెండురోజుల క్రితం విద్యుత్‌షాక్‌తో మృతిచెందిన వారి కుటుంబసభ్యులను ఎమ్మెల్యే బలరాం పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఆయన వెంట మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు, నాదెండ్ల కోటేశ్వరరావు, కట్టా గంగయ్య, దంతం హనుమంతరావు, ప్రతాప్, సుకీ ర్తన, తదితరులు ఉన్నారు.

ప్రమాదకరంగా రాజుపాలెం కూడలి

మార్టూరు, జనవరి 20: సింహపురి ఎక్స్‌ప్రెక్స్ హైవేను 6 లైన్లుగా విస్తరించే సమయంలో మండల పరిధిలో రాజుపాలెం కూడలి వద్ద అండరు పాస్‌ను నిర్మించక పోవడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. దాంతో అక్కడ ఉన్న రోడ్డు క్రాసింగ్‌ను హైవే అధికారులు మూసి వేశారు. చీరాల నుంచి పర్చూరు, యద్దనపూడి, మార్టూరు, బల్లికురవ, కొమ్మాలపాడు, గ్రామాల మీదుగా వినుకొండ వెళ్లేందుకు రాజుపాలెం కూడలిని క్రాస్‌చేస్తే ప్రయాణం సులభతరంగా ఉంటుంది. ఈ కూడలిలో అండరు పాస్ ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులకు ఇబ్బందిగా మారింది.

దేగరమూడి వైపు నుంచి వచ్చే వాహనదారులు రోడ్డు దాటేటప్పుడు రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం జరిగిన దాఖలాలు ఉన్నాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే మండలంలోని దేగరమూడి, యద్దనపూడి మండలంలోని చింతపల్లిపాడు గ్రామాలకు చెందిన రైతుల పొలాలు జాతీయ రహదారికి పడమర వైపున ఉన్నాయి. దాంతో రోజూ ఈ పొలాలుకు వెళ్లేందుకు రోడ్డు దాటి వెళ్లాల్సిందే. అలాగే, పశుపోషకులు గొర్రెలు, మేకలను మేపుకోవడానికి రోజూ రోడ్డు దాటి వెళుతుంటారు. రోడ్డు దాటే సమయంలో వాహనాల కిందపడి గొర్రెలు, మేకలు మృతి చెందిన సంఘటనలు జరిగాయి. మనుషుల ప్రాణాలతో పాటు పశువులు కూడా రోడ్డు ప్రమాదాల బారినపడిన సందర్భాలు ఉన్నాయి. మండల పరిధిలో రాజుపాలెం కూడలితో పాటు, జొన్నతాళి సెంటరు, కోలలపూడి రోడ్డు వద్ద ఇలాంటి సమస్యలు ఉన్నాయి. వాహనదారులే కాకుండా పశుపోషకులు రోడ్డు దాటడానికి, పశువులను రోడ్డు దాటించడానికి ఇబ్బందులు పడుతున్నారు.

విధ్వంసానికి ప్రతిరూపం వైసీపీ పాలన

» టిడ్కో ఇళ్లు పూర్తిచేయలేని చేతగాని ప్రభుత్వం

» ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్



అద్దంకిలోని మౌలానగర్‌లో టీడీపీ మినీమేనిఫెస్టో కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

అద్దంకి, జనవరి 20: జగన్‌రెడ్డి పాలన అంతా దోపిడీ, దౌర్జన్యాలు, విధ్వంసానికి ప్రతిరూపమని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అద్దంకి పట్టణంలోని 1వ వార్డులో బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి ఇంటింటికి తిరిగి టీడీపీ మినీ మేనిఫెస్టో గురించి వివరించి కరపత్రాలు అందజేశారు. ఇందులో మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేసినందుకు కృతజ్ఞతగా ఏర్పాటుచేసిన కేక్‌ను ఎమ్మెల్యే కట్ చేశారు. కొత్తదామావారి పాలెం, మౌలానగర్, కాకానిపాలెం, దూదేకులపాలెంలో పర్యటించారు. అనంతరం జరిగన సభలో ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ నాలుగున్నర సంవత్సరాలలో టిడ్కో ఇళ్లలో అసంపూర్తిగా ఉన్న పది శాతం పనులు పూర్తి చేయలేని చెత్త ప్రభుత్వం అధికారంలో ఉండటం దురదృష్టకరమన్నారు. వైసీపీ పాలనలో పేదలకు సొంతింటి కల భారంగా మారిందన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో అద్దంకి పట్టణ దాహార్తి తీర్చేందుకు రూ.84 కోట్లు మంజూరుచేసినట్లు చెప్పారు. ఇప్పటికీ వైసీపీ ప్రభుత్వం ఆ పనులు పూర్తి చేయలేదన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే టిడ్కో గృహాలను పేదలకు ఉచితంగా అందజేస్తామన్నారు. వైసీపీని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. టీడీపీ-జనసేన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జగన్ సర్కార్ రద్దు చేసిన 27 ఎస్సీ సంక్షేమ పథకాలను పునరుద్ధరిస్తామన్నారు. ఎన్నికల సమయంలో జగన్‌రెడ్డి మద్యపాన నిషేధం హామీ ఇచ్చి మాట తప్పారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, 3 ఉచిత గ్యాస్ సిలెండర్లు తదితర పథకాలు అందించనున్నట్టు చెప్పారు. వైసీపీ పాలనలో ప్రచారం కోసం పథకాలు, అమలుకు వచ్చేసరికి ఆంక్షలుగా ఉందన్నారు. అబద్ధపు మాటలతో గారడీలే వైసీపీ ప్రభుత్వ లక్ష్యాలని అన్నారు. కార్యక్రమాలలో టీడీపీ నేతలు చిన్ని శ్రీనివాసరావు, వడ్డవల్లి పూర్ణచంద్రరావు, సందిరెడ్డి శ్రీనివాసరావు, కాకాని అశోక్, గోరంట్ల లక్ష్మణదాస్, కోనేటి అనిల్, రహమాన్, ఖాశీం తదితరులు పాల్గొన్నారు.

పలువురిని పరామర్శించిన ఎమ్మెల్యే

అద్దంకి, జనవరి 20: అద్దంకి పట్టణంలోని కాకానిపాలెంలో పలు కుటుంబాలను ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ శనివారం రాత్రి పరామర్శించారు. పుష్కర కాలంగా కోమాలో ఉన్న మల్లెంపూడి శ్రీకుమార్‌ను పరామర్శించారు. ఇటీవల మృతి చెందిన సందిరెడ్డి శ్రీరాములు కుటుంబసభ్యులను పరామర్శించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి శస్త్రచికిత్స చేయించుకున్న మురకొండ వీరాంజనేయులును పరామర్శించారు.

చెరువులకు చేరని సాగర్ జలాలు

» దిగువకు వెళ్లకుండా నిలిపివేత

» పొంచిఉన్న మంచినీటి ఎద్దడి



నూతలపాడు మైనర్‌కు చేరని చుక్కనీరు

పర్చూరు, జనవరి 20: తాగునీటి అవసరాలకు సాగర్ నీరు విడుదలచేసినా ఆయకట్టు చివరకు చుక్కనీరు చేరలేదు. ఇప్పటికే పలు గ్రామాల్లోని మంచినీటి చెరువులు అడుగంటాయి. ఉన్న అరాకొర నీరు కాస్త రంగుమారి కలుషితంగా మారాయి. దీంతోపాటు దుర్గంధం కూడా వెదజల్లుతుంది. గత్యంతరం లేక ప్రజలు కలుషిత నీటినే ఉపయోగించుకుంటున్నారు. మంచినీటి అవసరాల కోసం సాగర్ జలాలు విడుదల చేయగా, చెరువులను నింపుకునేందుకు ఎదురుచూసిన అధికారులకు నిరాశే మిగిలింది.



కాలువను కమ్మేసిన చిల్లచెట్లు, ముళ్ళ పొదలు

పర్చూరు నియోజకవర్గ పరిధిలో 82 మంచినీటి చెరువులు ఉన్నాయి. ఈచెరువులను సాగర్, కొమ్మమూరు కాలువతోపాటు, పర్చూరు వాగుద్వారా నింపాల్సి ఉంది. అయితే, ప్రభుత్వం మంచినీటి అవసరాల కోసం విడుదల చేసిన సాగర్ జలాలు చెరువులకు చేరకుండానే డ్యాం వద్ద నీటిని నిలిపివేశారు. పర్చూరు అయకట్టు చివర కావటంతో నీటి సరఫరా అంతంతమాత్రంగానే ఉంటుంది. ఓపక్క ఆయకట్టు చివర కావటంతోపాటు, ఉన్న సాగర్ కాలువలు చిల్లచెట్లు, ముళ్ళ పొదలతో నిండిపోయి ఉన్నాయి. దీంతో నీటి సరఫరా సక్రమంగా సాగటంలేదు.

ప్రస్తుతం మంచినీటి చెరువుల్లో నీరు అరకొరగానే ఉంది. ఉన్న నీరు కాస్త కలుషితంగా మారింది. ఆయా గ్రామాల్లో ఫిల్టర్ బెడ్‌లు పనిచేయకపోవటంతో శుద్ధి చేయకుండానే కలుషిత నీటిని సరఫరా చేస్తున్నారు. గత్యంతరం లేక కలుషిత నీటినే ప్రజలు వినియోగించుకుంటున్నారు. చెరువుల్లో నీరు అడుగంటి ఉండటంతో వేసవిలో తాగునీటి కష్టాలు తప్పవేమోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

సీఎం నియంతృత్వ ధోరణి విడనాడాలి

» సమ్మెపై స్పందించని ప్రభుత్వం

» అంగన్‌వాడీ కార్యకర్తల ధ్వజం



బల్లికురవ కూడలిలో మానవహారంతో నిరసన వ్యక్తంచేస్తున్న అంగన్ వాడీ కార్యకర్తలు

చినగంజాం, జనవరి 20: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నియంతృత్వ ధోరణి వీడి అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇచ్చిన హామీలను నేరవేర్చాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.ప్రతాప్‌కుమార్ డిమాండ్ చేశారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు చేస్తున్న నిరవధిక సమ్మె శనివారం 40వ రోజుకు చేరింది. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించమంటే నోటీసులు పంపుతూ ప్రభుత్వం బెదిరింపులకు దిగుతుందని అన్నారు.కార్యక్రమంలో మండల పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

ఎస్మా చట్టాన్ని రద్దు చేయాలి

చీరాల, జనవరి 20: అంగన్‌వాడీలపై ఎస్మా చట్టాన్ని రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు ఎం.వసంతరావు, ఎన్.బాబూరావు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమ్మెకు మద్దతుగా శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సెంటర్లో రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్ నిరంకుశవైఖరి వీడాలన్నారు. కార్యక్రమంలో బి.వెంకటేశ్వర్లు, ప్రసాద్, కార్తీక్, జి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



పర్చూరు సీడీపీవో కార్యాలయం ముందు ప్రార్థనలు చేస్తున్న అంగన్‌వాడీలు

40వ రోజుకు చేరిన సమ్మె

కారంచేడు(పర్చూరు), జనవరి 20: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తమ న్యాయపరమైన సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 40వ రోజుకు చేరింది. కారంచేడు తహసీల్దార్ కార్యాలయం ముందు మండలంలోని అంగన్‌వాడీలు బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మనసు మారాలని ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యాకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. అలాగే, పర్చూరులోని సీడీపీవో కార్యాలయం ముందు అంగన్‌వాడీలుముఖ్యమంత్రి మనసు మారి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రార్థనలు నిర్వ హించారు. కార్యక్రమంలో మండలంలోని అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్: తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం నాటికి 40వ రోజుకు చేరుకుంది. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా శిబిరం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో ప్రధాన రహదారిపై రాస్తారోకో చేసేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు వస్తున్నారనే సమాచారంతో భారీగా పోలీసులు చేరుకున్నారు. నిరసన ర్యాలీతో అక్కడకు వచ్చిన అంగన్‌వాడీలను రాస్తారోకో చేయకుండా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కార్యకర్తలు, ప్రజాసంఘాల నాయకులు అక్కడినుంచి వెనుదిరిగారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు, బీఎస్పీ నాయకుడు మందా జోసఫ్, తదితరులు పాల్గొన్నారు.

మార్టూరులో రాస్తారోకో

మార్టూరు, జనవరి 20: మార్టూరు సెంటర్లో జాతీయ రహదారిపై శనివారం మధ్యాహ్నం మార్టూరు, యద్దనపూడి మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు రాస్తారోకో చేశారు. అర గంట సేపు రోడ్డుపై నిలబడి వాహనాలను వెళ్లకుండా ట్రాఫిక్ ను నిలిపివేశారు. శనివారం రాష్ట్రవ్యాప్తంగా రాస్తారోకో కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా మార్టూరులో చేపట్టిన రాస్తారోకోతో రోడ్డు పై వాహనాలు నిలిచిపోయాయి. ఈ విషయంపై ఆలస్యంగా సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల హనుమంతరావును అదుపులోకి తీసుకొని స్టేషన్ కు తరలించారు.

అనంతరం ఏఎస్ఐ బాషాతో పాటు పోలీసు సిబ్బంది అంగన్‌వాడీలకు నచ్చచెప్పడంతో రాస్తారోకోను విరమించారు. తదనంతరం వారంతా స్టేషన్‌కు ర్యాలీగా వెళ్లి హనుమంతరావును విడుదల చేయాలని పోలీసులతో వాదనకు దిగారు. ఎట్టకేలకు పోలీసులు సొంత పూచీకత్తుపై హనుమంతరావును వదిలివేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు శ్యామల, దయమ్మ, రమాదేవి, రాణి, సుహాసిని, కోటేశ్వరి, రాజేశ్వరి, అంజలి, పాల కుమారి, యద్దనపూడి మండలానికి చెందిన రేవతి ప్రేమానందం, తదితరులు పాల్గొన్నారు.

బల్లికురవలో మానవహారం

బల్లికురవ, జనవరి 20: ప్రభుత్వం తమ సమస్యలపై మొండివైఖరిని విడనాడాలని అంగన్‌వాడీ కార్యకర్తలు శనివారం మానవహారంతో నిరసన వ్యక్తం చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట గత 40 రోజుల నుంచి నిరవధిక సమ్మెలో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు నాలుగు రోడ్ల కూడలిలో మానవహారం చేపట్టి నిరసన తెలిపారు. వీరికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు, వీవోఏలు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సంఘ నేతలు నాగమణి, అనురాధ, సరస్వతి, వెంకటరమణ, బారతి, శివపావనీ, సునంద, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేతల ఒత్తిడితో తెరిచిన కేంద్రం

యద్దనపూడి(మార్టూరు), జనవరి 20: రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ కార్యకర్తలు నిరవధిక సమ్మె చేస్తుండగా, యద్దనపూడి మండలం పూనూరులో శనివారం ఉదయం కొంతమంది వైసీపీ నేతలు ఒత్తిడితో కేంద్రాన్ని తెరిచారు. ఎస్సీ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని వైసీపీ నేతలు ఒత్తిడి చేయడంతో ఆయా ప్రసన్న తలుపులు తెరిచారు. అనంతరం ఆయా ఈవిషయాన్ని సహచర అంగన్‌వాడీలకు తెలియచేయడంతో సీఐటీయూ మండల మహిళా అధ్యక్షురాలు జ్యోత్స్న ఆధ్వర్యంలో మండలంలోని దాదాపు 20 మంది కార్యకర్తలు కేంద్రం వద్దకు వచ్చారు. తెరచి ఉంచిన కేంద్రాన్ని మూసివేయించి తాళం వేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు దేవరాణి, హేమలత, రమాదేవి, సౌభాగ్యవతి తదితరులు పాల్గొన్నారు.



మార్టూరు: పూనూరులో బలవంతంగా తెరిపించిన కేంద్రం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు

రేపు అద్దంకి మున్సిపల్ సమావేశం

అద్దంకి, జనవరి 20: అద్దంకి మున్సిపల్ సాధారణ సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. ఛైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన సమావేశం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

మేలుజాతి పశుసంపదపై ప్రత్యేక దృష్టి

మార్టూరు, జనవరి 20: మండలంలోని బొల్లాపల్లి గ్రామంలో రైతు భరోసా కేంద్రం వద్ద శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానానికి చెందిన ఆవుకు రెండోసారి మేలు జాతి ఒంగోలు పిండాన్ని అమర్చారు. చదలవాడ పశు ఉత్పత్తి క్షేత్రం పశువైద్యులు డాక్టర్ సోమశేఖర్ ఐవీఎఫ్ పిండ మార్పిడి విధానం ద్వారా ఆవుకు గర్భధారణ చేశారు. గత ఏడాది కూడా ఐవీఎఫ్ పిండ మార్పిడి విధానం ద్వారా ఈ ఆవులో చదలవాడకు చెందిన పశువైద్యుల సహకారంతో పిండాన్ని ప్రవేశపెట్టారు. దాంతో ఆవు మేలుజాతి ఒంగోలు కోడె దూడకు గత ఏడాది జన్మ నిచ్చింది. ఈసందర్భంగా పశువైద్యులు డాక్టర్ సోమశేఖర్ మాట్లాడుతూ జన్యుపరంగా మేలు జాతి పశువులను తక్కువ సమయంలో వృద్ధి చేయడానికి ఐవీఎఫ్ పిండ మార్పిడి విధానం అనుకూలమైన పద్ధతి అని చెప్పారు. కార్యక్రమంలో కోనంకి పశువైద్యులు డాక్టర్ క్రాంతికిరణ్, ఆదర్శ రైతు వీరవల్లి కృష్ణమూర్తి, రైతు భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

రోటరీ సేవలు విస్తరణ

మార్టూరు, జనవరి 20: మార్టూరు రోటరీ క్లబ్‌ను శనివారం 3150 డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ బి.శంకర రెడ్డి సందర్శించారు. ఉదయం ఎఫ్‌ర్ట్ కార్యాలయం ఆవరణలో రోటరీ క్లబ్ సభ్యులతో సమావేశం ఏర్పాటుచేశారు. మార్టూరు రోటరీ క్లబ్ ద్వారా అందించిన సేవలను క్లబ్ అధ్యక్షులు తాళ్లూరి సాంబశివరావు డిస్ట్రిక్ గవర్నర్ దృష్టికి తీసుకువెళ్లారు. మరింతగా క్లబ్ సేవలను విస్తరించాలని కోరారు. అనంతరం క్లబ్ సభ్యులు, యువకులు, మహిళలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో జాష్టి వెంకటమోహనరావు, ఇంటూరి ఆంజనేయులు, చెరుకూరి నాగేశ్వరరావు, జాష్టి సాంబశివరావు, చెన్నుపాటి బసవ రాములు, కొర్రపాటి కాజారావు, ఎం.ఈశ్వరప్రసాద్, శానంపూడి లక్ష్మయ్య, షేక్ కాజా హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు 207 మంది హాజరు

ఇంకొల్లు, జనవరి 20: ఇంకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన నవోదయలో ఆరో తరగతి ప్రవేశ పరీక్షకు పర్చూరు బ్లాక్ పరిధిలో 207 మంది విద్యార్థులు హాజరైనట్లు మండల విద్యాశాఖాధికారి రాఘవరావు తెలిపారు. ఇంకొల్లు, చినగంజాం, యద్దనపూడి, పర్చూరు, కారంచేడు మండలాలకు చెందిన 281 మంది విద్యార్థులు ఈ పరీక్ష రాసేందుకు దరఖాస్తు చేసుకోగా 207 మంది హాజరయ్యారని తెలిపారు. చీఫ్ సూపరింటెండెంట్‌గా ప్రధానోపాధ్యాయుడు జి.శ్రీనివాసరావు వ్యవహరించగా, పరీక్షా కేంద్రాన్ని నవోదయ విద్యాలయం సీఎల్‌వో శ్రీనివాసరావు సందర్శించారు.

నేడు రావిపూడి ప్రథమ వర్ధంతి

ఇంకొల్లు, జనవరి 20:. ప్రముఖ హేతువాది రావిపూడి వెంకటాద్రి ప్రథమ వర్ధంతి ఇంకొల్లులోని రాడికల్ హ్యూమనిస్టు సెంటర్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు జరగనున్నట్లు హ్యూమనిస్టు సెంటర్ అధ్యక్షుడు మేడూరి సత్యనారాయణ తెలిపారు. పలువురు హేతువాద ప్రముఖులు పాల్గొని గ్రంథాలను ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. హేతువాద, మానవవాద అంశాలపై ఉపన్యాసం చేస్తారని తెలిపారు.

ముడిరాయి లారీలు పట్టివేత

మార్టూరు, జనవరి 20: మండలంలోని నాగరాజుపల్లి గ్రామ సమీపంలో బల్లికురవ మండలంలోని గ్రానైట్ క్వారీల నుంచి మార్టూరులోని పరిశ్రమలకు ముడిరాయిని తరలిస్తున్న రెండు లారీలను శుక్రవారం అర్ధరాత్రి మైనింగ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి బిల్లులు లేకుండా ముడిరాయి లారీలు మార్టూరు వస్తున్నాయి. వీటిని తనిఖీచేసి రెండులారీలను మార్టూరు స్టేషన్‌కు తరలించారు. ఈ తనిఖీలలో మైనింగ్ ఏడీ ఈరేష్, ఆర్ఐ మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు పట్టివేత

మార్టూరు, జనవరి 20: స్థానిక కిశోర్ కాలనీలో శనివారం సాయంతరం మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు ఏఎస్ఐ బాషా తెలిపారు. అక్రమంగా మద్యం అమ్ముతున్న మహిళను అదుపులోకి తీసుకొని 7 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్ఐ చెప్పారు.

పశుసంపదను సంరక్షించాలి

పర్చూరు, జనవరి 20: పశుసంపదను సంరక్షించాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి హనుమంతరావు అన్నారు. మండలంలోని తిమ్మరాజుపాలెంలో శనివారం జరిగిన గాలికుంటు వ్యాధి టీకాల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన పశువిజ్ఞాన బడి కార్యక్రమంలో పశువుల బీమా పథకాన్ని గురించి పశుపోషకులకు వివరించారు. గాలికుంటు వ్యాధి సోకకుండా ముందస్తుగా టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో పర్చూరు ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మాధవి, అన్నంబొట్లవారిపాలెం పశువైద్యాధికారి అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక తయారుచేయాలి

బల్లికురవ, జనవరి 20: గ్రామాల అభివృద్ధి పనులకు సమిష్టిగా ప్రణాళిక తయారుచేయాలని ఎంపీడీవో బ్రహ్మయ్య అన్నారు. శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జీపీడీపీపై పంచాయతీ వార్డు మెంబర్లు, వెలుగు వీవోఏలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిధులను ఎలా వినియెగించుకోవాలని అనే దానిపై పలు సూచనలు చేశారు. సమావేశంలో ఎంపీపీ శ్రీలక్ష్మి, ఎంఈవో రమేష్, ఈవోపీఆర్డీ సుమతి, తదితరులు పాల్గొన్నారు.

పురుగుమందు తాగి వృద్ధుడు ఆత్మహత్య

బల్లికురవ, జనవరి 20: మండలంలోని చెన్నుపల్లికి చెందిన మందపాటి అంజయ్య (87)అనే వృద్ధుడు అనారోగ్యంతో జీవితంపై విరక్తిచెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేనిసమయంలో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు గమనించి నర్సరావుపేట వైద్యశాలకు తరలించగా, చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతి చెందాడు, మృతుడి కుమారుడు శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ బండి శ్రీనివాసరావు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

గుంటుపల్లిలో అక్షతలు పంపిణీ

బల్లికురవ, జనవరి 20: మండలంలోని గుంటుపల్లిలో శనివారం రాత్రి ఆధ్యాత్మిక శోభ నెలయొంది. అయోధ్య దేవాలయం నుంచి వచ్చిన అక్షతలను గ్రామంలోని పెద రామాలయంలో ఉంచి ప్రత్యేకంగా గ్రామోత్సవం నిర్వహించి ఇంటింటికి పంపిణీ చేశారు. అయోధ్యలో రాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా అక్షతలు మా గ్రామానికి రావటం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామని ప్రజలు తెలిపారు.

అంబేడ్కర్ భవన్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం

అద్దంకి, జనవరి 20: అంబేడ్కర్ భవన్‌లో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న పనులు పూర్తిచేసేందుకు సహకారం అందిస్తామని వైసీపీ పట్టణ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి అన్నారు. అంబేడ్కర్ భవన్‌లో తన సొంత నిధులు సుమారు లక్ష రూపాయలు వెచ్చించి కాకాని రాధాకృష్ణమూర్తి బోర్, మోటార్, విద్యుత్ సౌకర్యం కల్పించి శనివారం రాత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, కిరణ్, పూర్ణ, సురేంద్ర, నాగయ్య, గంగాధర్, బన్ను, వీరాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు కారంచేడులో టీడీపీ కార్యాలయం ప్రారంభం

కారంచేడు(పర్చూరు), జనవరి 20: కారంచేడు గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని ఆదివారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రారంభిస్తారు. అనంతరం పెదకాకాని శంకర్ వైద్య నిపుణుల ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్థానిక నేతలు కోరారు.

జనసేన జోనల్ కమిటీ సభ్యుడిగా గోరంట్ల సాయి

అద్దంకి, జనవరి 20: జనసేన పార్టీ ఎన్నికల కార్యక్రమాల నిర్వహణ జోనల్ కమిటీ సభ్యుడిగా అద్దంకి పట్టణానికి చెందిన గోరంట్ల సాయిని నియమిస్తూ రాష్ట్ర కమిటీ నుంచి సమాచారం అందినట్లు ఆయన తెలిపారు. తన నియామకానికి సహకరించిన జన సేన నేతలకు సాయి కృతజ్ఞతలు తెలిపారు.

'సోమశిల'కు ఆగిన ఇన్‌ఫ్లో!



అనంతసాగరం : సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతం నుంచి ఇన్‌ఫ్లో పూర్తిగా ఆగిపోయింది. దీంతో డ్యాంలో 28.798 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 2,350, ఉత్తర కాలువకు 500, దక్షిణ కాలువకు 200 క్యూసెక్కుల చొప్పున నీరు విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.



బ్యాటరీయే బెటర్!

ఎలక్ట్రిక్ వాహనాలకు పెరుగుతున్న క్రేజ్ ● ఆకట్టుకునే మోడళ్లు, ఫీచర్స్‌తో అందుబాటులో

ఆకాశాన్ని తాకుతున్న ఇంధన ధరలను చూసి వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. ఇంటిలో నుంచి వాహనం బయటకు తీయాలంటేనే జంకుతున్న పరిస్థితులు ఏర్పడ్డాయి. దీనికితోడు వాహనాల నుంచి వెలుగువడుతున్న కాలుష్యం భావితరాలను భయం గుప్పెట్లోకి నెట్టేసింది. ఈ పరిస్థితుల్లో ఎలక్ట్రికల్ వాహనాలు అన్ని వర్గాల ప్రజలకు ఊరటనిచ్చాయి. రెండేళ్ల క్రితం వరకూ ఎలక్ట్రికల్ వాహన వినియోగదారులు జిల్లాలో రెండు శాతం కూడా ఉండేవారు కాదు. అయితే, ప్రస్తుతం ఆ సంఖ్య 25 నుంచి 31 శాతానికి చేరుకుంది. ప్రధానంగా ద్విచక్ర వాహనాలు, కార్లనే అధికంగా కొనుగోలు చేస్తున్నారు. వీటితోపాటు ఎలక్ట్రికల్ ఆటోలు, లగేజి వాహనాలు, బస్సుల విక్రయాలూ జోరందుకుంటున్నాయి. వాటి ధరలు కూడా సాధారణ బండ్లకు సమానంగానే ఉన్నా మెయింటెనెన్స్ చాలా తక్కువగా ఉంటోంది. గత ఏడాది జూన్ వరకు కేంద్ర ప్రభుత్వం ఈ వాహనాలకు సబ్సిడీ అధికంగా ఇచ్చేది. అయితే జూన్ తర్వాత బాగా తగ్గించడంతో కొంతమేర అమ్మకాలు తగ్గినా దసరా నుంచి విక్రయాలు ఊపందుకున్నట్లు షోరూమ్‌ల యజమానులు చెబుతున్నారు.

స్కూటీలకు ఆదరణ అదుర్స్.. ఊపందుకున్న కార్ల విక్రయాలు

వ్యాపారులకు వరంగా ఈ ఆటోలు

వాహనదారులకు అందుబాటులో చార్జింగ్ పాయింట్లు


● పుట్టగొడుగుల్లా షోరూమ్‌లు

జిల్లాలో ఎలక్ట్రికల్ వాహనాలు విక్రయించే షోరూమ్‌లు పదుల సంఖ్యల్లో వెలిశాయి. అయితే, అన్‌రిజిస్టర్ వాహనాల కంపెనీలు మాత్రం పుట్టగొడుగుల్లా పుట్టుకు వస్తున్నాయి. ఏథర్, టీవీఎస్ హైక్యూబ్, ఓలా, బజాజ్ చేతక్, ప్యూర్ వంటి కంపెనీలు ఈ స్కూటీలను విక్రయిస్తున్నా యి. కొత్త మోడళ్లలో అనేక ఫీచర్స్‌తో ఈ స్కూటీలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. రిజిస్ట్రేషన్‌కు చెందిన ఈ స్కూటీలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రాయితీని తొలగిస్తే రూ.1.25 లక్షల నుంచి రూ.1.9 లక్షల వరకు ధర ఉంటుంది. 90 కి.మీ వేగంతో 210 కిలోల బరువుతో ప్రయాణించవచ్చు. విద్యుత్ చార్జింగ్ ద్వారా బ్యాటరీలకు చార్జింగ్ చేసుకో వాల్సి ఉంటుంది. పబ్లిక్ చార్జింగ్ పాయింట్లలో చార్జింగ్ చేయిస్తే 45 నిమిషాలకు బ్యాటరీ ఫుల్ అవు తుంది. ఇళ్లలో కరెంట్ అయి తే 4 నుంచి 6 గంటల సమయం పడుతుంది. ఒక్కసారి బ్యాటరీ ఫుల్‌గా చార్జింగ్ పెడితే 110 కి.మీ దూరం ప్రయాణించవచ్చు. బ్యాటరీ ఫుల్ అయ్యేందుకు 3 నుంచి 4 యూనిట్లలోపు కరెంట్ ఖర్చు అవుతుంది. ఈ వాహనాలకు ఫైనాన్స్ సదుపాయం కూడా ఉంటుంది.

● జాగ్రత్తలు తప్పనిసరి

ఆడ, మగ అని తేడా లేకుండా ఈ స్కూటీలు నడిపే అవకాశం ఉండటంతో ఆదరణ పెరుగుతోంది. నగరం, పట్టణం, పల్లె అన్న తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో ఈ స్కూటీలను వినియోగిస్తున్నారు. ప్రధానంగా వ్యాపారులు ఈ స్కూటీలను కొనుగోలు చేసి మార్కెట్‌లకు వెళ్లి సామాన్లు తెచ్చుకునేందుకు వీలుగా ఎక్స్‌ట్రా ఫిట్టింగ్‌లు చేయించుకుంటున్నారు. అయితే, ఈ వాహనాలను వాడే సందర్భంగా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని మెకానిక్‌లు చెబుతున్నారు. ప్రతి 5వేల కిలోమీటర్లకు ఒకసారి సర్వీస్ చేయించుకోవాలి. టైరు ప్రెజర్ జాగ్రత్తగా చూసుకోవాలి. చార్జర్ నీళ్లలో తడపకూడదు. వాటర్ సర్వీస్ చేయించేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. బెల్ట్, బ్రేక్ ప్యాడ్, చార్జర్ల రిపేర్లు ఎక్కువగా ఉంటాయి. బ్యాటరీకి 3 నుంచి ఐదేళ్ల వారంటీ ఉంటుంది.

\- నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట)





● ఆదివారం ప్రత్యేకం

● కార్లకు పెరుగుతున్న డిమాండ్

ఐదేళ్ల క్రితమే ఈ కార్లు మార్కెట్లోకి వచ్చినా బ్యాటరీ కెపాసిటీ తక్కువగా ఉండటంతో వాహనదారులు అంతగా ఇష్టపడలేదు. అయితే, తయారీ కంపెనీలు పెరగడం, పోటీతత్వంతో అనేక ఫీచర్స్‌తో ఎలక్ట్రిక్ కార్లు మార్కెట్లో వచ్చేశాయి. ప్రస్తుతం ఈ కార్లు రూ.8 లక్షల నుంచి 5 కోట్ల వరకు ధర పలుకుతోంది. చార్జింగ్ పాయింట్లు కూడా విస్తరిస్తుండటంతో వాహనదారులు కొనుగోలుకు మక్కువ చూపుతున్నారు. ఒక్కసారి చార్జింగ్ చేస్తే 230 నుంచి 460 కిలోమీటర్ల వరకు ప్రయాణించే అవకాశం ఉంది. ఇక ఈ ఆటోలకు మార్కెట్‌లో ఇప్పుడిప్పుడూ డిమాండ్ పెరుగుతోంది. తక్కువ మెయింటెనెన్స్‌తో అధిక బరువులు తీసుకు వెళ్లే ఆటోలు వచ్చేశాయి. ప్రముఖ కంపెనీలు ఈ ఆటోలను మార్కెట్‌లోకి దించుతున్నారు.



తిరుపతికి ఈ బస్సుల్లో..

నెల్లూరు నుంచి తిరుపతికి ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయి. తిరుపతి రీజియన్‌కు చెందిన 12 ఈ బస్సులు నెల్లూరు 2వ డిపో పర్యవేక్షణలో నడుస్తున్నాయి. రెండవ డిపో గ్యారేజ్‌లో ఈ బస్సుల కోసం ప్రత్యేకంగా చార్జింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. రూ.250 చార్జీ వసూలు చేస్తున్నారు. శబ్దం లేకుండా, కాలుష్యం వెదజల్లకుండా ఈ బస్సులు రోడ్లపై తిరుగుతుంటే ప్రజలు విచిత్రంగా ఇప్పటికీ చూస్తున్నారు.

ప్రజల నుంచి స్పందన బాగుంది



ఈ బైక్‌లకు ప్రజల నుంచి మంచి స్పందన ఉంటోంది. పెట్రోల్ వెహికల్స్‌తో పోల్చుకుంటే మెయింటెనెన్స్ చాలా తక్కువగా ఉటుంది. ప్రజల ఆదరణ చూసి ఏథర్ కంపెనీ తరఫున జిల్లావ్యాప్తంగా 12 ప్రాంతాల్లో ఫాస్ట్ చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేశాము. మా కస్టమర్లు ఉచితంగా ఈ వాహనాలకు చార్జింగ్ చేసుకోవచ్చు.

\- జి.దిలీప్‌కుమార్, ఏథర్ నెల్లూరు బ్రాంచ్ మేనేజర్

చార్జింగ్ పాయింట్ 10 కేవీ ఉండాలి



ఈ కార్లకు ఇంట్లో చార్జింగ్ పాయింట్ ఏర్పాటు చేసుకునే సమయంలో కనీసం 10కేవీ తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలి. దీనిద్వారా చార్జింగ్ ఎక్కే సమయంలో బ్యాటరీకి ఎలాంటి ఇబ్బందులు రావు. ఈ కార్లు కొనుగోలు చేసే వారి సంఖ్య ఇప్పుడిప్పుడే పెరుగుతోంది. ప్రధానంగా డాక్టర్లు, వ్యాపారులు, ఉద్యోగులు కొనుగోలు చేస్తున్నారు.

\- ఎస్.విశ్వనాథ్, సేల్స్ జీఎం, బాలాజీ మహేంద్ర

తక్కువ ఖర్చు



ఎలక్ట్రికల్ స్కూటీను ఈ మధ్యే కొన్నాను. గతంలో నేను పెద్ద బైక్ వాడుతున్నప్పుడు రోజు వందల రూపాయలకు పెట్రోలు పట్టించాల్సి వచ్చేది. అయితే ఇప్పుడు రాత్రి ఈ స్కూటీకి చార్జింగ్ పెట్టి బ్యాటరీ ఫుల్ చేస్తే చాలు రోజంతా తిరగొచ్చు. ఈ స్కూటీ కొన్నప్పటి నుంచి పెట్రోలు ఖర్చు మిగిలింది. డ్రైవింగ్ కూడా చాలా స్మూత్‌గా ఉంది.

\- పి సిద్ధార్థ, డాక్టర్, నెల్లూరు

బాట పేరుతో బాదుడు!

- ఇసుక రీచ్‌లో అదనపు వసూలు
- టిప్పర్‌కు రూ.2వేల వరకు దండకాలు
- లబోదిబోమంటున్న వాహన యజమానులు
- ముదివర్తిపాళెం, పల్లెపాడు వద్ద నిరసన

నెల్లూరు (వెంకటేశ్వరపురం), జనవరి 20 : జిల్లాలో ఇసుక రీచ్‌ల నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ విధానాలతో ఇప్పటికే ట్రాక్టర్ ఇసుక దాదాపు రూ.5వేలు పలుకుతోంది. ఇటీవల రీచ్‌లను దక్కించుకొన్న ప్రతిమా సంస్థ నిర్వాహకులు ప్రస్తుత ధరలతోపాటు అదనంగా వసూలు చేస్తున్నారు. కొన్ని రోజుల నుంచి రీచ్‌లకు బాట పేరుతో అదనంగా దండకాలు చేస్తున్నారు. జిల్లాలో ఉన్న 5 ఇసుక రీచ్‌లు 2 డీ సిలిటేషన్ పాయింట్ల నుంచి ట్రాక్టర్‌కు రూ.500 టిప్పర్‌కు రూ.2 వేల వరకు అదనంగా వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఈ వసూలుపై వాహనదారులు ఆందోళనకు దిగుతున్నారు. దీనిపై మైనింగ్ శాఖ డీడీ శ్రీనివాసకుమార్ మాట్లాడుతూ రీచ్‌ల వద్దకు బాట వేసేందుకు ఎలాంటి నగదు వసూలు చేయమని ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వలేదని తెలిపారు. ప్రతిమా సంస్థ అధికంగా వసూలు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, దీనిపై ఇప్పటికే మైనింగ్‌శాఖ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని, త్వరలో చర్యలు తీసుకుంటామని చెప్పారు..

● పల్లెపాడు రీచ్‌లో నిరసన

ఇందుకూరుపేట : టిప్పర్‌కు రూ.2వేలు అదనంగా వసూలు చేయడాన్ని నిరసిస్తూ పల్లిపాడు రీచ్ వద్ద శనివారం సింహపురి టిప్పర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రమంతా రీచ్‌లు ఉంటే పల్లిపాడులో మాత్రం అదనంగా వసూలు చేయడం ఏమి టని ప్రశ్నించారు. ఇంత భారీ మొత్తంలో వసూలు చేస్తే టిప్పర్ల యజమా నులు నష్టపోతారని వాపో యారు. అలాగే ముదివర్తి పాలెం రీచ్ వద్ద కూడా బాట విషయంలో ఇరు వర్గాలు పరస్పరం వాదులాడు కున్నా యి.

ఎమ్మెల్యే ప్రసన్నకు తమ్ముని సెగ

- హల్‌చల్ చేసిన రాజేంద్రరెడ్డి ఆడియో వాయిస్
- రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశం

కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి సొంత తమ్ముడి సెగ తగిలింది. నల్లపరెడ్డి కుటుంబంలో నెలకొన్ని ఇంటి పోరు వీధికెక్కింది. 'ప్రసన్నకుమార్‌రెడ్డికి టికెట్టు ఇవ్వొద్దు.' అంటూ స్వయాన ఆయన తమ్ముడు రాజేంద్రరెడ్డి వైసీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డికి విన్నవించుకొంటూ సామాజిక మాధ్యమాల్లో విడుదల చేసిన ఆడియో రికార్డింగ్ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా నిలిచింది.

నెల్లూరు, జనవరి 20 (ఆంధ్ర జ్యోతి) : ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డికి ఆయన తమ్ముడు రాజేంద్రరెడ్డిల మధ్య చాలా ఏళ్లుగా సత్సంబంధాలు లేవు. అన్నకు వ్యతిరేకంగా రాజేంద్రరెడ్డి ఇదివరకే పలు సందర్భాల్లో ఎదురు తిరిగారు. ఈ క్రమంలో ఆయన తాజాగా ఒక ఆడియో విడుదల చేశారు. ఆ ప్రసంగంలో తన అన్న ప్రసన్న కుమార్ రెడ్డిని కోవూరు ప్రజలు ఎమ్మెల్యేగా వద్దనుకొంటున్నారని, వైసీపీ అభ్యర్థిని మార్పు చేయాలని జగన్‌మోహన్‌రెడ్డిని కోరుతున్నట్లు ఆడియోలో మాట్లాడారు. ప్రసన్న కుమార్‌రెడ్డి కోవూరు నియోజకవర్గంలోని ఒక్కో మండలాన్ని ఒక్కో నాయకునికి పంచేశారని, వారు ఆ మండలంలో ఎమ్మెల్యేలుగా చెలరేగిపోతున్నారని, ప్రజలను వేదిస్తున్నారని అన్నారు. తమ బాధలు చెప్పుకోవడానికి వెళ్లిన ప్రజలను ప్రసన్న కుమార్‌రెడ్డి పట్టించుకోవడం లేదని, మళ్లీ గెలుస్తాననే అహంతో ఎవరినీ లెక్క చేయడం లేదని అన్నారు. ఈ ఎన్నికల్లో ప్రసన్నకుమార్‌రెడ్డిని ప్రజలు వద్దనుకొంటున్నారని, కాబట్టి కోవూరు టికెట్టు ప్రసన్నకు ఇవ్వొద్దని జగన్‌ను కోరుతున్నట్లు రాజేంద్రరెడ్డి ఆడియో ద్వారా వివరించారు.



● వీధికెక్కిన కుటుంబ కలహాలు

ఎమ్మెల్యే ప్రసన్నకు ఆయన తమ్ముడు రాజేంద్రరెడ్డికి మధ్య విభేదాలు ఉన్న విషయం ప్రజలకు తెలిసిందే. అయితే ఏకంగా అన్నకు టికెట్టు ఇవ్వొద్దంటూ తమ్ముడు సామాజిక మాధ్యమాల ద్వారా జగన్‌ను కోరడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గత ఎన్నికల సమయాల్లో కూడా రాజేంద్రరెడ్డి తన అన్న ప్రసన్నకుమార్‌రెడ్డికి వ్యతిరేక పార్టీల్లో చేరి పని చేయడం, పోటీ చేసిన సందర్భాలు ఉన్నాయి. అయితే ఈ ఎన్నికల సందర్భంగా ప్రసన్నను డైరెక్ట్‌గా టార్గెట్ చేసి తన అన్నకు టికెట్టే ఇవ్వొద్దంటూ జగన్‌ను కోరడం, ఎమ్మెల్యే ప్రసన్నకు అహం పెరిగిపోతోందని ఘాటు వ్యాఖ్యలు చేయడం విశేషం. మొత్తానికి జిల్లాలో పేరుమోసిన రాజకీయ కుటుంబంగా గుర్తింపు పొందిన నల్లపరెడ్డి కుటుంబం అన్నదమ్ముల అంతర్గత కలహాలతో వీధికెక్కడం గమనార్హం.

- అంగన్‌వాడీల ప్రదర్శనలో ఉద్రిక్తత
- రాస్తారోకోను అడ్డుకున్న పోలీసులు, తోపులాట
- రోడ్డుపై ఈడ్చేసిన పోలీసులు
- నాయకులు, అంగన్‌వాడీలకు గాయాలు



కార్మిక సంఘ నాయకులను అరెస్ట్ చేసే సమయంలో అంగన్వాడీలను తోసేస్తున్న మగ పోలీసులు

ఖాకీల కాఠిన్యం!

మహిళలు (అంగన్వాడీలు) అన్న లెక్కలేదు.. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్నారన్న సానుభూతి అంతకన్నా లేదు. పాలక పెద్దలు చెప్పారనో... అధికారుల ఆదేశాలనో నెల్లూరులో ఖాకీలు కర్కశంగా వ్యవహరించారు. శాంతియుతంగా ప్రదర్శన చేసి, రాస్తారోకో చేస్తున్న అంగన్వాడీలపై కఠినంగా వ్యవహించారు. వీరికి మద్దతుగా నిలిచిన కార్మిక సంఘాల నాయకులను అరెస్ట్ చేశారు. అడ్డొచ్చిన అంగన్వాడీలను మగ పోలీసులు రోడ్డుపై ఈడ్చి పడేశారు. దీంతో కొందరికి గాయాలు అయ్యాయి.

\- వివరాలు 7లో..

రేపు డయల్ యువర్ ఆర్ఎం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : జిల్లా పరిధిలోని బస్సు సర్వీసుల గురించి సూచనలు, సలహాలు తెలియజేసేందుకు సోమవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్ఎం పీవీ.శేషయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 0861-23 25196 నెంబరుకు ప్రయాణికులు ఫోన్ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మెమూ రైళ్ల రద్దు పొడిగింపు

బిట్రగుంట, జనవరి 20 : బిట్రగుంట నుంచి విజయవాడ, చెన్నై మధ్య నడుస్తున్న మెమూ రైళ్ల రద్దును పొడిగిస్తూ విజయవాడ రైల్వే డివిజనల్ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 19 నుంచి 28వ తేదీ వరకు రద్దు చేసిన బిట్రగుంట - విజయవాడ మెమూను ఫిబ్రవరి 25 వరకు పొడిగించినట్లు తెలిపారు. ప్రతి రోజు బిట్రగుంట-విజయవాడ (07977), విజయవాడ- బిట్రగుంట (07978) మెమూ రైలు తాత్కాలికంగా రద్దు చేశారు. సోమ, మంగళ, బుధ, గురు, శుక్రవాల్లో నడిచే బిట్రగుంట- చెన్నై (17237) చెన్నై- బిట్రగుంట (17238) మెమూ రైలును కూడా ఫిబ్రవరి 23వ తేదీ వరకు రద్దు చేశారు. విజయవాడ డివిజనల్ పరిధిలో పలు స్టేషన్ల మధ్య మూడో లైను పనులు జరుగుతున్న కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

ఏం జరుగుతుంది!?

- జిల్లాకు చేరిన దొంగ ఎపిక్ కార్డుల కలకలం
- తిరుపతి నుంచి నెల్లూరుకు విచారణ బదిలీ
- అప్పటి చిత్తూరు కలెక్టర్ నేడు నెల్లూరు కలెక్టర్
- హరినారాయణన్‌పై చర్యలు తీసుకుంటారంటూ ప్రచారం
- జిల్లా రాజకీయ, ఉద్యోగ వర్గాల్లో కలకలం

నెల్లూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల్లో జరిగిన దొంగ ఓటరు ఎపిక్ కార్డుల వ్యవహారం ఇప్పుడు జిల్లాకు చేరింది. ఈ కేసులు తిరుపతి నుంచి నెల్లూరుకు బదిలీ కావడం ఒక విషయమైతే అప్పటి చిత్తూరు కలెక్టర్, ఆ జిల్లా ఎన్నికల అధికారి ఎం.హరినారాయణన్ ప్రస్తుతం నెల్లూరు కలెక్టర్‌గా ఉండటం మరో విశేషం. దీంతో దొంగ ఓటరు కార్డుల వ్యవహారం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. మూడేళ్ల క్రితం తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల సమయంలో తిరుపతి, శ్రీకాళహస్తి నియోజక వర్గాల్లో భారీగా దొంగ ఓటరు కార్డులు తయారయ్యాయి. అప్పటి తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ గిరీషా లాగిన్ ఐడీతో వేల సంఖ్యలో ఎపిక్ కార్డులు డౌన్‌లోడ్ చేసి వాటి ద్వారా దొంగ ఓటరు కార్డులను తయారు చేశారు. ఈ కార్డులతో పలువురు ఎన్నికల సమయంలో ఓట్లు వేస్తుండగా టీడీపీ, బీజేపీ వంటి ప్రతిపక్ష పార్టీలు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నాయి. దీనిపై అప్పట్లోనే కలెక్టర్, ఎస్పీ వంటి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదు. తాజాగా సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం అప్పట్లో జరిగిన అక్రమాలపై దృష్టి సారించింది. అప్పటి తిరుపతి కమిషనర్, ప్రస్తుత అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషాను సస్పెండ్ చేస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. ఇది జరిగి 24 గంటలు గడవక ముందే తిరుపతి జిల్లాలో పనిచేస్తున్న పలువురు తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సీఐలపై వేటు పడింది. అదే సమయంలో అప్పట్లో ఈ అక్రమాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన అధికారులపై కూడా దృష్టి పెట్టింది. ఈ క్రమంలోనే అప్పటి చిత్తూరు కలెక్టర్ అయిన ఎం.హరినారాయ ణన్‌పై చర్యలకు ఎన్నికల సంఘం సిద్ధమైనట్లు ప్రభుత్వ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. దీంతో జిల్లాలో ఒక్కసారిగా కలకలం రేగింది. ప్రస్తుతం అధికార, ఉద్యోగ వర్గాలన్నీ ఎన్నికల విధుల్లో ఉన్నాయి. దీంతో ఎప్పుడు ఏం జరుగు తుందోనన్న ఉత్కంఠ నెలకొంది. మరోవైపు తిరుపతి ఉప ఎన్నికల్లో నమోదైన కేసులను నెల్లూరు సైబర్ క్రైమ్‌కు బదిలీ చేసి, విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించారు. అందులో నలుగురు డీఎస్పీలను నియమించగా వీరిలో నెల్లూరు నగర, కావలి డీఎస్పీలు ఉన్నారు. తిరుపతిలో జరిగిన అక్రమాల వ్యవహారం ఇప్పుడు మొత్తంగా నెల్లూరు జిల్లాకు చేరుకోవడంతో అన్ని వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.



● తెరపైకి ఎమ్మెల్సీ ఎన్నికలు

తిరుపతి వ్యవహారం నేపథ్యంలో గత ఏడాది ప్రారంభంలో జరిగిన ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు తెరపైకి వచ్చాయి. అప్పట్లో అనర్హులను ఓటర్లుగా చేర్చినట్లు ప్రతిపక్షాలు ఆరోపణలు చేశాయి. పదోతరగతి చదివిన వారికి పట్టభద్రుల ఓటు కల్పించడం, ప్రైవేట్ స్కూళ్లలో అటెం డర్లకూ ఉపాధ్యాయ ఓటు కల్పించడం వంటి అనేక వ్యవహారాలు వెలుగు చూశాయి. ఈ దొంగ ఓట్ల నమోదుకు సహకరించకపోవడంతోనే నాడు జిల్లా విద్యాశాఖాధికారిని బదిలీ చేసినట్లు కూడా ప్రచారం జోరుగా జరిగింది. ఇన్ని ఆరోపణలు వెల్లువెత్తినా ఎలాంటి విచారణ జరగలేదు. దీంతో ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో జరిగిన అక్రమాలపై కూడా విచారణ జరపాలంటూ పలువురు ఎన్నికల సంఘాన్ని కోరుతుండటం సంచలనంగా మారింది.

ఎన్నికలకు సర్వసన్నద్ధం కావాలి

● జిల్లా కలెక్టరు ఎం. హరినారాయణన్

కందుకూరు, జనవరి 20 : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు అధికార యంత్రాంగం సర్వసన్నద్ధం కావాలని కలెక్టరు ఎం.హరినారాయణన్ సూచించారు. కందుకూరు నియోజకవర్గానికి సంబంధించి ఈవీఎంలు భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూం, ఈవీఎంల ర్యాండమైజేషన్, పోలింగ్ సిబ్బందికి ఈవీఎంలు పంపిణీ కోసం స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భవనాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిబంధనలకు అనుగుణంగా కళాశాలలో గదులు ఉన్నందున వాటిని వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు. పోలింగ్ కేంద్రాలుగా ఎంపిక చేసిన పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలలో ఈ నెల 31లోపు మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. అన్ని నియోజకవర్గాలలో ఈ నెల 22న తుది ఓటర్ల జాబితా విడుదల చేయాలన్నారు. అలాగే 25న జాతీయ ఓటర్ల దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా జరపాలని, ప్రతిఒక్కరూ విధిగా ఓటుహక్కు వినియోగించుకునేలా ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించాలన్నారు. ఆయన వెంట కందుకూరు సబ్ కలెక్టరు జి. విద్యాధరి, తహసీల్దారు ఆర్. బ్రహ్మయ్య, మున్సిపల్ కమిషనర్ ఎస్. మనోహర్, టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.



టీఆర్ఆర్ జూనియర్ కళాశాలలో స్ట్రాంగ్ రూం కోసం గదులను పరిశీలిస్తున్న కలెక్టరు హరినారాయణన్

సమస్యల పరిష్కారం కోసం కదంతొక్కిన అంగన్వాడీలు



కావలి టౌన్: ట్రంకురోడ్డు బ్రిడ్జి కూడలిలో రాస్తారోకో చేస్తున్న అంగన్వాడీలు



కందుకూరు: నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న అంగన్వాడీలు

కావలిటౌన్, జనవరి 20: అంగన్వాడీలు చేపట్టిన సమ్మెలో భాగంగా శనివారం ట్రంకురోడ్డు బ్రిడ్జి కూడలిలో అంగన్వా డీలు రాస్తారోకో చేసి నిరసన తెలిపారు. ఆర్డీవో కార్యాలయం వద్ద నుంచి భారీ ప్రదర్శన నిర్వహించి బ్రిడ్జి కూడలిలో రాస్తారోకో నిర్వహిం చడంతో ట్రంకు రోడ్డుకిరువైపులా ఉదయగిరి రోడ్డు, తుమ్మల పెంట రోడ్డులో భారీగా వాహనాలు నిలిచి పోయి ట్రాఫిక్ స్తంభించింది. వన్ టౌన్ సీఐ రాజేష్, టూటౌన్ సీఐ శ్రీనివాసులు పర్యవేక్షణలో పోలీసులు ట్రాఫిక్ పునరుద్ధరించారు. కార్యక్రమంలో సీఐటీయు నాయకుడు పసుపులేటి పెంచులయ్య, యూనియన్ నేతలు రఘురావమ్మ, విజయలత, సుభాషిణి, వజ్రమ్మ, రమాదేవి, సీపీఎం నేతలు మాల్యాద్రి, వెంకయ్య, అమీర్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 40 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలు శనివారం కందుకూరు ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు కార్యాలయాన్ని ముట్టడించి నిరసన తెలిపారు. అనంతరం అక్కడి నుంచి పోస్టాఫీసు సెంటర్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించి రాస్తారోకో చేశారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వరి, రహంతున్నీషా, సరస్వతి, కేశవకుమారి, శంషాద్, అనూరాధ, ఎస్‌ఏ గౌస్, జీవీబీ కుమార్, డి రామమూర్తి, పవన్‌కుమార్, రైతుసంఘం నాయకులు ముప్పరాజు కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: సమస్యల సాధన కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు చేపట్టిన సమ్మె రోజురోజుకు ఉధృతంగా మారుతోంది. ఈ క్రమంలో పట్టణంలోని సోమశిల రోడ్డు సెంటర్‌లో శనివారం అంగన్‌వాడీలు మానవహారంగా ఏర్పడి రాస్తారోకో నిర్వహించి నిరసనలతో హోరెత్తించారు. వీరికి మద్దతుగా సీపీఎం, సీఐటీయూ నాయకులు ఆత్మకూరు నాగయ్య, కే. డేవిడ్‌రాజు రాస్తారోకోలో పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమ్మెతో అంగన్‌వాడీలు మూతపడి చిన్నారులు, బాలింతలు, గర్భిణులు ఇబ్బందులు పడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించక పోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కమిటీ ప్రధాన కార్యదర్శి పీ. రాధ, సెక్టార్ లీడర్లు కే. రమణమ్మ, కామేశ్వరీ, జమీల, విజయలక్ష్మీ, రూతమ్మ, విజయలక్ష్మీ, శ్రీదేవి, ఏ మస్తానమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

జనసైనికుడికి ఆర్థిక సాయం



కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న జనసేన నాయకులు

ఉదయగిరి రూరల్, జనవరి 20: మండల జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు గుడిపాటి హరికృష్ణ ఇటీవల కిడ్నీ వ్యాధితో మృతిచెందారు. దీంతో శనివారం జనసేన పార్టీ నాయకులు వారి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. నియోజకవర్గ జనసేన నాయకులు భోగినేని కాశీరావు రూ.10వేలు, మండల జనసేన నాయకులు సురేంద్రరెడ్డి, చింతల శ్రీను, గాదె నరేంద్ర రూ.15వేలు చొప్పున రూ.25 వేల నగదును హరికృష్ణ కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నెమళ్లదిన్నె సర్పంచ్ తోకల రామచంద్ర, జనసేన నాయకులు అల్లూరి రవీంద్ర, పోలిశెట్టి శ్రీనివాసులు, పసుపులేటి తిరుపతయ్య, శ్రీను, చంద్రబాబు పాల్గొన్నారు.

ప్రణాళికల తయారీపై దృష్టి సారించాలి

ఉదయగిరి రూరల్, జనవరి 20: పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ సహాయకులు పంచా యతీ అభివృద్ధి ప్రణాళికల తయారీపై దృష్టిసారించాలని, ఈనెల 27న గ్రామసభలు నిర్వహించి నివేదిక అందించాలని ఎంపీడీవో ఈశ్వరమ్మ తెలిపారు. శనివారం స్థానిక స్త్రీశక్తి భవనంలో కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఈవోపీఆర్డీ మల్లికార్జున, ఏవో రేణుకా పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు, జనవరి 20: మున్సిపల్ మాజీ చైర్మన్ దివి లింగయ్యనాయుడు ఇంటి పరిసరాల్లో లైన్‌వర్క్ జరుగుతున్నందున ఆ పరిసర ప్రాంతాలలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పట్టణ ఎఈ టీవీ నరసింహం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలో ఉన్న తూర్పు వడ్డిపాలెం, తూర్పు కమ్మపాలెం, తూర్పు సాలిపాలెం, రాళ్లవీధి, మారెమ్మమిట్ట, కోటారెడ్డి నగర్, క్లబ్‌రోడ్డు, ఆదిఆంధ్రకాలనీ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

22న అంగన్‌వాడీల నియామకానికి ఇంటర్వ్యూలు

ఉదయగిరి, జనవరి 20: ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఉదయగిరి, సీతారామపురం మండలాల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల పోస్టులకు సంబంధించి సోమవారం ఇంటర్వ్యూలు జరుగుతాయని సీడీపీవో పచ్చవ లావణ్య శనివారం తెలిపారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని ఆమె కోరారు.

ప్రశాంతంగా నవోదయ పరీక్ష



ఉన్నత పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఉదయగిరి, జనవరి 20: నవోదయ 6వ తరగతి ప్రవేశ పరీక్ష శనివారం ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రశాంతంగా నిర్వహించారు. పరీక్ష కేంద్రంలో మొత్తం 240 మంది విద్యార్థులకు గానూ 111 మంది హాజరయ్యారు. 129 మంది గైర్హాజరైనట్లు చీఫ్ సూపరిం టెండెంట్ బాలకేశవులు తెలి పారు. సెంటర్ లెవల్ అబ్జర్వ ర్‌గా పీ. సత్య వ్యవహరించారు.

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): స్థానిక ఆదర్శ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నవోదయలో 6వ తరగతి ప్రవేశానికి విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో 438 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 289 మంది హాజరయ్యారు. 149 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ నాగలక్ష్మి, అబ్జర్వర్‌గా ప్రీతి వ్యవహరించారు.

మంత్రి కాకాణిని కలిసిన వైసీపీ నాయకులు

ఉదయగిరి రూరల్, జనవరి 20: రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని శనివారం నెల్లూరులోని ఆయన అతిథిగృహంలో ఉదయగిరి వైసీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉదయగిరి పట్టణ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వినతిపత్రం అందజేశారు. స్పందించిన మంత్రి అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో మాజీ ఎంపీపీ చేజర్ల సుబ్బారెడ్డి, ఉప సర్పంచ్ ముర్తుజా, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ యస్థానీ, వైస్ మాజీ ఎంపీపీ బాలిబోయిన శ్రీనివాసులు, నాయకులు షేక్ యస్థానీ, అక్కులరెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల్లో వికసిత్ భారత్



డ్రోన్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సీతారామపురం, జనవరి 20: మండల పరిధిలోని అయ్యవారిపల్లి, పోలంగారిపల్లి గ్రామాల్లో శనివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో భార్గవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు కేంద్ర ప్రభు త్వం అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్ డ్రోన్ ద్వారా పొలాలకు ఎరువులు, పురుగు మందులను ఎలా పిచికారి చేయాలో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు, ఎమ్మార్వో సుధాకర్ రావు, డాక్టర్ స్వప్న, హౌసింగ్ ఏఈ రామకృష్ణ, ఈసీ సువర్ణయ్య, ఏపీఎం సుధాకర్ , ఎంపీటీసీ అల్లూరు రాజు, పంచాయతీ కార్యదర్శులు, బీజేపీ ఉదయగిరి నియోజకవర్గ నాయకుడు రమేష్ పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు

సంగం, జనవరి 20: వేసవిలో నెల్లూరు పట్టణంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు నెల్లూరు మేయర్ పొట్లూరి స్రవంతి తెలిపారు. అందులో భాగంగా శనివారం ఆమె కార్పొరేటర్లతో కలిసి సంగం బ్యారేజీకి దక్షిణ వైపు నిర్మించి ఉన్న ఇన్‌టెక్ వెల్‌ను పరిశీలించారు. అనంతరం మహమ్మదాపురం వెళ్లి అక్కడ నీటి ఫిల్టరేజేషన్‌ను పరిశీలించారు. ఆమె వెంట పలువురు కార్పొరేటర్లు ఉన్నారు.

మాలకొండ ఆదాయం రూ. 9,12,817

వలేటివారిపాలెం, జనవరి 20 : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుండి 9,12,817 ఆదాయం లభించినట్లు ఆలయ సహాయ కమిషనర్ కేబీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. అష్టోత్తరం టిక్కెట్‌ల ద్వారా రూ. 8,550, కుంకుమార్చన ద్వారా రూ. 28,160, తల నీలాలు ద్వారా రూ. 44,400, వాహన పూజలు ద్వారా రూ. 4,140, ప్రత్యేక దర్శనం ద్వారా రూ. 2,99,300, స్థలపురాణం పుస్తకాలు విక్రయం ద్వారా రూ. 1,480, రూముఅద్దెలు ద్వారా రూ. 33,460, కవర్లు ద్వారా రూ. 6,300, లడ్డుప్రసాదం ద్వారా రూ. 2,06,755, అన్నదానం ద్వారా రూ. 2,40,040, విరాళముల ద్వారా రూ. 40,232 ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ శ్రీనివాసరావు తెలియజేశారు.

ఒంగోలు పశు జాతి అద్దె గర్భం విజయవంతం



పశు పౌష్టికాహారం అందచేస్తున్న డాక్టర్ సోమయ్య (డీడీ)

బిట్రగుంట, జనవరి 20: ఒంగోలు పశు జాతి అద్దె గర్భం విజయవంతమై కోడెదూడను ప్రసవించడం కావలి నియోజక వర్గంలో మొదటిదని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ సోమయ్య అన్నారు. బోగోలు మేజర్ పంచాయతీకి చెందిన గనాధి మాల్యాద్రి యొక్క ఒంగోలు జాతి ఆవుకు పిండ మార్పిడి ద్వారా ప్రసవించిన ఒంగోలు జాతి కోడెదూడను శనివారం ఆయన సందర్శించారు. ఆవు, దూడకు అవసరమైన పౌష్టికాహార ఓషదాలు, మినరల్ మిచ్చర్ అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు డివిజనల్ పశువైద్యులు వేంకటేశ్వర నాయక్, స్థానిక పశువైద్యులు శ్రావన్‌కుమార్‌లు పాడిపశు యజమాన్ని పిండమార్పిడికి ఒప్పించి విజయం సాధించారని అభినందించారు. ఆ కోడెదూడ ఆరోగ్య పరిస్థితి పరీక్షించి నాయక్ అని నామకరణం ఈ కార్యక్రమంలో రమేష్ నాయక్, ఏఎంఏ శ్రీకాంత్, సిబ్బంది పాడిరైతులు తదితరులు ఉన్నారు.

22న ప్రభుత్వం సెలవు ప్రకటించాలి

కలిగిరి, జనవరి 20: రామ మందిరం నిర్మాణ కార్యక్రమంలో భాగంగా ఈనెల 22న అయోధ్యలో బాలరాముడి విగ్రహం ప్రాణ ప్రతిష్ట సందర్భంగా మనరాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలకు సెలవు ప్రకటించాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నందనవనం ప్రభాకరరావు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు.

23 నుంచి ఎఫ్‌ఏ-3 పరీక్షలు

ఉదయగిరి రూరల్, జనవరి 20: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఈనెల 23వ తేదీ నుంచి ఎఫ్‌ఏ-3 పరీక్షలు జరుగుతాయని ఎంఈవో మస్తాన్‌వలి తెలిపారు. శనివారం ఆయన స్థానిక మండల విద్యా వనరుల కార్యాలయంలో సీఆర్‌ఎంటీలతో సమీక్షించారు.

సోమశిల నుంచి మా వాటా నీరు ఇప్పించండి!

● కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే మహీధరరెడ్డి



కలెక్టరుతో చర్చిస్తున్న ఎమ్మెల్యే మహీధరరెడ్డి

కందుకూరు, జనవరి 20: సోమశిల జలాశయం నుంచి రాళ్లపాడు రిజర్వాయరుకు రావాల్సిన వాటానీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మహీధరరెడ్డి కలెక్టర్ హరినారాయణన్‌ను కోరారు. శనివారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ హరినారాయణన్‌ను ఎమ్మెల్యే కలిసి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని, బిల్లులు సకాలంలో విడుదల చేయాలని కోరారు. అలాగే రాళ్లపాడు రిజర్వాయరు ఆయకట్టులో పంటలను కాపాడేందుకు ఆరుతడి పంటలకు నీరివ్వాలని రైతులు చేస్తున్న విజ్ఞప్తిని పరిశీలించాలని కోరారు. రానున్న వేసవిలో మంచినీటిపథకాలకు నీటి ఎద్దడి రాకుండా రిజర్వాయరులో తగినంత నీటిని నిల్వ చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టరు జి.విద్యాధరి తదితరులు పాల్గొన్నారు.

● రాళ్లపాడు రిజర్వాయరులో ప్రస్తుతం ఉన్న నీటిని ఆరుతడి పంటలకు ఇవ్వాలని వరికూటి కృష్ణారెడ్డి తదితర రైతులు కలెక్టరుకు వినతిపత్రం అందజేశారు. రాళ్లపాడు, సాయిపేట తదితర గ్రామాల పరిధిలో పంటలు ఎండిపోతున్నందున రిజర్వాయరులోని నీటిని కుడికాలువకు వదిలితే ఆరుతడులు వేసుకుంటామని వారు విజ్ఞప్తిచేశారు. రిజర్వాయరులో నీటి నిల్వ, భవిష్యత్తు అవసరాలపై చర్చించి అవకాశం ఉంటే తగుచర్యలు తీసుకుంటామన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న రామదూత స్వామి చారిటబుల్ ట్రస్ట్ బాధ్యులు

కావలి, జనవరి 20: శ్రీరామదూత స్వామి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు శనివారం ఆ ట్రస్ట్ బాధ్యులు దుప్పట్లు పంపిణీ చేశారు. కావలి పట్టణం ముసునూరు వినాయకనగర్, ఎస్టీ కాలనీలలో కావలి రూరల్ మండలం కొత్తపల్లి ఎస్సీ, బీసీ కాలనీలలో రామదూత స్వామి చేవూరు ఆశ్రమం వారు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బాధ్యులు బెల్లంకొండ హనుమంతరావు, ఎంవీ చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

23న అరుణాచలంకు ప్రత్యేక బస్సు

కందుకూరు, జనవరి 20: నూతన సంవత్సరంలో మొదటి పౌర్ణమిని పురస్కరించుకుని ఈనెల 23న సాయంత్రం 8 గంటలకు కందుకూరు నుంచి అరుణా చలంకు ప్రత్యేకబస్సు ఏర్పాటుచేసినట్లు డిపో మేనేజరు పెద్దన్నశెట్టి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యాత్రలో తిరుత్తిని, తిరువల్లూరు, విష్ణుకంచి, శివకంచి, కంచి కామాక్షి, గోల్డెన్‌టెంపుల్ దర్శనంతో పాటు అరుణాచలం గిరిప్రదక్షిణ ఉంటుందని ఆయన తెలిపారు. ప్రయాణికులకు భోజన సౌకర్యంతో కలిపి టిక్కెట్ రూ.2600గా నిర్ణయించామని, ఆసక్తి కలిగిన వారు సంప్రదించాలని కోరారు. పూర్తి వివరాలకోసం 9959225698 నెంబరును సంప్రదించాలని కోరారు.

కోడి పందేల స్థావరంపై దాడి

కొండాపురం, జనవరి 20: కోడిపందాల స్థావరంపై ఎస్‌ఐ ఖాజావలి తమ సిబ్బందితో శనివారం దాడి నిర్వహించారు. సత్యవోలు, దూబగుంట అటవీప్రాంతంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో దాడి చేసి ఐదుగురు పందెం రాయుళ్ళను అదుపులోకి తీసుకొని, వారివద్దనుండి రూ.2400నగదు, మూడు కోళ్ళు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుస్తామని ఎస్‌ఐ తెలిపారు.

మెప్మా ఆధ్వర్యంలో హ్యాండ్‌వాష్ సెంటర్ ఏర్పాటు

కందుకూరు, జనవరి 20: కందుకూరు మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో శనివారం హ్యాండ్‌వాష్ సెంటర్‌ను మున్సిపల్ కమిషనర్ ఎస్ మనోహర్ ప్రారంభించారు. ప్రతి ఒక్కరికీ చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెప్మా సీఎంఎం ఇంగర్సల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పందులను గ్రామాల్లోకి వదలొద్దు



పందుల పెంపకందారులను నిలదీస్తున్న స్థానికులు

బిట్రగుంట, జనవరి 20: స్వలాభం చూసుకుంటూ గ్రామాల్లో పందులను వదిలేస్తున్నారే తప్ప ప్రాణాపాయంగా ఉందంటే పట్టించుకోరా అని గ్రామస్థులు పందుల పెంపకందారులను నిలదీశారు. బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరులో శనివారం కొందరు పందులను పట్టుకునే వారు సంచరిస్తుండటం స్థానికులు గుర్తించారు. విచ్చలవిడిగా పందులను గ్రామంలో విడిచి పెట్టడం వలన ఇళ్లలోకి చొరబడుతున్నాయని, అడ్డగిస్తే దాడి చేస్తున్నాయన్నారు. గ్రామాల్లో పందులను వదలడం మంచిది కాదని ఉన్న వాటిని వెంటనే పట్టుకు పోవాలని హెచ్చరించారు. పంచాయతీ అధికారులు కూడా పందుల పెంపకందారులపై తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు.

ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి విజేత ముత్యాలపాడు జట్టు



మండల స్థాయిలో విజేతగా నిలిచిన ముత్యాలపాడు వాలీబాల్ జట్టు

లింగసముద్రం, జనవరి 20 : ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీల్లో మండల స్థాయిలో వాలీబాల్ పోటీల్లో ముత్యాలపాడు వాలీబాల్ జట్టు విజేతగా నిలిచింది. శనివారం లింగసముద్రంలోని కేఆర్ జడ్పీ హైస్కూల్ ఆవరణలో ముత్యాలపాడు, పెదపవని-1 జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ముత్యాలపాడు వాలీబాల్ జట్టు విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ యు శేషబాబు విజేత ముత్యాలపాడు జట్టును అభినందించారు. ఈ జట్టు నియోజకవర్గ స్థాయిలో ఆడుతుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కన్నె కృష్ణ, వైసీపీ నాయకులు కన్నె రాజారావు, డిజిటల్ అసిస్టెంట్ జైనులాబ్దిన్, సోషల్ మీడియా ఆర్గనైజర్ గుండాబత్తిన కొండలరాయుడు పాల్గొన్నారు.

పైపులైన్ మరమ్మతు పనుల పరిశీలన



మంచినీటి పైపులైన్ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

కావలి, జనవరి 20: కావలి పట్టణం ఉదయగిరి రోడ్డులోని ఐడీఎస్‌ఎంటీ కాలనీ వద్ద మరమ్మతులకు గురైన మంచినీటి పైపులైన్‌కు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ జీ శ్రావణ్ కుమార్ తెలిపారు. పైపులైన్ మరమ్మతు పనులను శనివారం ఆయన పరిశీలించారు. మూడు రోజులలో దీని నిర్మాణం పూర్తి చేసి పట్టణ ప్రజలకు తాగునీరు ఇవ్వాలని అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ

లింగసముద్రం, జనవరి 20 : మండలంలో జరిగిన ఉపాధిహామీ పనులపై గ్రామాలలో సామాజిక తనిఖీ అధికారులు శనివారం విచారణ చేపట్టారు. మండలంలోని 16 గ్రామ పంచాయతీలలో ఉపాధిహామీ, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి పథకానికి సంబంధించి జరిగిన సుమారు 300 పనులపై రూ.10 కోట్ల మేర ఖర్చు చేశారని డీఆర్‌పీల బృందం ఇన్‌చార్జ్ స్టేట్ రిసోర్స్ పర్సన్ (ఎస్‌ఆర్‌పి) లోకేష్ చెప్పారు. గ్రామాలలో ఇంటింటికీ తిరిగి కూలీలను విచారించి, చేసిన పనులను కూడా పరిశీలిస్తారని చెప్పారు. అలాగే విచారణ అనంతరం గ్రామాలలో గ్రామసభలు నిర్వహించి, విచారణ నివేదికను గ్రామ ప్రజలకు చదివి వినిపించడం జరుగుతుందన్నారు. ఈ విచారణ ఈనెల 27వ తేదీ వరకు జరుగుతుందన్నారు. అన్ని గ్రామ పంచాయతీలలో విచారణ పూర్తయిన అనంతరం లింగసముద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద ప్రజావేదిక నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ప్రజావేదిక నిర్వహించే తేదీని తరువాత తెలియజేయనున్నట్లు తెలిపారు.

అన్ని వర్గాల వారిని మోసం చేసిన జగన్ : బొల్లినేని



ఇంటింటికి తిరిగి కరపత్రాలు అందచేస్తున్న బొల్లినేని వెంకటరామారావు

వింజమూరు, జనవరి 20 : పట్టణంలోని సిద్ధార్థనగర్, అశోక్‌నగర్‌లలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ ప్రజాదీవెన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మాజీ శాసన సభ్యులు, టీడీపీ ఇన్‌చార్జి బొల్లినేని వెంకటరామారావు పాల్గొని మాట్లాడుతూ వైసీపీ పాలనలో జగన్మోహన్‌రెడ్డి అన్ని వర్గాల వారిని మోసం చేశారన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందన్నారు. ఇంటింటికి తిరిగి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే టీడీపీ- జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రతి హామీని సమర్థవంతంగా అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు గొంగటి రఘునాథరెడ్డి, నాయకులు చల్లా వెంకటేశ్వర్లు, ఆర్మ్ క్రిష్ణయ్య, కొండపల్లి వెంకటేశ్వర్లు, భాష్యం నాయుడు, చావా మహేంద్ర, చల్ల శ్రీను, మంచాల శ్రీనివాసులునాయుడు, గుమ్మా మాలకొండయ్య, జనసేన నాయకులు బండారు లక్ష్మీనారాయణ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ నేత పెంచలయ్య మృతికి పలువురి సంతాపం

బిట్రగుంట, జనవరి 20: బోగోలు మండల సీనియర్ నాయకుడు తూపిరి పెంచలయ్య (83) శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, టీడీపీ నాయకుడు కావ్యకృష్ణారెడ్డి పెంచలయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి, కావలి మాజీ ఏఎంసీ చైర్మన్ సుకుమార్‌రెడ్డి ఫోన్లో కుటుంబ సభ్యులతో మాట్లాడి సానుభూతి తెలియచేశారు. వైసీపీ మండల కన్వీనర్ వీరరఘు, సీనియర్ నేతలు అంకులయ్య, రమణయ్య, మాల్యాద్రి, వెంకటేశ్వర్లురెడ్డి, శ్రీనివాసులు, ఎంపీటీసీలు, పార్టీ కార్యకర్తలు టీడీపీ మండల కన్వీనర్ నాగేశ్వరావు, మాధవరావు, వేంకటేశ్వర్లు, బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, కాంగ్రెస్ నాయకుడు జహీర్, సీపీఎం నాయకుడు వెంకయ్య, పీఎస్‌ఆర్ ట్రస్ట్ నిర్వాహకులు వెంకటేశ్వర్లు, కావలి, అల్లూరు, దగదర్తి మండలాలకు చెందిన వివిధ పార్టీల నేతలు పెంచలయ్య మృతికి సంతాపం తెలియచేశారు. బోగోలులో జరిగిన అంత్యక్రియలో పాల్గొన్నారు.

కావలి టీడీపీ టికెట్ పసుపులేటికి ఇవ్వాలి

● మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ ప్రభాకర్ నాయుడు



మాట్లాడుతున్న డాక్టర్ ప్రభాకర్‌నాయుడు

కావలి టౌన్, జనవరి 20: కావలి టీడీపీ టికెట్ బీసీ వర్గానికి చెందిన పసుపులేటి సుధాకర్‌కు ఇవ్వాలని మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ ప్రభాకర్‌నాయుడు కోరారు. శనివారం పీఎస్సార్ ట్రస్ట్ ప్రభాకర్‌నాయుడు ఆసుపత్రిలో ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ఎన్టీఆర్ ఆశయాలనకునుగుణంగా కావలి ఎమ్మెల్యే టిక్కెట్ బీసీ కులానికి చెందిన పసుపులేటి సుధాకర్‌కు కేటాయించాలన్నారు.

వాసవీ క్లబ్ లెజెండ్స్ కార్యవర్గం ఎన్నిక



బాధ్యతలు స్వీకరించిన వాసవీక్లబ్ లెజెండ్స్ కార్యవర్గం సభ్యులు

కందుకూరు, జనవరి 20: కందుకూరు వాసవీక్లబ్ లెజెండ్స్ ప్రెసిడెంట్‌గా రవ్వా శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా ఇన్నమూరి శ్రీను, కోశాధికారిగా చీదెళ్ల కృష్ణలను ఎన్నుకున్నారు. వనితాక్లబ్ ప్రెసిడెంటుగా నట రాజకుమారి, ప్రధానకార్యదర్శిగా నారాయణ సుకన్యలు నియమితులయ్యారు. వాసవీక్లబ్ జిల్లా ఇన్‌చార్జి గుర్రం మంజులకుమారి, జోన్ చైర్మన్ కోట వెంకటేశ్వర్లు వీరికి బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో చక్కా కేశవరావు, హేమంత్, చీదెళ్ల హరి తదితరులు పాల్గొన్నారు. కాగా, తటవర్తి హేమంత్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని వాసవీక్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలో రహదారుల వెంట గుడారాలలో నివసిస్తున్న సంచారజాతుల వారికి శనివారం అన్నవితరణ కార్యక్రమం నిర్వహించారు.

పల్లెల్లో దోమల స్వైరవిహారం

● వ్యాధులతో అల్లాడుతున్న ప్రజలు

అల్లూరు, జనవరి 20 : మండలంలోని గ్రామాల్లో ప్రజలు దోమలతో అల్లాడుతున్నారు. మురికి కాలువలు దోమల ఉత్పత్తికి కారణమవుతున్నాయి. గత ప్రభుత్వాల్లో ఈ సీజన్‌లో ఇంటింటికీ వైద్య, ఆరోగ్య సిబ్బంది వెళ్లి అవగాహన కల్పించి నీటి నిల్వలు లేకుండా చూడడంతోపాటు ఆయిల్ బాల్స్‌ను వినియోగించి మురికి గుంటలు, కాలువల్లో లార్వా ఉత్పత్తి కాకుండా చర్యలు తీసుకునేవారు. ఈ ప్రభుత్వంలో ఎటువంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని, ఇప్పటికైనా నగర పంచాయతీ, గ్రామ పంచాయతీల అధికారులు స్పందించి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. గత రెండు నెలలుగా అల్లూరు నగర పంచాయతీతోపాటు మండలంలోని గ్రామాల్లో దోమల ఉధృతి తీవ్రంగా ఉంది. దోమల దాడితో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నా అధికారుల్లో ఏమాత్రం చలనం లేదని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి దోమల నివారణకు చర్యలు చేపట్టి వ్యాధుల బారి నుండి ప్రజలను కాపాడాలని మానవ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్ రాజు కోరుతున్నారు.